ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
CELEBRATING 11TH YEAR ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 45 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 27 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 45 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 27 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ గుండె ఆగిపోతుంది




- కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్‌కే రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయన్న కేటీఆర్
- సంచులు మోసి పేమెంట్ కోటాలో రేవంత్ సీఎం అయ్యారంటూ విమర్శ
- మహిళలకు రూ.2500, తులం బంగారం హామీలు ఏమయ్యాయి? అంటూ నిలదీత
- కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని ఓడించి తీరుతామన్న కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ నిర్వహించిన ఒక్క ప్రెస్ మీట్‌తోనే రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని, అలాంటిది ఆయన అసెంబ్లీకి వస్తే రేవంత్ గుండె ఆగి చనిపోతాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత దోసల అనిల్, కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు."మా అయ్య మొగోడు, తెలంగాణ తెచ్చిన మొనగాడు. ఆయన పేరు నేను బరాబర్ చెప్పుకుంటా" అని కేటీఆర్ అన్నారు. తాను గుంటూరులో ఇంటర్ చదివితే రేవంత్ రెడ్డికి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. "రేవంత్ అల్లుడు కూడా ఆంధ్ర వ్యక్తే కదా? ఆయన చిట్టినాయుడు కాదు, భీమవరం బుల్లోడు" అంటూ వ్యక్తిగత విమర్శలు చేశారు. సంచులు మోసి, జైలుకు వెళ్లి, పేమెంట్ కోటాలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు.ఎన్నికల హామీలను విస్మరించారని విమర్శిస్తూ, రేవంత్ రెడ్డిని "ఎనుముల రేవంత్ కాదు, ఎగవేతల రేవంత్ రెడ్డి" అని అభివర్ణించారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని సోనియా, ప్రియాంక గాంధీలపై ఒట్టువేసి ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు. హామీల గురించి ప్రశ్నిస్తే "గుడ్లు పీకి గోటీలు ఆడుతా", "లాగుల తొండలు ఇడుస్తా" అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాష దారుణంగా ఉందని అన్నారు. తాను తిట్టాలనుకుంటే మూడు భాషల్లో పొల్లు పొల్లు తిట్టగలనని హెచ్చరించారు.రాబోయే ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని ఓడించే బాధ్యత తమదేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కేసీఆర్ అడగడంలో తప్పేముందని ప్రశ్నించారు.

## అభివృద్ధి వదిలేసి బూతులు తిట్టుకుంటున్నారు



- తెలంగాణలో అభివృద్ధిపై చర్చ జరగడం లేదన్న బండి సంజయ్
- అధికార, ప్రతిపక్షాలు బూతుల పురాణం అందుకున్నాయని విమర్శ
- ప్రజలు పాలన కోరుకుంటే గలీజ్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణ
- ఉద్యోగాలు, పెట్టుబడులే రాష్ట్రావసరమన్న కేంద్ర సహాయ మంత్రి

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో అభివృద్ధి పూర్తిగా పక్కదారి పట్టిందని, అధికార, ప్రతిపక్ష పార్టీలు కేవలం బూతులు తిట్టుకోవడానికే పరిమితమయ్యాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు.

వివరాలు 2లో..

## ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం సీడబ్ల్యూసీ కీలక సమావేశం
- మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం
- దేశంలోని రాజకీయ పరిస్థితులు సహా వివిధ అంశాలపై చర్చించనున్న సీడబ్ల్యూసీ

వివరాలు 2లో..



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం

## జలాంతర్గామిలో ప్రయాణించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



- 28న కర్ణాటకలోని కర్వార్ హార్బర్ నుంచి ప్రయాణించనున్న రాష్ట్రపతి
- నాలుగు రోజుల పాటు గోవా, ఝార్ఖండ్, కర్ణాటకలలో పర్యటించనున్న రాష్ట్రపతి
- జలాంతర్గామిలో ప్రయాణిస్తారని తెలిపిన రాష్ట్రపతి భవన్

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. ఈ నెల 28న కర్ణాట కలోని కార్వాడ్

వివరాలు 2లో..

## హైదరాబాద్ - విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

- క్రిస్మస్ ముగియడంతో హైదరాబాద్ వైపు విపరీతంగా వాహనాల ఒత్తిడి
- టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్
- ట్రాఫిక్‌తో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



హైదరాబాద్ పెన్ పవర్::వరుసగా వచ్చిన క్రిస్మస్ సెలవులు ముగియ దంతో హైదరాబాద్‌విజ యవాడ జాతీయ రహదారి భారీ ట్రాఫిక్‌తో నిండిపోయింది. క్రిస్మస్ అనంతరం ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఒకేసారి లక్షలాది

వివరాలు 2లో..

## గజ్వేల్ నియోజకవర్గం సహా సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించింది

- కాంగ్రెస్ గెలుపుతో కేసీఆర్‌కు గుబులు పట్టుకుందన్న మంత్రి
- గజ్వేల్ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించిందని వెల్లడి
- బీఆర్ఎస్‌కు పట్టున్న జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిచిందన్న వివేక్



హైదరాబాద్ పెన్ పవర్:సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లో ఆందోళన మొదలైందని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రాతినిధ్యం

వివరాలు 2లో..

## న్యూఇయర్ పేరుతో అలా చేస్తే పబ్‌లు, రెస్టారెంట్ల లైసెన్సులు రద్దు

- కొత్త సంవత్సరం వేళ 'జీరో డ్రగ్స్' లక్ష్యమన్న సజ్జనార్
- పబ్‌లు, రెస్టారెంట్లు కచ్చితంగా రాత్రి 1 గంటకు మూసివేయాలని స్పష్టీకరణ
- డ్రగ్స్ కేసుల్లోని నిందితులపై నిఘా ఉంచినట్లు తెలిపిన సజ్జనార్

వివరాలు 2లో..



## ఇకపై సాగు చేసేవారికే పెట్టుబడి సాయం

### రైతు భరోసాకు కొత్త రూల్స్..




- సంక్రాంతి కానుకగా యాసంగి రైతు భరోసా నిధులు
- ఈసారి కొత్త నిబంధనలు.. శాటిలైట్‌తో భూముల పరిశీలన
- పంట సాగు చేసే నిజమైన రైతులకే పెట్టుబడి సాయం
- సాగులో లేని భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కోత
- అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై అధికారిక ప్రకటనకు అవకాశం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సంక్రాంతి పండుగ కానుకగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. అయితే, ఈసారి పథకం అమలులో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. కేవలం పంటలు సాగు చేసే నిజమైన రైతులకే ప్రయోజనం చేకూరేలా పక్కా ప్రణాళికతో ముందుకెళు తోంది.గతంలో సాగు చేయని భూములకు కూడా నిధులు అందుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో, ఈసారి ప్రభుత్వం టెక్నాలజీ సాయం తీసుకుంటోంది.

వివరాలు 2లో..

## ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన



- దీర్ఘకాలిక పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్న సీజేఐ
- పర్యావరణ సంస్థలు, నిపుణులు సమర్థవంతంగా పరిష్కారం కనుగొంటారని ఆశాభావం
- ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై ప్రమాదకర స్థాయిలో పెరుగుతోందని ఆందోళన

వివరాలు 2లో..

## కీలక నేతలతో భేటీ అయిన కేసీఆర్.. వేడెక్కుతున్న తెలంగాణ రాజకీయం

- ఫామ్ హౌస్ లో కేటీఆర్, హరీశ్ తదితరులతో కేసీఆర్ భేటీ
- అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- ఫోన్ ట్యాంపింగ్ అంశంపై కూడా చర్చ జరిగినట్టు సమాచారం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ యాక్టివ్ మోడ్‌లోకి వెళ్లారు. వరుస సమావేశాలు, నేతలతో మంతనాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో ఆయన రాజకీయాల్లో దూకుడు పెంచుతున్నారు. ముఖ్యంగా శాసనసభ సమావేశాలు సమీపిస్తున్న వేళ, పార్టీని మళ్లీ పోరాటానికి సిద్ధం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్



వివరాలు 2లో..

## పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు జార్జ్ బుష్ హయాంలోనే ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్



- 2001-2008 మధ్య పుతిన్, జార్జ్ బుష్ మధ్య జరిగిన ప్రైవేటు సంభాషణ బహిర్గతం
- పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఒక సైనిక కూటమని బుష్‌తో పేర్కొన్న పుతిన్
- పాకిస్థాన్‌పై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని ప్రశ్నించిన పుతిన్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మహిళా సర్పంచులారా మీ రాజ్యం మీ చేతుల్లోనే...!

దేశాభివృద్ధిలో గ్రామాల పాత్ర ఎంతో ముఖ్యమైనది. అలాంటి గ్రామాల అభివృద్ధికి నాయకత్వం వహిస్తున్న మహిళా సర్పంచులు నేడు ఒక శక్తివంతమైన మార్పుకు ప్రతీకలుగా నిలుస్తున్నారు. ఒకప్పుడు ఇంటి నాలుగు గోడలకే పరిమితమైన మహిళ, నేడు గ్రామ పరిపాలనను సమర్థంగా నిర్వహిస్తూ తన సామర్థ్యాన్ని నిరూపిస్తోంది. మహిళా సర్పంచులు గ్రామ సమస్యలను లోతుగా అర్థం చేసుకునే సున్నితత్వం కలిగి ఉంటారు. తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యం, విద్య, మహిళా–శిశు సంక్షేమం వంటి అంశాలపై వారు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. అనేక మంది మహిళలు విద్యావంతులు, సామర్థ్యవంతులు అయినా... భర్తలు వారిని వంటింటికి పరిమితం చేసి, సంతకాలు మాత్రమే చేయిస్తున్నారు. సమావేశాల్లో భర్తలే మాట్లాడతారు, నిర్ణయాలు తీసుకుంటారు. పార్టీలు, ఎమ్మెల్యేలు, అధికారులు కూడా భర్తలతోనే డీల్ చేస్తున్నారు. ఇది రాజ్యాంగ సవరణ ఆశయాన్ని దెబ్బతీస్తోంది. స్వచ్ఛమైన గ్రామాలు, పచ్చని పరిసరాలు, పాఠశాలల అభివృద్ధి వంటి కార్యక్రమాలలో మహిళా సర్పంచుల పాత్ర ప్రశంసనీయం. మహిళా సర్పంచ్‌లారా... మీ రాజ్యం మీ చేతుల్లోనే ఉండాలి. ఇది మీ హక్కు, మీ బాధ్యత. ఈ అవకాశాన్ని వృథా చేయకండి. మీరు స్వతంత్రంగా నడిస్తేనే గ్రామాలు నిజంగా మారతాయి! తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిపోయాయి. డిసెంబర్ 22న సర్పంచ్లు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 12,728 సర్పంచ్ స్థానాల్లో సగం కంటే ఎక్కువ మహిళలు గెలిచారు. ఇది 73వ రాజ్యాంగ సవరణ (ఆర్టికల్ 243డి) ప్రకారం 33% రిజర్వేషన్లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే 50%కి పెంచిన ఫలితం. తెలంగాణలో మహిళా సర్పంచ్లు 6,500కు పైగా ఉన్నారు, వార్డు సభ్యుల్లో కూడా సగం మహిళలే. ఇది జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు అధికారం అందించిన విప్లవాత్మక అడుగు. కానీ సమస్య ఇక్కడే మొదలవుతోంది అనేక చోట్ల మహిళా సర్పంచ్లు కేవలం 'పేరు మీద' మాత్రమే ఉంటున్నారు. వారి భర్తలు, కుటుంబ సభ్యులు అధికారం చేపట్టేస్తున్నారు. ఫలానా ఊరు సర్పంచ్ ఎవరు అంటే ఆమె పేరు కాకుండా భర్త పేరే చెబుతారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ సమావేశాలు అంతా భర్తలే నడుపుతున్నారు. ఈ 'ప్రాక్సీ' సమస్య నామినేషన్ నుంచే మొదలవుతుంది. అభ్యర్థి పేరు పక్కన భర్త పేరు, ఫోటోలు, వాట్సాప్ నెంబర్–అంతా ఆయనదే. ఫ్లెక్సీలు, ప్రచారం కూడా ఇద్దరిదే. మహిళా రిజర్వేషన్ అంటే భర్తకు అధికారం ఇచ్చే మార్గమా? ఇది రాజ్యాంగ సవరణ ఆశయాన్ని ఎగతాళి చేస్తున్న దుర్మార్గం. మహిళా రిజర్వేషన్ అంటే భర్తకు అధికారం ఇచ్చే టికెట్ కాదు. అది మహిళల అధికారం కోసం ఉన్నది. ప్రాక్సీ నిషేధం లేదు కాబట్టి నేరుగా జైలు లేదా ఫైన్ లేదు. మహిళా సర్పంచ్ స్వతంత్రంగా పనిచేయకపోతే లేదా డ్యూటీ చేయకపోతే, సెక్షన్ 37 (లాంటి సెక్షన్లు) ప్రకారం జిల్లా కలెక్టర్ లేదా రాష్ట్ర ఎన్నికల కమిషన్ (%ాజుజ%) డిస్ క్వాలిఫై (పదవి తొలగింపు) చేయవచ్చు. కొన్ని సందర్భాలలో మహిళా సర్పంచులు కేవలం పేరుకే పరిమితమై, పురుషుల చేతుల్లో అధికారాలు ఉండటం మనం చూస్తున్నాం. ఇది మారాలి. మహిళా సర్పంచులు తమ హక్కులు, బాధ్యతలను పూర్తిగా తెలుసుకుని ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని, వాటిని గ్రామ ప్రజలకు సమర్థంగా అందించాలి. గ్రామాల్లో మహిళలు సర్పంచ్లుగా ఎన్నికైనా.. అధికారాలు మాత్రం వారి భర్తలే అనుభవిస్తూ ఉంటారు. ఏదో రిజర్వేషన్ల ప్రకారం.. మహిళలను సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయించి.. గెలిచిన తర్వాత వారి భర్తలు.. పెత్తనం చెలాయిస్తూ ఉంటారు. ఇక కొందరు తమ కుమార్తెలను, తల్లులను సర్పంచ్లుగా గెలిపించినా.. పదవులు మాత్రం వారే అనుభవిస్తూ ఉంటారు. ఇది చట్ట ప్రకారం తప్పే అయినా.. అందుకు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఎక్కడా అలాంటి దాఖలాలు కనిపించవు. గ్రామాల్లో మహిళలు సర్పంచ్లుగా ఉంటే వారు కేవలం సంతకాలు, సభలకు హాజరు కావడమే తప్పితే.. చక్రం తిప్పేది మొత్తం వాళ్ల భర్తలే అయి ఉంటారు. అనేక మహిళలు విద్యావంతులు, సామర్థ్యవంతులు అయినా... భర్తలు వారిని వంటింటికి పరిమితం చేసి, సంతకాలు మాత్రమే చేయిస్తున్నారు. సమావేశాల్లో భర్తలే మాట్లాడతారు, నిర్ణయాలు తీసుకుంటారు. పార్టీలు, ఎమ్మెల్యేలు, అధికారులు కూడా భర్తలతోనే డీల్ చేస్తున్నారు. ఇది రాజ్యాంగ సవరణ ఆశయాన్ని దెబ్బతీస్తోంది. మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోకపోతే ఈ రిజర్వేషన్కు అర్థం లేదు. నూతనంగా ఎన్నికైన మహిళా సర్పంచ్లు ఇప్పుడే మార్పు తీసుకురాగలరు. పంచాయతీ రాజ్ చట్టం, నిధులు, విధులు బాగా అధ్యయనం చేయండి. సలహాలు తీసుకోవచ్చు, చర్చించవచ్చు కానీ నిర్ణయాలు మీరే తీసుకోండి. అధికారులకు, పార్టీలకు మీరే నేరుగా ఫోన్ చేయండి, మాట్లాడండి. గ్రామాన్ని మీరే నడపండి. పురుషుల కంటే మీరు శక్తివంతంగా చేయగలరు. భర్తలు, కుటుంబ సభ్యులు సలహా ఇవ్వవచ్చు కానీ అధికారం మీ చేతుల్లోనే ఉండాలి. మహిళా సర్పంచ్‌లారా... మీ రాజ్యం మీ చేతుల్లోనే ఉండాలి. ఇది మీ హక్కు, మీ బాధ్యత. ఈ అవకాశాన్ని వృథా చేయకండి. మీరు స్వతంత్రంగా నడిస్తేనే గ్రామాలు నిజంగా మారతాయి!

# న్యూఇయర్ పేరుతో అలా చేస్తే పబ్‌లు, రెస్టారెంట్ల లైసెన్సులు రద్దు

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో పబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు రాత్రి 1 గంటకు కచ్చితంగా మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాటి లైసెన్సులు రద్దు చేస్తామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. నగరంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన హెచ్–న్యూ, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, వెస్ట్‌జోన్, సీసీఎస్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి, ఆయా విభాగాలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'జీరో డ్రగ్స్' విధానమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపట్టాలని ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో డ్రగ్స్ వినియోగాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ రోజు నుంచే నగరంలోని పబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఈవెంట్లు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా బృందాలను మోహరించినట్లు తెలిపారు. ప్రధాన వేదికలతో పాటు సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీల పైనా నిఘా ఉంటుందన్నారు.

గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి కదలికలను నిశితంగా గమనిస్తున్నామని సజ్జనార్ వెల్లడించారు. డ్రగ్స్ సరఫరా చేసేవారు, వాటికి అలవాటుపడిన వారి జాబితా సిద్ధం చేసి వారిపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించినట్లు తెలిపారు. నగరానికి కొత్తగా వచ్చేవారి వివరాలను కూడా ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు. మైత్రివనం, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్, కేబీఆర్ పార్కు వంటి రద్దీ ప్రాంతాల్లో పటిష్టమైన చెక్ పోస్టులు, బ్యారికేడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ వేడుకలపై కూడా నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిఘా పేరుతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పోలీసులు అందరూ సమన్వయంతో పనిచేసి నగర పోలీసు ప్రతిష్ఠను పెంచాలని సూచించారు.

# కీలక నేతలతో భేటీ అయిన కేసీఆర్.. వేడెక్కుతున్న తెలంగాణ రాజకీయం

- మొదటి పేజి తరువాయి

కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తరపున అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఎలా ఎదురుదాడి చేయాలన్న అంశాలపై కేసీఆర్ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అలాగే రానున్న రోజుల్లో నిర్వహించాల్సిన బహిరంగ సభలు, నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల తేదీలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కేసీఆర్ నేతలకు సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇదే సమయంలో మరో కీలక పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయాలన్న దిశగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును తుది దశకు తీసుకెళ్లాలంటే కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావును కూడా విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కేసీఆర్, హరీశ్ రావులకు త్వరలో సమన్లు జారీ చేసి విచారణ చేపట్టాలని సిట్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే శాసనసభ సమావేశాల సమయంలో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, సమావేశాలు ముగిసిన తర్వాత నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు టాక్ నడుస్తోంది. ఈ మొత్తం పరిణామాల మధ్య కేసీఆర్ రాజకీయంగా వేగం పెంచడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒకవైపు ప్రభుత్వంపై దాడికి సిద్ధమవుతూ, మరోవైపు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే వ్యూహంతో ఆయన ముందుకు సాగుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయన్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

# అభివృద్ధి వదిలేసి బూతులు తిట్టుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో అభివృద్ధి, జవాబుదారీతనం అనేవే లేకుండా పోయాయని, కేవలం వ్యక్తిగత దూషణలు తప్ప మరేమీ లేవని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి, అసభ్య పదజాలంతో పరస్పరం దూషించుకుంటున్నారు. పాలనలో చూపించడానికి ఏమీ లేనప్పుడే నాయకులు ఇలాంటి వ్యక్తిగత విమర్శలకు దిగుతారు. భాష గురించి నీతులు చెప్పే పార్టీలే ఇప్పుడు రాజ్యాంగ వేదికల నుంచి బూతులు మాట్లాడుతున్నాయి" అని అన్నారు.

ప్రజలు సుపరిపాలన కోసం ఓటు వేస్తే, 2014 నుంచి రాష్ట్రంలో గలీజ్ రాజకీయాలు తప్ప మరేమీ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు కావాల్సింది ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతులకు మద్దతు, మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాలని, కానీ రోజూ అధికార, ప్రతిపక్షాల మధ్య తిట్ల పోటీలు కాదని బండి సంజయ్ హితవు పలికారు.

# పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు జార్జ్ బుష్ హయాంలోనే ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్‌ల మధ్య 2001 నుంచి 2008 మధ్య జరిగిన ప్రైవేటు సంభాషణలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు అమెరికాకు చెందిన నేషనల్ సెక్యూరిటీ ఆర్కైవ్స్ ఆ వివరాలను బహిర్గతం చేసింది. పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని అణు కార్యక్రమాన్ని ఆనాడు పుతిన్, జార్జ్ డబ్ల్యూ బుష్ తీవ్ర సమస్యగా పరిగణించినట్లు ఆ వివరాల ద్వారా తెలుస్తోంది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఒక సైనిక కూటమి అని పుతిన్ ఒకసారి నాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారని ఇది వెల్లడిస్తోంది. 2001లో స్లొవేనియాలో జరిగిన ఓ సమావేశానికి పుతిన్, బుష్ హాజరయ్యారు. ఈ క్రమంలోనే పాక్ అణ్వాయుధాల అంశంపై వీరిరువురూ చర్చించారు. అణు కార్యక్రమాల నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దేశాల విషయంలో వ్యవహరించినట్లుగా పాకిస్థాన్‌పై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని పుతిన్ ప్రశ్నించారు. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన సైనిక కూటమి అని, అక్కడ ప్రజాస్వామ్యం లేదని, మిలిటరీ పాలన ఉందని పుతిన్ పేర్కొన్నారు. కానీ పశ్చిమ దేశాలు పాకిస్థాన్‌పై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని ఆయన అన్నారు. ఈ అంశంపై మాట్లాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ అణ్వాయుధాల పట్ల ఉదాసీనంగా ఉండటంపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పుతిన్ వ్యాఖ్యలతో బుష్ ఏకీభవించారు. అక్రమ అణు వ్యాపారంపై అమెరికా అధ్యక్షుడు బుష్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

ఇరాన్ అణు కార్యక్రమంలో పాకిస్థాన్ యూరేనియాన్ని గుర్తించినట్లు 2005లో జరిగిన మరో సమావేశంలో బుష్ వద్ద పుతిన్ ప్రస్తావించారు. పాకిస్థాన్ అక్రమ వ్యాపారం కలవరపరిచే అంశమేనని బుష్

కూడా అంగీకరించారు. అన్ని రకాలుగా ఉల్లంఘనలకు పాల్పడుతూ ప్రమాదకర పదార్థం చేతులు మారడంపై బుష్, పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య జవాబుదారీతనం లేని ప్రభుత్వాల చేతుల్లో అణ్వాయుధాలు అధికంగా ఉన్నాయని పుతిన్ పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. దానిని బుష్ కూడా సమర్థించినట్లు ఆ పత్రాలు వెల్లడిస్తున్నాయి.

# హైదరాబాద్ – విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

- మొదటి పేజి తరువాయి

మంది హైదరాబాద్ వైపు ప్రయాణం చేయడంతో రహదారిపై వాహనాల ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ప్రత్యేకంగా పంతంగి, చౌటుప్పల్, కొర్లపాడు టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. నేషనల్ హైవే 65పై ఔటర్ రింగ్ రోడ్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్ వరకు ట్రాఫిక్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు కదలని పరిస్థితి నెలకొంది. ఇక ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులు కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా మారాయి. చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, పంతంగి ప్రాంతాల్లో బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణం కొనసాగుతుండటంతో రోడ్డు సామర్థ్యం గణనీయంగా తగ్గింది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతుండగా, ట్రాఫిక్ జామ్‌లు మరింత తీవ్రతరం అవుతున్నాయి. ఈ అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు ఇలాంటి పరిస్థితులు తప్పవని అధికారులు చెబుతున్నారు. రద్దీ పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను మళ్లిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, అత్యవసర సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాచకొండ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు చేశారు. జాతీయ రహదారి మీద ప్రయాణించే వారు వీలైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని, ప్రయాణానికి ముందు ఆన్‌లైన్‌లో ట్రాఫిక్ అప్‌డేట్‌లను చెక్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వాహనాల రద్దీ మరో రెండు రోజుల పాటు కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

## గజ్వేల్ నియోజకవర్గం సహా సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించింది

- మొదటి పేజి తరువాయి

వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించిందని ఆయన తెలిపారు. రెండేళ్లకు పైగా ఫామ్ హౌస్‌కే పరిమితమైన కేసీఆర్, ఇప్పుడొచ్చి తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని మంత్రి వివేక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, సర్పంచ్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీకి పట్టున్న జూబ్లీహిల్స్‌లో కూడా కాంగ్రెస్ విజయం సాధించిందని ఆయన గుర్తు చేశారు.

## ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- మొదటి పేజి తరువాయి

జరగనుంది. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటున్నారు. ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో రేపు ఉదయం 10.30 గంటలకు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో, దేశవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ పరిస్థితులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, రాబోయే ఎన్నికలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు సమాచారం. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

## ఇకపై సాగు చేసేవారికే పెట్టుబడి సాయం

- మొదటి పేజి తరువాయి

ఉపగ్రహ చిత్రాల ద్వారా వ్యవసాయ భూములను క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటల్ మ్యాపింగ్ ద్వారా ఏ పొలంలో పంట ఉందో, ఏది ఖాళీగా ఉందో గుర్తిస్తున్నారు. దీనివల్ల సాగులో లేని బంజరు భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా నిలిచిపోనుంది. ఈ చర్యతో ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, అర్హులైన రైతులకే లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ. 18,000 కోట్లు కేటాయించింది. గత వానాకాలం సీజన్‌లో సుమారు 69 లక్షల మంది రైతులకు రూ. 9,000 కోట్లను కేవలం 9 రోజుల్లోనే జమ చేసింది. ఇప్పుడు యాసంగికి కూడా జనవరి రెండో వారం నాటికి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, పండుగలోపు నిధులు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## జలాంతర్గామిలో ప్రయాణించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మొదటి పేజి తరువాయి

నౌకాశ్రయం నుంచి ఆమె ప్రయాణం సాగుతుందని రాష్ట్రపతి భవన్ వెల్లడించింది. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఆమె గోవా, ఝార్ఖండ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె జలాంతర్గామిలో ప్రయాణిస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి ముర్ము రెండు నెలల క్రితం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి రఫేల్‌లో ఆమె ప్రయాణించిన విషయం తెలిసిందే. అంతకుముందు 2023 మే 8న అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్–30 ఎంకేఐ యుద్ధ విమానంలో ఆమె విహరించారు. సుఖోయ్–30 ఎంకేఐ యుద్ధ విమానంలో విహరించిన రెండో మహిళా రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. అంతకుముందు, 2009లో ప్రతిభా పాటిల్ గగనయానం చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా 2006లో పుణే వాయుసేన స్థావరం నుంచి సుఖోయ్–30లో ప్రయాణించారు.

## ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీ వాయు కాలుష్యంపై వివిధ సంస్థలు, రాజకీయ నాయకులతో పాటు సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పందించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సంబంధిత సంస్థలు దీనికి పరిష్కారం కనుగొంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ రాజధానిని పీడిస్తున్న ఈ సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ప్రయోజనాలు కలిగించే విధానాల కంటే దీర్ఘకాలిక పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. గోవాలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన జస్టిస్ సూర్యకాంత్ మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీ వాయు కాలుష్యంపై పర్యావరణ సంస్థలు, నిపుణులు సమర్థవంతంగా పరిష్కారం కనుగొంటారని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో పెరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం హానికర పొగమంచు ఢిల్లీలోని అనేక ప్రాంతాలను కమ్మేసింది. దీంతో దృశ్య నాణ్యత కూడా బాగా పడిపోయింది. వాయు కాలుష్యం తీవ్రంగా ఉండటంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్–4 కింద ఆంక్షల అమలును కొనసాగిస్తున్నారు. ఢిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) గురువారం ఉదయం 220గా నమోదైంది. ఓ సమయంలో 310గా కూడా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్
శనివారం 27 డిసెంబర్ 2025 పేజీలు 8

# ఈ నెల 29న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్న కేసీఆర్!

- అసెంబ్లీ సమావేశాల అనంతరం బీఆర్ఎస్ బహిరంగ సభలు
- ముఖ్య నాయకులతో కేసీఆర్ సమావేశం
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల తదుపరి కార్యాచరణపై మంతనాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 29న శాసనసభకు హాజరయ్యే అవకాశముందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బీఆర్ఎస్ బహిరంగ సభలు ఉంటాయని వారు తెలిపారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ సీనియర్ నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. వారితో వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తదుపరి కార్యాచరణపై నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారని సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగానే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి ఎప్పుడూ అన్యాయమే చేస్తోందని ముఖ్య పార్టీ నేతల సమావేశంలో కేసీఆర్ అన్నారని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంపై బీఆర్ఎస్ పార్టీకి తప్ప మరే పార్టీకి పట్టింపు లేదని, మనకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండ గట్టాలని ఆయన నేతలకు సూచిం చారు. ప్రజల్లోకి వెళ్లి, ఉద్యమాన్ని నిర్మిద్దామని నాయకులతో అన్నారు. నీటి హక్కులు పరిరక్షించుకునే బాధ్యత బీఆర్ ఎస్ పైన ఉందని, అసెంబ్లీ వేదికగా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై వివరిద్దామని కేసీఆర్ అన్నారని తెలుస్తోంది.

-4లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరా మస్తాన్ ను మళ్లీ విచారించిన సిట్

- రెండున్నర గంటల పాటు కొనసాగిన విచారణ
- తనకు తెలిసిన అన్ని విషయాలు స్పష్టంగా చెప్పానన్న మస్తాన్
- తన ఫోన్ డేటాను అధికారులు తన ముందు ఉంచారని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఆరా మస్తాన్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి విచారించింది. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో సిట్ అధికారులు మస్తాన్ రెండో స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. దీంతో కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంటోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆరా మస్తాన్.. గతంలో తాను వెల్లడించిన అంశాలనే సిట్ అధికారులు మరోసారి స్పష్టంగా అడిగారని తెలిపారు. తనకు తెలిసిన ప్రతీ విషయం ఎలాంటి మార్పులు లేకుండా స్పష్టంగా చెప్పానన్నారు. ముఖ్యంగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు ఇచ్చిన వాంగ్మూలాన్ని క్రాస్ చెక్ చేసుకునేందుకే తనను మరోసారి పిలిపించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన డేటాను తన ముందే ఉంచారని మస్తాన్ చెప్పారు. ఆ డేటా ప్రకారం 2020 నుంచే తన రెండు ఫోన్లు ట్యాప్ అయ్యాయని అధికారులు వివరించినట్లు తెలిపారు. దీనితో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎంత లోతుగా, పద్ధతిగా జరిగిందన్న విషయం స్పష్టమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఈ కేసులో సిట్ ఉన్నత స్థాయి అధికారులతో దర్యాప్తు చేపడుతోందని, ముఖ్యమైన సాక్షులందరినీ విచారిస్తున్నట్లు మస్తాన్ తెలిపారు. అందువల్లే దర్యాప్తు ముగింపు దశకు చేరుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలిచే అవకాశముందని, వారం రోజుల్లో మళ్లీ నోటీసులు రావచ్చని కూడా సూచించారు. మొత్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు త్వరలోనే ఒక తుది నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆరా మస్తాన్ వ్యాఖ్యానించారు.



## కాళేశ్వరంపై తర్జనభర్జన

- ఎల్లంపల్లి దిగువన పనుల పూర్తిపై ప్రభుత్వ దృష్టి
- అక్రమాలకు బాధ్యులపై చర్యలు, ఆయకట్టుకు నీరందించడాన్ని వేర్వేరుగా చూసే యోచన
- నీటిపారుదల శాఖను నివేదిక కోరిన సీఎంఓ




**హైదరాబాద్ పెన్ పవర్:** సుమారు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. కుంగిన మేడిగడ్డ, సీపేజీ, ఇసుక మేట సమస్యలను ఎదుర్కొంటున్న ఇతర బ్యారేజీల విషయంలో ఎన్డీఎస్ఏ సిఫార్సుల అమలు, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, విజిలెన్స్ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకొంటూనే... ఇతర పనులను, ప్రత్యేకించి ఎల్లంపల్లి నుంచి దిగువన అన్ని రకాల పనులను పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడానికి ఏమేం చర్యలు తీసుకోవాలన్న దానిపై దృష్టి సారించింది. ప్రాజెక్టులో జరిగిన అక్రమాలకు బాధ్యులపై చర్యలు ఒకవైపు, మిగిలిన పనులను పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించడం ఇంకోవైపు... ఈ రెండింటిని వేర్వేరుగా చూడాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని మళ్లించడం, ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు రెండు టీఎంసీల నీటిని తేవడం, మల్లన్నసాగర్ నుంచి రంగారెడ్డి జిల్లాకు నీటిని మళ్లించే పనులను పూర్తి చేయడంపై నివేదిక ఇవ్వాలని నీటిపారుదల శాఖను ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) కోరినట్లు తెలిసింది.

**నాలుగు ప్యాకేజీల పునరుద్ధరణకు నిర్ణయం!**

ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో 28 ప్యాకేజీల పనులు ఉండగా, ఇందులో నాలుగు ప్యాకేజీలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆయకట్టుకు నీళ్లందించేవి. పునరాకృతిలో భాగంగా ఈ పనులను కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి గత ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ నాలుగు ప్యాకేజీల పనులను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, మూసీ పునరుజ్జీవానికి 20 టీఎంసీల నీటిని మళ్లించే పనులను చేపట్టింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొంటే ఎల్లంపల్లి నుంచి మలన్నసాగర్ వరకు అదనపు టీఎంసీ సహా చేపట్టిన పనులన్నింటినీ పూర్తి చేస్తేనే నీటి సరఫరా సాధ్యమవుతుంది.

## కొండగట్టు అంజన్న దర్శానికి వెళ్లి వస్తుండగా.. ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా



**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఘాట్ రోడ్డులో డిసెంబర్ 26న ఉదయం ఆటో ప్రమాదానికి గురైంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని పట్టణానికి చెందిన విద్యాధర్ తన సొంత ఆటోలో కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చాడు. దర్శనం అనంతరం ఘాట్ రోడ్డు గుండా గుట్ట దిగే క్రమంలో ఆటో అదుపు తప్పి ఘాట్ రోడ్డు రక్షణ గోడను ఢీ కొని బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. కొండగట్టు ఏ ఎస్సై శ్రీనివాస్ తమ సిబ్బందితో వచ్చి వీరిని 108 లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో బస్సు ప్రమాదం జరిగిన స్థలంలోనే ఆటో బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.

## చేపల కోసం వల వేస్తే కొండ చిలువ పడింది.. ఎంత పెద్దగా ఉందో చూడండి !



**కరీంనగర్: పెన్ పవర్:**కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రం సమీపంలోని లోయర్ మానేరు డ్యామ్‌శ్రీలో చేపలు పడుతుండగా అతిపెద్ద కొండచిలువ మత్స్యకారుడి వలలో పడింది. గన్నేరువరం మండలానికి చెందిన కల్లెం రాము అనే జాలరి చేపలు పడుతుండగా వలలో కొండచిలువ చిక్కుకొని చనిపోయింది. తెప్ప మీద బయటకు తీసుకొచ్చి తీరంపై ఉంచగా కొండచిలువలో కదలిక లేదు. వల నైలాన్ దారాలు మధ్య ఊపిరాడక కొండచిలువ మరణించి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. లోయర్ మానేరు డ్యామ్‌శ్రీలో కొండచిలువ జాలర్ల వలలో పడటం ఇవాళ కొత్త కాదు. 2022లో కూడా.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారంలో మత్స్యకారుల వలకు కొండ చిలువ చిక్కింది. లోయర్ మానేర్ డ్యాంలో చేపలు పట్టేందుకు రాత్రి వలవేసి పెట్టగా ఉదయం వచ్చి చూసేసరికి వలలో సుమారు మూడు మీటర్ల కొండచిలువ కనిపించింది. దీంతో మత్స్యకారులు ఒక్కసారిగా షాక్‌యికు గురయ్యారు. వలను ఒడ్డుకు లాక్కొచ్చారు. వలలో చిక్కుకున్న కొండ చిలువ అప్పటికే చనిపోయినట్టు గుర్తించారు. గతంలోనూ గన్నేరువరం మత్స్యకారులకు రెండు సార్లు వలలకు కొండచిలువ చిక్కింది. లోయర్ మానేరు డ్యామ్‌యిలో ఇంకా ఎన్ని కొండ చిలువలు ఉన్నాయో.. ఏంటోనని మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు.

## హుస్నాబాద్ లో అద్భుతమైన క్రికెట్ స్టేడియం నిర్మిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ లో హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం లాంటి క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాకా టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కాకా వెంకట స్వామి మెమోరియల్ తెలంగాణ అంతర్ రాష్ట్ర టీ 20 లీగ్ ద్వారా ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీస్తుందన్నారు. గతంలో మన రాష్ట్రం నుంచి హర్షద్ అయూబ్ ,శివలాల్ ,అజారుద్దీన్ , వీవీఎస్ లక్ష్మణ్, లు తెలంగాణ కీర్తిని భారతదేశానికి చాటారు. ఇప్పుడు సిరాజ్ ,తిలక్ వర్మ లాంటి వారు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పారు పొన్నం. కరీంనగర్ లో కాకా మెగా క్రికెట్ టోర్నీలో ఫైనల్ మ్యాచ్ సందర్భంగా మాట్లాడిన పొన్నం.. హుస్నాబాద్ లో 20 ఎకరాల్లో అద్భుతమైన స్టేడియం నిర్మించాలి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నుంచి మంచి స్టేడియం నిర్మిస్తామని వివేక్ వెంకట్ స్వామి చెప్పారు. కరీంనగర్ లో క్రికెట్ , ఫుట్ బాల్ ,వాలి బాల్ ఇతర ఆటలు ఆడడానికి అంబేద్కర్ స్టేడియం ఉంది. స్పోర్ట్స్ కి సంబంధించి మంచి ప్రోత్సాహం అందించడానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చి క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తుంది. కరీంనగర్ జిల్లా తెలంగాణలోనే ముందుండాలి. వివేక్ వెంకట్ స్వామికి క్రీడల అంటే ఇష్టం వారు సహకారం అందిస్తారు. కాకా మెమోరియల్ టీ20 లీగ్ మరింత అద్భుతంగా విజయం సాధించి ఎంతమంది క్రీడాకారులను వెలికితీయాలని కోరారు పొన్నం.




## బీఆర్ఎస్ పార్టీ టైర్ పంక్చర్.. అందుకే కేసీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పార్టీ టైర్ పంక్చర్ అయ్యిందని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. అందుకే కేసీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మెదక్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి.. గజ్వేల్ లో తొంభైకి పైగా స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు సర్పంచులుగా గెలిచారని అన్నారు. దీంతో కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని

-4లో

# కాళేశ్వరంపై తర్జనభర్జన

-3 పేజి తరువాయి

మేడిగడ్డ బ్యారేజీని పునరుద్ధరించడం, మిగిలిన బ్యారేజీలకు మరమ్మతు చేయడానికి అవసరమైన ఇన్వెస్టిగేషన్స్ ఇంకా పూర్తి కాలేదు. ఇవన్నీ పూర్తయి బ్యారేజీల పునరుద్ధరణ ఎప్పటికవుతుందో చెప్పలేని పరిస్థితి. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి నీటిని మళ్లించే పథకాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినా... అది డీపీఆర్ తయారీ దశలోనే ఉంది. డీపీఆర్ పూర్తయి... మహారాష్ట్ర అంగీకరించి... పనులను ప్రారంభించి పూర్తి చేయడానికి సమయం పడుతుంది.

**ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు చేపట్టిన పనులపై ఆరా**

ప్రధాన గోదావరి నుంచి ఎల్లంపల్లి ద్వారా దిగువకు నీటి విడుదల గత నాలుగైదేళ్లు ఎక్కువగానే ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు 900 టీఎంసీలకు పైగా ఎల్లంపల్లి నుంచి దిగువకు వదిలారు. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకొనేలా పనులు పూర్తయితే ఈ నీటినే అవసరమైన మేరకు మళ్లించడానికి వీలయ్యేది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు ఇప్పటివరకు చేపట్టిన పనులు ఏ దశలో ఉన్నాయి, ఏమైనా సమస్యలున్నాయా, మిగిలిన పనులు పూర్తి చేయడానికి ఎంత వ్యయమవుతుంది తదితర వివరాలన్నీ నీటిపారుదల శాఖను ముఖ్యమంత్రి కార్యాలయం కోరినట్లు తెలిసింది. సుమారు ఏడాదిన్నరగా పనులు జరగకపోవడంతో చేసిన పనుల నిర్వహణ సమస్యతోపాటు చేయని పనులకు వ్యయం పెరిగే అవకాశం ఉంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొంటున్నట్లు తెలిసింది. ఎల్లంపల్లి-మల్లన్నసాగర్ మార్గంలో భారీగా సొరంగాలున్నాయి. పంపుహౌస్‌లున్నాయి. వీటి నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఇంజినీరింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**84 శాతం పనుల పూర్తి**

కాళేశ్వరం ప్రాజెక్టుకు నిర్మాణ పనులతో పాటు భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతి... ఇలా అన్నింటికీ కలిపి సుమారు రూ.లక్ష కోట్లు ఖర్చు చేయడంతో పాటు మొత్తమ్మీద 84 శాతం పనులు పూర్తయ్యాయని నివేదించిన ఇంజినీర్లు... సాగులోకి వచ్చిన ఆయకట్టును మాత్రం 95 వేల ఎకరాలుగానే చూపిస్తున్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి లక్ష ఎకరాలకు కూడా నీరందించలేదని ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి పలు సందర్భాల్లో పేర్కొన్నారు కూడా. మిగిలిన 16 శాతం పనులను పూర్తి చేయడంతోపాటు ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టాల్సి ఉంటుంది. అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. ఈ ప్రాజెక్టు కోసం బ్యాంకులు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ తదితర సంస్థల నుంచి తీసుకొన్న రుణాలకు 2024 ఆఖరు వరకు వడ్డీ కిందే ప్రభుత్వం రూ.16,200 కోట్లు చెల్లించింది. అధిక వడ్డీలను తగ్గించుకొనేందుకు ప్రభుత్వం చేసిన కసరత్తు కొంతవరకు విజయవంతమైంది. ఏడాదికి సుమారు రూ.4 వేల కోట్లు తగ్గించుకోగలిగింది. ఇంకా తగ్గించుకొనే ప్రయత్నంలో ఉంది. ఇది తీసుకొన్న రుణాలను తిరిగి చెల్లించే ప్రక్రియ తప్ప రైతులకు ప్రయోజనాలు అందవు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌తో సహా పలు రిజర్వాయర్ల కింద డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తికాలేదు. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు ఇప్పటివరకు పూర్తి చేసిన పనుల్లో ఎలాంటి సమస్య లేకుండా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చినా ఒక టీఎంసీ మాత్రమే మళ్లించడం వీలవుతుంది. అదనంగా చేపట్టిన 1.1 టీఎంసీ పనుల్లో 70 నుంచి 80 శాతం వరకు పూర్తయ్యాయి. ఇవి కూడా పూర్తయితే మల్లన్నసాగర్ వరకు రెండు టీఎంసీల నీటిని మళ్లించడానికి అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తమ్మీద మిగిలిన పనులను పూర్తి చేయడానికి ఎంత ఖర్చు చేయాల్సి వస్తుందో అంచనా వేసే పనిలో నీటిపారుదల శాఖ ఉంది. విద్యుత్తు బిల్లులు కూడా భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపైనా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## బీఆర్ఎస్ పార్టీ టైర్ పంక్చర్.. అందుకే కేసీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు

-3 పేజి తరువాయి

ఎద్దేవా చేశారు. ఓటమిని భరించలేక తోలు తీస్తా అని కాంగ్రెస్ పార్టీ మీద విమర్శలకు దిగుతున్నారని అన్నారు.

**మంత్రి వివేక్ వెంకటస్వామి కామెంట్స్ :**

కేసీఆర్ తనను గెలిపించిన గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోలేదు కానీ తోలు తీస్తాడంట

గతానికంటే ఎక్కువగా దుబ్బాక లో 56 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది

సిద్దిపేటలో సర్పంచ్ క్యాండిడేట్ దొరకడమే కష్టంగా ఉండేది.. కానీ ఇప్పుడు ప్రతి స్థానంలో అభ్యర్థిని పెట్టాం కొన్ని గెలిచాం

కార్యకర్తల కష్టం వల్లే ఇన్ని స్థానాలు గెలుపొందాం

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకాలపై ప్రజలలో మంచి స్పందన ఉంది

పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండి వారి కష్టాలు, సమస్యలు తెలుసుకోండి అప్పుడే నాయకుడికి ప్రజలకు మధ్య బాండింగ్ ఏర్పడుతుంది

ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎక్కువ నిధులు , ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వమని ముఖ్యమంత్రి కోరాను

జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు బలం లేదు అన్నారు..

ఇరవై వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందాం

గెలిచిన సర్పంచులందరినీ ముఖ్యమంత్రితో కలిపిస్తా

మీ శ్రమ గొప్పది.. కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ సర్పంచ్ ఎన్నికల్లో చూపించారు

# కాసుగంటి సుధాకర్ రావు హఠాన్మరణం

**జగిత్యాల, పెన్ పవర్:**భారతీయ నాగరికత విద్యా సమితి అధ్యక్షుడు,పారిశ్రామికవేత్త కాసుగంటి సుధాకర్ రావు(80) గత కొంతకాలంగా వృద్ధాప్యంతో పాటు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి హైదరాబాదులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఎస్ ఆర్ ఎస్ పి లో ఇంజనీర్ గా ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి భారతీయ నాగరికత విద్యాసంస్థ పేరిట జిల్లా కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ తోపాటు శ్రీ వాణి సహకార జూనియర్ కళాశాలను స్థాపించారు.ఈ ప్రాంత రైతులకు దాదాపు 40 ఏళ్ల క్రితమే దిగుమతి వల్ల కలిగే వ్యయ భారం రైతులకు లేకుండా గోదావరి వ్యాలీ పరిశ్రమను ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గోదావరి అగ్రి ఎక్విప్మెంట్స్ ను అందించారు. అంతేకాకుండా సమాజ సేవలో కూడా తాను ముందుండి జగిత్యాలలో రోటరీ క్లబ్ ను ప్రారంభించి ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందించారు. ఈ ప్రాంత యువతకు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించిన కాసుగంటి సుధాకర్ రావు ఆకస్మిక మృతి పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# విటమిన్ బి12 డెఫిషియెన్సీ..!

**డాక్టర్. డిసి తిరుపతిరావు ఎండి**
**సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్**

**కరీంనగర్: పెన్ పవర్:**ఎక్కువ స్ట్రెస్‌కి గురయ్యే ఉద్యోగాల్లో ఉన్న వారికి తరచూ విటమిన్ బి12 డెఫిషియెన్సీ ఏర్పడుతూ ఉంటుంది. మానసిక వత్తిడి శరీరంలో పెద్దమొత్తంలో బి విటమిన్స్‌కి ఖర్చుచెయ్యడం దీనికి ప్రధాన కారణం.

**అవగాహన కోసం సలహాలు:**


శరీరంలో అసమతౌల్యత ఏర్పడింది అని ఈ సంకేతాలను బట్టి అర్థం చేసుకోవాలి. చాలామందికి దీనికి పరిష్కారంగా ఎక్కువ డోసుల్లో బి కాంప్లెక్స్ టాబ్లెట్లని తీసుకుంటూ ఉంటారు. సమస్య సాల్వ్ అయినట్లు ఉంటుంది గానీ, సమస్య అసలు కారణాలు అర్థం చేసుకోకుండా తాత్కాలికంగా ఉపశమనం పొందితే ఉపయోగం ఉండదు.

**సమస్య మూలాల్లోకి వెళితే:**

ఒత్తిడి అనేది మనస్సు, శరీరాలను ఒక స్థాయికి మించి అలసటకు గురిచేస్తే ఏర్పడేది. అది విపరీతంగా ఆలోచించడం కావచ్చు, శారీరక కష్టం చెయ్యడం కావచ్చు. శరీరం, మనస్సు యొక్క సామర్థ్యాలకు మించి వాటిని వాడితే అది రాజసిక గుణాన్ని శరీరంలో పెంచుతుంది. అంటే ఒక వెహికిల్‌కి దానికి ఉద్దేశించ బడిన స్పీడ్ కన్నా విపరీతమైన స్పీడ్‌తో నడపడం లాంటిది అన్నమాట.

**విటమిన్ డి. లోపాన్ని గుర్తించే లక్షణాలు:**

**కండరాల బలహీనత:**



ఎలాంటి కారణం లేకుండా కండరాల పరిమాణం తగ్గడం, అనవసరంగా నొప్పిగా అనిపించడం విటమిన్ డి. లోపానికి సంకేతం. నాడీ కణాలకు సరిగా విటమిన్ డి. అందనప్పుడు అలాంటి సమస్య మొదలవుతుంది.

**డిప్రెషన్:**

విటమిన్ డి. లోపిస్తే డిప్రెషన్ వేధిస్తుంది. అనవసరంగా డిప్రెషన్ కు లోనవడం, చిన్న విషయానికి ఎక్కువగా చింతించడం వంటి లక్షణాలు విటమిన్ డి. లోపాన్ని సూచిస్తాయి.

**నొప్పి:**

ఎక్కువగా నొప్పులకు గురవుతున్నారంటే జాగ్రత్త వహించడం మంచిది. ఎన్ని రోజులైనా..తలనొప్పి, కండరాల నొప్పి వంటివి తగ్గడం లేదంటే..ఒకసారి విటమిన్ డి. టెస్ట్ చేయించు కోవడం మంచిది.

**ఎముకలు:**

విటమిన్ డి. కి ఎముకల ఆరోగ్యానికి చాలా దగ్గరి సంబంధముంది. విటమిన్ డి. లోపిస్తే ఎముకల ఆరోగ్యం క్షీణిస్తుంది.

**బీపీ:**

విటమిన్ డి.లోపిస్తే బ్లడ్ ప్రెషర్ పెరిగే అవకాశముంది. గుండె ఆరోగ్యంలో విటమిన్ డి. ప్రధానం. ఒక వేళ బీపీ పెరిగిందని అనిపించినా,చిన్న విషయాలకూ చిరాకు పడుతున్నా..విటమిన్ డి. పై శ్రద్ధ వహించాలి. వెంటనే డాక్టర్ ని సంప్రదించి జాగ్రత్త పడాలి.

**చిరాకు:**

చీటికి మాటికి చిరాకులకు, కోపానికి గురవుతున్నారా.. అయితే మీ శరీరంలో విటమిన్ డి. ఏ స్థాయిలు ఎలా ఉన్నాయో చెక్ చేసుకోండి. విటమిన్ డి. లోపిస్తే మెదడులో మానసిక ఒడిదుడులపైపై ప్రభావం.

దీన్ని సరిచెయ్యాలంటే లక్షణాలు కనిపించగానే విటమిన్ డి.టాబ్లెట్స్ వేసుకుని సమస్యని దాచిపెట్టడం కాదు,

మన మానసిక వత్తిడిని తగ్గించుకోవడం సరైన పరిష్కారం.. డాక్టర్. డిసి తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ అన్నారు.

# యాసంగి కి రైతు లకు ఇబ్బందులు లేకుండా చూడాలి



**సిద్దిపేట: పెన్ పవర్:**ఇర్కోడ్ చందలా పూర్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి

శాశ్వత పంట కాలువలకు అవసరమగు నిధులు కేటాయించి కాలువల పనులు చెపట్టాలని కలెక్టర్ ను ఫోన్ లో కోరిన హరీష్ రావు.కాలువల్లో పెరుక పోయిన తుంగా, చెత్త ను పూడిక తీయాలి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.వచ్చే యాసంగి కి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంట పొలాలకు నీరు అందించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఇరిగేషన్ అధికారులను కోరారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో ఇరిగేషన్ పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గత యాసంగి లో ప్రభుత్వం సరైన ప్రణాలిక లేక రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించడం లో ఇబ్బందులు పడ్డారని. నా స్వంత డబ్బులు ఇచ్చి తాత్కాలిక కాలువలు తీసి నీరు అందించే పరిస్థితి వచ్చిందని..అది దృష్టిలో పెట్టుకొని వచ్చే యాసంగి వరకు శాశ్వత కాలువలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.. అవసరమగు భూసేకరణ చెపట్టాలని భూసేకరణ కాలువ ల నిర్మాణానికి కావాల్సిన నిధులు ఇవ్వాలని ఫోన్ లో కలెక్టర్ ని కోరారు. యాసంగి రైతు లకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇర్కోడ్, చందలపూర్ లో నిర్మించే లిఫ్ట్ పనులు వేగవంతం కావాలని కోరారు.. అదేవిదంగా నియోజకవర్గం లో పెండింగ్ లో ఉన్న చెక్ డ్యామ్ పనులు త్వరిత గతిన చేపట్టాలని చెప్పారు. అదేవిదంగా కాలువల్లో పెరుక పోయిన తుంగా, చెత్త చెదారం పూడిక తీయాంచాలని అధికారులతో చెప్పారు. నియోజకవర్గం లో పలు పెండింగ్ పనులు వేంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఈఈ గోపాల్ కృష్ణ, ఈఈ శంకర్, డిఈ చంద్ర శేఖర్,శిరీష, వినయ్, ఆంజనేయులు, విద్యా సాగర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు బోల్తా.. పది మంది విద్యార్థులకు గాయాలు

**షాద్‌నగర్, డిసెంబర్ 26 పెన్ పవర్:** విహారయాత్రకు 45మంది విద్యార్థులతో వెళ్తున్న బస్సు బొలేరో వాహనాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. 10 మంది విద్యార్థులు గాయపడిన ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దాయపల్లి శివారులో ఓ పెట్రోల్ బంకు వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చెందిన మణికంఠ కళాశాల విద్యార్థులు క్రిస్మస్ సందర్భంగా స్కూల్ బస్సులో హైదారాబాద్‌లోని జలవిహార్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్దాయపల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై ఓ కారు టైరులో గాలిపోయి ఊడిపోయింది. వెనకాలే వస్తున్న బొలేరో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకు వేశారు. ఆ వెనకే వస్తున్న స్కూల్ బస్సు.. బొలేరోను ఢీకొట్టి, అదుపుతప్పి డివైడర్‌ను తగిలి బోల్తాపడింది.

## తెలుగుపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



**దేవరకొండ, డిసెంబర్ 26 పెన్ పవర్:**దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు సర్పంచ్ చాట్ల రమాదేవి రాములు తెలిపారు. శుక్రవారం గ్రామంలో రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, కంప చెట్లను తొలగించే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచులకు ఊరట!

**నల్లగొండ, డిసెంబర్ 26 పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీల అభివృద్ధికి భారీగా నిధులు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, చిన్న గ్రామ పంచాయతీలకు రూ. 5 లక్షలు, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ. 10 లక్షలు నేరుగా అందించనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 1,779 పంచాయతీలకు ప్రయోజనం చేకూరనుంది. సర్పంచులకు నేరుగా నిధులు అందజేస్తామన్న ప్రకటనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు

**మునుగోడు, డిసెంబర్ 26 పెన్ పవర్:** నవంబర్ లో రైతుల ఖాతాల్లో జమ కావాల్సిన రైతు భరోసా డిసెంబర్ నెల ముగిసినా ఇంకా జమ కాలేదని నాంపల్లి మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు పూర్తయిన నేపథ్యంలో, విత్తనాలు, ఎరువుల పెట్టుబడి సాయం కోసం వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఆలస్యం అన్నదాతలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది.

## సీపీఐ శతాబ్ది వేడుకలు: ఎర్ర జెండాల ఆవిష్కరణ

**మిర్యాలగూడ, డిసెంబర్ 26 పెన్ పవర్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం శాంతినగర్ గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బద్దం కృష్ణారెడ్డి ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, దేశంలో పీడిత, శ్రమజీవుల పక్షాన కమ్యూనిస్టు పార్టీ చరిత్రాత్మక పోరాటాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిందని, 1925 డిసెంబర్ 26న స్థాపించబడినప్పటి నుంచి దొరలు, భూస్వాములు, శోషణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ప్రజల్లో శాస్త్రీయ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో, సామాజిక న్యాయం, సమానత్వం లక్ష్యంగా పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. 2026 జనవరి 18న ఖమ్మంలో జరిగే జాతీయస్థాయి సీపీఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎర్ర సాని రవి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగభద్రం, మండల యువజన సంఘం అధ్యక్షులు దేగ వీరయ్య, శాంతినగర్ అనంతగిరి గ్రామ శాఖ కార్యదర్శి, నూతన సర్పంచ్ ఉమా, ఉప సర్పంచ్ స్వాతి, వార్డు సభ్యులు, పార్టీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో రైలు కింద పడి వ్యక్తి మృతి

**నిజామాబాద్ అర్బన్, డిసెంబర్ 26 పెన్ పవర్:** శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీ రైల్వే ట్రాక్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగిందా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో కామారెడ్డి రైల్వే ఎస్ఐ లింబాద్రి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## ఎల్లారెడ్డి అయ్యప్ప ఆలయంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

**నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఎల్లారెడ్డి పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త ముత్యపు బాలకిషన్ సెట్ దంపతులు ఈ పూజను నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో, చంద్రంగురు స్వామి సహకారంతో పూజ జరిగింది. అయ్యప్ప స్వామికి 12 అభిషేకాలు చేసి, 18 మెట్లపై కర్పూరం వెలిగించి హారతులు ఇచ్చారు. అనంతరం స్వాములకు, సివిల్ స్వాములకు భోజన ఏర్పాట్లు చేశారు. బాలకిషన్ స్వామి కుమారుడు సంతోష్ ఎల్లారెడ్డిలో అయ్యప్పను దర్శించుకుని, ఒక పెద్ద పని విజయవంతం కావడంతో మొక్కు తీర్చుకున్నారు.

## ఎస్సీ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన దేవేందర్ పై చర్యల తీసుకోవాలి



**బోధన్, డిసెంబర్ 26 పెన్ పవర్:** బాన్సువాడ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు, బోర్లం గ్రామానికి చెందిన ఎస్సీ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన పి. దేవేందర్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐ శ్రీధర్‌లకు వినతిపత్రం సమర్పించారు. చట్ట ప్రకారం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు మైసయ్య, డివిజన్ అధ్యక్షులు దేశాయిపేట్ ప్రశాంత్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నెర్రె నర్సింలు, డివిజన్ ఉపాధ్యక్షులు మన్నే చిన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఫోరం అధ్యక్షుడి ఎన్నికలో ట్విస్ట్‌లు!

**నర్సాపూర్, డిసెంబర్ 26 పెన్ పవర్:** చిన్నశంకరంపేటలో బుధవారం జరిగిన సమావేశంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కామారం తండా సర్పంచ్ మోహన్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే, 31 గ్రామపంచాయతీలలోని 16 మంది సర్పంచులు పార్టీలకతీతంగా చిన్నశంకరంపేట సర్పంచ్ %చీ=×% కంజర్ల చంద్రశేఖర్‌ను సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. రెండు వేర్వేరు ఎంపికలు చోటుచేసుకున్నాయి.

## నూతన సర్పంచులు, వార్డు సభ్యులను సన్మానించిన హనుమంతరావు

**హుస్నాబాద్, డిసెంబర్ 26 పెన్ పవర్:** మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం చల్మెడ కమాన్ నుంచి నిజాంపేట వరకు భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచులు, వార్డు సభ్యులను హనుమంతరావు ఘనంగా సన్మానించారు. అలాగే ఇతర పార్టీలకు చెందిన నాయకులను కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఆయుత మహా చండీయాగంలో పాల్గొన్న హర్యానా మాజీ గవర్నర్

**గజ్వేల్, డిసెంబర్ 26 పెన్ పవర్:** హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో జరుగుతున్న ఆయుత మహా చండీయాగంలో పాల్గొన్నారు. ఆయన ఆలయానికి చేరుకోగానే వేద పండితులు డోలు, మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. దత్తాత్రేయ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్వాహకులతో యాగ విశేషాలను తెలుసుకున్నారు.

## సర్పంచ్ స్వప్న హరీష్‌ను సత్కరించిన గుర్రాలగొంది గ్రామ ఉద్యోగులు



**సిద్దిపేట, డిసెంబర్ 26 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లాలోని గుర్రాలగొంది గ్రామంలో, గ్రామ ఉద్యోగులు నూతన సర్పంచ్ ఆకుల స్వప్న హరీష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగి డాక్టర్ శంకర్ మాట్లాడుతూ, జిల్లాలోనే అత్యధిక ఉద్యోగులు కలిగిన ఈ గ్రామం మరింత అభివృద్ధి చెందడంలో ఉద్యోగులు తమ వంతు పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశంతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో అయ్యప్ప స్వామి పుష్ప రథోత్సవం అంగరంగ వైభవంగా

**దుబ్బాక, డిసెంబర్ 26 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో శుక్రవారం అయ్యప్ప స్వామి ఆలయం నుంచి అంగడిపేట హనుమాన్ దేవాలయం వరకు అయ్యప్ప స్వాములు పుష్ప రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. దేదీప్యమానంగా కొనసాగిన ఈ ఉత్సవం భక్తులందరినీ ఆకట్టుకుంది.

## మందుబాబులకు అడ్డాగా మారిన ప్రభుత్వ స్కూల్

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 26 పెన్ పవర్:** నర్వ మండలంలోని కల్వల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద వైన్స్ షాపు ఉండటంతో, సెలవుల సమయంలో పట్టణాల నుంచి వచ్చిన మద్యం ప్రియులు, గ్రామస్తులు పాఠశాల తరగతి గదుల్లోనే మద్యం సేవిస్తూ, చెత్తను అక్కడే వదిలివేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ దుశ్చర్యపై అధికారులు వెంటనే స్పందించి, మద్యం షాపును తరలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, మద్యం షాపును తరలిస్తామని చెప్పి ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు.

## గ్రామ సమస్యలపై సర్పంచ్ రామచందర్ పర్యటన, ప్రజలకు భరోసా




**నారాయణపేట, డిసెంబర్ 26 పెన్ పవర్:** నారాయణపేట మండలం బండ గుండ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రామచందర్, గ్రామంలోని ప్రధాన సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులతో చర్చిస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ఉపాధిలో అక్రమాలకు చెక్

**అచ్చంపేట, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఉపాధి పనుల్లో అక్రమాలు గుర్తించిన ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. పనులు చేయకుండానే బిల్లులు పొందడాన్ని గుర్తించింది. పారదర్శకతకు పెద్దపీట వేయాలని ఉపాధి బిల్లులను ఖజానా (ట్రెజరీ) శాఖకు పంపిన తర్వాత మాత్రమే నిధులు విడుదల చేయనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త పద్ధతి ఇలా..: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టే వివిధ రకాల పనులకు సంబంధించిన వివరాలను 'ఎస్ఎన్ఏ స్పార్ష్' మాడ్యూల్‌ను అమల్లోకి తెస్తూ మార్గదర్శకాలు జారీ చేశారు. గ్రామస్థాయిలో చేపట్టిన పనులకు ఉపయోగించిన సామగ్రి, కూలీలు చేసిన పనుల రికార్డులను ట్రెజరీకి ఇవ్వాలి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఐటీడీఏ, అటవీ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఉపాధి పనులన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. ట్రెజరీ శాఖలో వాటిని ఆమోదించిన తర్వాత పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్)కు వివరాలు పంపిస్తారు. అక్కడ వాటిని పరిశీలించి ఆమోదం తెలిపితే నిధులు విడుదల అవుతాయి. కొత్త విధానంతో అక్రమాలకు అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

# పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- 469 మంది కళ్యాణలక్ష్మీ మరియు షాదీముబారక్ రూ.4,69,54,404 విలువైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే.**




**జయశంకర్ భూపాలపల్లి: పెన్ పవర్:** పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ, కొత్తపల్లిగోరి, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి మరియు గణపురం మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 469 మంది కల్యాణలక్ష్మి మరియు షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.4,69,54,404 విలువైన చెక్కులను రేగొండ రైతువేదిక, చిట్యాల రైతువేదిక మరియు గణపురం జీపీ కార్యాలయ ప్రాంగాణంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా చోట్ల మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు వరంగా మారాయని అన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందుతుందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని, ముఖ్యంగా మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలల్లో ఆయా గ్రామాల సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామన్న ఎమ్మెల్యే జీఎస్సార్...

గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు నుంచి నీటిని దిగువకు యాసంగి పంటల సాగుకు నీటిని ఈరోజు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా యాసంగి పంట సాగు చేసుకునేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. గణపసముద్రం చెరువు నీటిని విడుదల చేయడం ద్వారా ఆయకట్టు పరిధిలోని పొలాలకు సరిపడా నీరు అందుతుందన్నారు. నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు రైతులకూ సమాన ప్రాధాన్యత ఇస్తూ సాగునీటి సరఫరా కొనసాగుతుందని, కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నిర్వహణపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నీటి వృథా జరగకుండా పర్యవేక్షణ పెంచినట్లు పేర్కొన్నారు. రైతులే ప్రభుత్వానికి కేంద్రబిందువని, వారి సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్:పెన్ పవర్:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు ప్రారంభం.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, అందుకు చెకుముకి సంబరాలు, సైన్స్ ఫెయిర్ దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పద్మ నగర్ లోని పారమిత హెరిటేజ్ స్కూల్లో ఈనెల 26 నుండి 28 వరకు రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నారు.

శుక్రవారం ఈ సంబరాల ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో ఆలోచించాలని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్, చెకుముకి సంబరాలు వంటివి ఉపకరిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో ప్రజల్లో మూఢనమ్మకాలను చెరిపివేస్తూ సైన్స్ కోణంలో అవగాహన కల్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని తెలిపారు.

నిత్యజీవితంలో రోజువారి కార్యక్రమాన్నీ సైన్స్ తో ముడిపడి ఉన్నాయని అన్నారు. విద్యార్థులు ముఖ్యంగా గణితం, సైన్స్ సబ్జెక్టులపై దృష్టి పెట్టాలని అన్నారు. నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో సైన్స్ కోణంలో పరిశీలించాలని సూచించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ తోటి విద్యార్థులతో చర్చించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు థియరీ పాఠాలతోపాటు



ప్రాక్టికల్స్ పై దృష్టి సాధించాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలను తప్పనిసరిగా ఉపయోగించాలని అన్నారు. మోడల్ స్కూల్ పిల్లలు సైన్స్ పట్ల చూపుతున్న ఉత్సాహం అభినందనీయమని, వారి ప్రయోగాలు, ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. పాఠశాలల్లో వివిధ అంశాల్లో విద్యార్థుల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన క్లబ్స్ సభ్యులు మరింత మంది విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు.

తాను గతంలో సైంటిస్ట్ గా పని చేసిన అనుకోని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు చెలిమెల రాజేశ్వర్, జెవివి రాష్ట్ర కార్యదర్శి పి.మనీంద్రం, సీసీఎంబి మాజీ డైరెక్టర్ మోహన్ రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ ప్రసాదరావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, చక్రపాణి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జె వి వి వైస్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, జె వి వి నాయకులు ఆనంద్ కుమార్, వెంకటేశ్వరరావు, రామచంద్రయ్య, శ్రీకాంత్, వరప్రసాద్, అందే సత్యం, సిహెచ్ రామరాజు,ఆర్ వెంకటేశ్వరరావు,ఎన్ దేవేందర్,గంగారాం,శంకర్, రమేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటీజేన్లు,పెన్షనర్లు సమాజ మార్గదర్శకులు.

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

**జగిత్యాల :పెన్ పవర్:** సీనియర్ సిటీజేన్లు,పెన్షనర్లు సమాజానికి మార్గదర్శకులని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎమ్.సంజయ్ కుమార్ అన్నారు.శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్స్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ రూపొందించిన 2026 డైరీలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హరి అశోక్ కుమార్ కోరిన సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ సమస్యల పరిష్కారం,సంక్షేమం కోసం వారి సంఘాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్,అసంఘాల ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథము,పి.సి.హన్మంతరెడ్డి,వెల్ముల ప్రకాష్ రావు తదితరులు చేస్తున్న సేవలను అభినందించారు. సీనియర్ సిటీజేన్స్ ,పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ సీనియర్ సిటీజేన్స్ కోసం ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని,జిల్లా కేంద్రంలో ఒక ఎకరం ప్రభుత్వ స్థలాన్ని సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా భవనం కోసం కేటాయించాలని,నిర్మాణంకు నిధులు మంజూరు చేయించాలని,2024 ఏప్రిల్ నుంచి రిటైర్మెంట్ అయిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు పెన్షనరీ ప్రయోజనాలు వెంటనే చెల్లింపు జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్



సిటీజేన్స్,పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్,పెన్షనర్స్ జిల్లా సిటీజేన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథము,సీనియర్ సిటీజేన్స్ ,పెన్షనర్ల నాయకులు పూసాల అశోక్ రావు,కే.సత్యన్నారాయణ, వెలముల ప్రకాశ్ రావు,సిగిరి తిరుపతి, ఎమ్.డి.యాకూబ్,మానాల కిషన్,కట్ట గంగాధర్,కందుకూరి సత్యనారాయణ,ఎండి.ఏక్బాల్,సయ్యద్ యూసుఫ్,బి.రాజేశ్వర్,నాయిని సంజీవ రావు, విఠల్,పబ్బా శివానందం,వొజ్జల బుచ్చి రెడ్డి,జిల్లా,డివిజన్ల,మండలాల సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈ నెల 30 న ముదిరాజ్ సర్పంచుల సన్మాన కార్యక్రమం



**హైదరాబాద్: పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 30న రవీంద్రభారతిలో జరగనున్న "ముదిరాజ్ సర్పంచుల సన్మాన కార్యక్రమం" పోస్టర్ను ఈ రోజు సిద్దిపేట జిల్లా కేంద్రం లో ప్రెస్ క్లబ్ లో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ హాజరవుతారని, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికైన ముదిరాజ్ సర్పంచులను గౌరవప్రదంగా సన్మానించడం ద్వారా సమాజంలో రాజకీయ చైతన్యాన్ని మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ తెలిపారు.అన్ని రాజకీయ పక్షాలకు అతీతంగా, సామాజిక ఐక్యతకు ప్రతీకగా ఈ సన్మాన సభ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతీ ఒక ముదిరాజ్ బిడ్డ ఈ కార్యక్రమానికి విచ్చేసి సన్మాన సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఆవిష్కరణ కార్యక్రమంలో ముదిరాజ్ సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు మరియు స్థానిక ముదిరాజ్ నాయకులు గుమ్మడి శ్రీశైలం ముదిరాజ్, బుచ్చెళ్ళు రవి ముదిరాజ్, మల్కి నరసింహులు ముదిరాజ్, పల్లె రాజు ముదిరాజ్, చింతమడక రాజన్న ముదిరాజ్, దత్తు ముదిరాజ్, పిల్లి నారాయణ ముదిరాజ్ చంది శ్రీనివాస్ ముదిరాజ్, పిల్లి నర్సింలు ముదిరాజ్, బుస వంశీ, నవీన్ ముదిరాజ్ మరియు ముదిరాజ్ కులసంఘాల రాష్ట్ర నాయకులు మరియు ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు

# ల్యాబ్ టెక్నిషియన్ల పోస్టులలో నకిలీలు

**హైదరాబాద్, డిసెంబర్ 26, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల ద్వారా అనర్హులు వెయిటేజీ మార్కులు పొంది, అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతేడాది సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు.. మిగిలిన 20 మార్కులు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారికి వెయిటేజీగా కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రతి ఆరు నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారికి 2 పాయింట్ల చొప్పున గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. అభ్యర్థి గతంలో ఖచ్చితంగా 'ల్యాబ్ టెక్నీషియన్' హోదాలోనే ప్రభుత్వ ఆస్పత్రులు లేదా విభాగాల్లో పనిచేసి ఉండాలి. వేరే ఇతర హోదాల్లో పనిచేసిన వారికి ఈ వెయిటేజీ వర్తించదు.ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో అసలు అక్రమాలు బయటపడ్డాయి. ఏడు జోన్ల పరిధిలో (చార్మినార్, జోగులాంబ, యాదాద్రి, రాజన్న, భద్రాద్రి, బాసర, కాళేశ్వరం) అభ్యర్థుల జాబితాను పరిశీలించిన బాధితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లు, ఆర్టీపీసీఆర్ సైంటిస్టులు, టీ-హబ్ మేనేజర్లు, ల్యాబ్ అటెండెంట్లు సైతం ల్యాబ్ టెక్నీషియన్లుగా తప్పుడు సర్వీస్ సర్టిఫికెట్లు సృష్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నోటిఫికేషన్‌లో సూచించిన ఫార్మాట్‌లో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నత అధికారులదే. అయితే.. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించకుండానే కొందరు అధికారులు ఈ ఫేక్ సర్టిఫికెట్లను జారీ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కోవిడ్ సమయంలో తాత్కాలికంగా పనిచేసిన వారు కూడా నిబంధనలకు విరుద్ధంగా సర్వీస్ మార్కులు పొందినట్లు అభ్యర్థులు ఆధారాలతో సహా నియామక బోర్డుకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వెంటనే జాబితాను ప్రక్షాళన చేసి అర్హులకు మాత్రమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# 6.5 కోట్లతో అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ ట్రాక్

**కరీంనగర్, డిసెంబర్ 26, పెన్ పవర్:** ఉత్తర తెలంగాణ క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో జమ్మికుంటలో రూ. 6.5 కోట్లతో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 'ఖేలో ఇండియా' పథకం కింద నిర్మించనున్న ఈ ట్రాక్, గ్రామీణ క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ అవకాశాలను అందించి, ఉత్తర తెలంగాణను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దనుందిఉత్తర తెలంగాణలోని క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ, కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయంతో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగంగా.. 'ఖేలో ఇండియా' పథకం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ రూ. 6.5 కోట్లు కేటాయిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ అధునాతన ట్రాక్‌ను నిర్మించనున్నారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల పొడవు, 4 లైన్లతో ఈ సింథటిక్ ట్రాక్ రూపుదిద్దుకోనుంది. సాధారణంగా మట్టి ట్రాక్‌లపై శిక్షణ పొందే గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లినప్పుడు అక్కడి సింథటిక్ ట్రాక్‌ల స్వభావాన్ని అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. ఇప్పుడు జమ్మికుంటలోనే ఇటువంటి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల, క్రీడాకారులు తమ సొంత ప్రాంతంలోనే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు కేవలం జమ్మికుంటకే పరిమితం కాకుండా కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల మరియు పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల్లోని వేలాది మంది క్రీడాకారులకు వరం కానుంది. సింథటిక్ ట్రాక్‌తో పాటు లాంగ్ జంప్, హై జంప్ వంటి ఇతర అథ్లెటిక్స్ క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఇక్కడ అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఈ ట్రాక్ నిర్మాణంపై బండి సంజయ్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నిధులను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' పథకం ఉద్దేశ్యం క్రీడలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడం. జమ్మికుంట వంటి ప్రాంతంలో ఇలాంటి ప్రాజెక్టు రావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. త్వరలోనే ఈ ట్రాక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి, ఏడాది లోపే క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆధునిక ట్రాక్ అందుబాటులోకి వస్తే, ఉత్తర తెలంగాణ భవిష్యత్తులో దేశానికి మేటి అథ్లెట్లను అందించే క్రీడా కేంద్రంగా అవతరించడం ఖాయం.

# సవాళ్లు, ప్రతి సవాళ్లు... ఇకపై ఫుల్ యాక్టీవ్‌గా పాలిటిక్స్

**మెదక్, డిసెంబర్ 26, పెన్ పవర్:** ఇప్పటిదాక ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క. అడ్డగోలుగా మాట్లాడుతామ్. నోటికొచ్చినట్లు వాగుతామ్ అంటే కుదరదు. ప్రజాక్షేత్రంలోకి లాగుతాం. మీ సంగతేంటో చూస్తామని..కాంగ్రెస్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కాంగ్రెస్ సర్కార్‌కు కావాల్సిన టైమ్ ఇచ్చామని..ఇక పోరు బాటే అంటూ యుద్ధం ప్రకటించారు. దాదాపు రెండేళ్ల పాటు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన గులాబీ బాస్ ఇకపై ఫుల్ యాక్టీవ్‌గా పాలిటిక్స్‌లో ఉంటానని చెప్పుకొచ్చారు.రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సంసిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌ను ఎంచుకున్నారు కేసీఆర్. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కృష్ణా జలాలను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్న కేసీఆర్..ఆందోళనలు, సభలు, సమావేశాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపంగా మారిందని కేసీఆర్ శాపనార్థాలు పెట్టడం, హస్తం పార్టీ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించి ఇకపై ప్రజల్లోకి వెళ్తామని యుద్ధం ప్రకటించడంతో రాజకీయం వేడెక్కింది. రెండేళ్లుగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్‌లో కేసీఆర్ రాక ఉత్సాహాన్ని నింపింది. ఇక పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన దాని కంటే మెరుగైన ఫలితాలు రావడంతో..ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఇంకా సత్తా చాటొచ్చన్న నమ్మకం పెరిగింది.కేసీఆర్ చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం మధ్య డైలాగ్‌వార్‌కు దారితీశాయి. బీఆర్ఎస్, కేసీఆర్ చరిత్ర ఇక ముగిసిన కథే అంటున్నారు సీఎం రేవంత్. తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్ కుటుంబం అధికారంలోకి రాదని, రానివ్వబోనని కొడంగల్ సాక్షిగా శపథం చేశారు. 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 80 సీట్లు, 153 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 100కుపైగా సీట్లు గెలుచుకుంటాం..ఇది తన సవాల్ రాసిపెట్టుకోండి అంటూ గర్జించారు రేవంత్.అందుకు అనుగుణంగానే కేసీఆర్‌తో పాటు గులాబీ పార్టీ నేతల దూకుడుకు బ్రేకులు వేసేలా పథకం రచిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పాలనలో స్కామ్‌లు జరిగాయంటూ కేసులు, విచారణలను స్పీడప్ చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ ఆఫీసర్లు కేసీఆర్ సహా కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల తర్వాత జనంలోకి వచ్చేందుకు రెడీ అవుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఇది ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన కేసీఆర్‌కు.. సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసుతో బ్రేకులు వేయబోతున్నారన్న చర్చ సాగుతోంది. అంతే కాకుండా ఈ నెల 29 నుంచి ప్రారంభవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నదీజలాలు, ప్రాజెక్టుల అంశం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీతో కుదుర్చుకున్న ఒప్పందం తెలంగాణకు శాపంగా మారిందని




చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్, ఫార్ములా ఈ కారు రేస్ వంటి అంశాలను సభలో ప్రస్తావనకు తెచ్చేందుకు రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోందట.కేసీఆర్‌కు నోటీసులు కొత్త కాదని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగిపోవడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరై డీటేయిల్డ్‌గా సమాధానం ఇచ్చిన విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు బీఆర్ఎస్ నేతలు. ఒకవేళ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తే ఆయన విచారణకు హాజరవుతారా లేదా అన్న అంశంపై ఇంకా స్పష్టత లేదంటున్నాయి పార్టీ వర్గాలు. ఫార్ములా ఈ కారు రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండుసార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు.కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడంతో అరెస్ట్ తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఇదంతా రాజకీయ కక్ష సాధింపు చర్య అన్నది కారు పార్టీ నేతల వాదన. కేసులు విచారణలు తమను చికాకు పెడుతున్నాయన్న అసహనం బీఆర్ఎస్ వర్గాల్లో కనిపిస్తోంది. కొత్త సంవత్సరంలో ప్రజల్లోకి వెళ్లాలనుకున్న గులాబీ దళపతి కేసీఆర్ దూకుడుకు..బ్రేకులు వేసేందుకు రేవంత్ పక్కా స్కెచ్ రెడీ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రేవంత్ గేమ్‌కు కేసీఆర్ దగ్గరున్న ప్లాన్ ఏంటో చూడాలి మరి.

# సెలవుల్లో ఉద్యోగులు... ఆఫీసుల ముందు ప్రజలు

**వరంగల్, డిసెంబర్ 26, పెన్ పవర్:** పండుగొచ్చిందంటే చాలు.. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. పండుగకు ముందు, తర్వాత రోజు అధికారులు, సిబ్బంది సెలవు పెట్టి వెళ్తున్నారు. పండుగ సెలవు ఒక్కరోజే ఉన్నప్పటికీ, ఆఫీసులు మాత్రం రెండు, మూడు రోజుల పాటు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సెక్రటేరియెట్ మొదలుకుని మండల ఆఫీసుల దాకా ఇదే పరిస్థితి నెలకొన్నది. పండుగ మూడ్‌లో ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలు అధికారుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. సెక్రటేరియెట్‌లో ఫ్లోర్‌కు ఒక సెక్రటరీ అన్నట్టుగా ఐదుగురు కంటే ఎక్కువ మంది కనిపించలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి.. విధుల్లో అలసత్వం వహించవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. కానీ మరుసటి రోజే చాలామంది ఉన్నతాధికారులు విధులకు డుమ్మా కొట్టారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు వంటి అధికారులే తమ చాంబర్లలో కనిపించలేదు. మధ్యాహ్నం 3 గంటలకు సెక్రటేరియెట్‌లో ఐదుగురు సెక్రటరీలు మాత్రమే అందుబాటులో ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక చీఫ్ మినిస్టర్ ఆఫీసు (సీఎంవో)లోనూ ఇదే తీరు కనిపిస్తున్నది. అక్కడ ఉండే కీలకమైన కార్యదర్శులు ఆఫీసుకు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సీఎంతో బ్రీఫింగ్ ఉన్న సమయంలో వాళ్లు ఎలాగూ ప్రజలకు అందుబాటులో ఉండరు. కానీ మిగతా సమయాల్లో, సీఎం జిల్లాల పర్యటనకు వెళ్లిన టైమ్‌లోనూ వాళ్లు చాంబర్లలో ఉంటలేరు. ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఓఎస్డీ శ్రీనివాసులు మినహా మిగతా సెక్రటరీలు ఉన్నారా?లేరా? అన్నది తెలియడం లేదు. అసలు వీరు ఎవరిని కలుస్తున్నారు? ఎక్కడ ఉంటున్నారు? అన్నది అంతుచిక్కడం లేదు. ఐఏఎస్ అధికారులే ఉంటలేరని సాకుగా చూపిస్తూ అదనపు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, అసిస్టెంట్ సెక్రటరీల నుంచి మొదలుకొని సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల వరకు అందరూ ఇదే బాటలో పయనిస్తున్నారు. సెక్రటేరియెట్ లెక్కనే జిల్లా, మండల కార్యాలయాల్లోనూ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖల అధికారులు ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయాలకు రావడం లేదు. వచ్చినా కాసేపటికే మీటింగ్ ఉందంటూ బయటకు వెళ్లిపోతున్నారు. సామాన్య ప్రజలు ఎక్కువగా వెళ్లేది మండల కార్యాలయాలకే. కానీ అక్కడ పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీసుల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పండుగ వచ్చిందంటే చాలు.. ఈ కార్యాలయాల్లో సగం మంది సిబ్బంది సెలవు పెట్టకుండానే డుమ్మా కొడుతున్నారు. దీంతో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం, భూసమస్యల పరిష్కారం, ఇతరత్రా పనుల మీద వచ్చే జిల్లా, మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ పనిదినాల్లో సైతం అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10:30 గంటలకు కార్యాలయాల్లో ఉండాల్సిన సిబ్బంది.. మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా రావడం లేదు. తీరా 12 గంటలకు ఆఫీసులకు చేరుకున్నా, గంట సేపు కూడా పని చేయకుండానే లంచ్ బ్రేక్ పేరుతో బయటకు వెళ్లిపోతున్నారు. తిరిగి సీట్లలోకి వచ్చేసరికి మధ్యాహ్నం 3 గంటలు దాటుతోంది. మళ్లీ సాయంత్రం 4 గంటలు అయిందంటే చాలు, బ్యాగులు సర్దుకుని ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండో శనివారం మాత్రమే సెలవు. కానీ వారాంతం వచ్చిందంటే చాలు యంత్రాంగం మొత్తం రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లిపోతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే సొంత పనుల మీద, ఊర్ల ప్రయాణాల మీద దృష్టి సారించే అధికారులు.. శనివారం కార్యాలయాల్లో సంతకం పెట్టి వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం తర్వాత ఏ ప్రభుత్వ ఆఫీసులో చూసినా పట్టుమని పదిమంది ఉద్యోగులు కూడా కనిపించని దుస్థితి నెలకొంది.

## పువ్వళ్ల దుర్గాప్రసాద్‌కు కాంగ్రెస్ నాయకుల వీడ్కోలు

**ఖమ్మం, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పువ్వళ్ల దుర్గాప్రసాద్ విదేశీ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కిలారు అనిల్, యువసేన కమిటీ సభ్యులు తగరం రాంబాబు, తగరం నాగరాజు, తగరం వెంకయ్య, కన్నెకంటి హర్షవర్ధన్, మరియు ఖమ్మం జిల్లా స్వేరో అధ్యక్షులు తగరం శ్రీకాంత్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలికారు. ఈ భేటీ విదేశీ పర్యటనకు ముందురోజు జరిగింది.

## దుకాణదారులకు బయో డిగ్రేడబుల్ కవర్లు పంపిణీ

**మధిర, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఖమ్మం గాంధీ చౌక్ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేసే కార్యక్రమంలో భాగంగా కేఎంసీ అధికారులు శుక్రవారం దుకాణదారులకు, చిరువ్యాపారులకు బయో డిగ్రేడబుల్ కవర్లను ఉచితంగా అందజేశారు. ఒక్కో దుకాణానికి కేజీ కవర్లను అందించారు. ఈ సందర్భంగా ఏఎంసీ అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, బయో డిగ్రేడబుల్ కవర్లను మాత్రమే ఉపయోగించాలని వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

## ఖమ్మంలో ఎన్ఐఏ సోదాలు అవాస్తవం

**పాలేరు, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఖమ్మంలోని రెండు విద్యాసంస్థల యాజమాన్యాల ఇళ్లలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు జరిగినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. పాలస్తీనాకు సంఘీభావంగా కొన్ని నెలల క్రితం జరిగిన ర్యాలీ నేపథ్యంలో ఈ వార్తలు వెలువడ్డాయి. అయితే, కొద్ది రోజుల క్రితం సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి ఒకరు పాఠశాలల ప్రిన్సిపాళ్లతో చర్చించినట్లు సమాచారం.

## అదనపు కట్నం వేధింపులు.. గర్భిణీ ఆత్మహత్య

**భూపాలపల్లి, డిసెంబర్ 26 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో అదనపు కట్నం వేధింపులు తాళలేక ఆరు నెలల గర్భిణీ అయిన అంజలి (21) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మార్చి 10న భూపాలపల్లి జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటేశ్‌తో వివాహమైంది. అప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు ఎదుర్కొంటున్న అంజలి, దసరా పండగకు తల్లిగారింటికి వచ్చింది. భర్త వెంకటేశ్ కుటుంబ సభ్యులతో వచ్చి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా, అంజలి అత్తింటికి వెళ్లడానికి ఇష్టపడక ఆత్మహత్య చేసుకుంది.

## విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు ఉద్యోగి మృతి



**వరంగల్ వెస్ట్, డిసెంబర్ 26 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కొత్తపేట సబ్ స్టేషన్ పరిధిలోని కాచనపల్లికి చెందిన ఓ రైతు తమ విద్యుత్ మోటారుకు ఫీజులు ఆగడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి ఊకే వెంకటేశ్వర్లు మోటారును పరీక్షిస్తుండగా, అనుకోకుండా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## రైతుల ఆందోళన, రోడ్డెక్కిన రైతులు

**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్‌లో యూరియా కొరతపై రైతులు శుక్రవారం తొర్రూర్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సకాలంలో ఎరువులు అందడం లేదని, యూరియా బస్తాల కోసం గంటల తరబడి వేచి చూసినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యూరియా నిల్వలను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పరకాల పట్టణంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కి నివాళులు

**పరకాల, డిసెంబర్ 26 పెన్ పవర్:** పరకాల పట్టణంలో మన్మోహన్ సింగ్ వర్ధంతినీ పురస్కరించుకొని పరకాల పట్టణ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ 2004 మే 22న బాధ్యతలు స్వీకరించారన్నారు. 1991లో ఆర్థిక శాఖా మంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల వలన భారతదేశ చరిత్రలో ముఖ్యుడిగా భావించబడ్డాడు అని తెలిపారు.

## వరద బాధితులకు న్యాయం చేయాలి:

**నర్సంపేట, డిసెంబర్ 26 పెన్ పవర్:** వరద బాధితులను ఆదుకోవాలని, 100 ఫీట్ రోడ్ సెంటర్ లైటింగ్ ప్రారంభించాలని సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ (వెస్ట్) లోని తులసి బార్ నుండి సమ్మయ్య నగర్ ఇంజనీరింగ్ కాలనీ వరకు రాస్తారోకో నిర్వహించారు. స్లమ్ ఏరియాలో తుఫానుతో నష్టపోయిన ప్రాంతాలను సర్వే చేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు కుక్కమూడి రవీందర్ డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ నల్లని శ్రీనివాస్ మాట్లాడుతూ, 100 ఫీట్ రోడ్డు కొట్టుకుపోయిన డ్రాప్ వాల్ తెగిపోయినా ప్రభుత్వం మరమ్మత్తులు చేయట్లేదని, రోడ్డు సరిగా లేకపోవడం వల్ల అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నా పట్టించుకోవట్లేదని అన్నారు.

## జాఫర్‌ఘడ్ రోడ్లు అధ్వానం: అధికారులు స్పందించాలని స్థానికుల డిమాండ్

**జనగామ, డిసెంబర్ 26 పెన్ పవర్:** జనగామ జిల్లా జాఫర్‌ఘడ్ మండలానికి చెందిన సాగరం, తిడుగు, కోనచలం గ్రామాల్లోని రోడ్లు గత వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, అధిక సంఖ్యలో ట్రాక్టర్ల నుంచి ఇసుక రవాణా చేయడం వల్ల అధ్వానంగా మారాయి. ఈ సమస్యపై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తు పనులు చేపట్టాలని స్థానికులు ఈరోజు మీడియా ప్రతినిధులకు తెలియజేశారు.

## అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

**మెదక్, డిసెంబర్ 26 పెన్ పవర్:** అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ, అన్నమయ్య సాహితీ కళా వికాస పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 28న శ్రీనివాస కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సూత్రపు అభిషేక్ తెలిపారు. గత ఏడు సంవత్సరాలుగా ఈ అకాడమీ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నమయ్య జయంతి వంటివి నిర్వహిస్తూ కళా సేవ చేస్తోంది. ఆధ్యాత్మిక పునరుద్ధరణ లక్ష్యంగా ప్రతి ఏటా శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ములుగు క్రాస్ రోడ్ లోని వెంకటేశ్వర గార్డెన్స్ లో ఈ కార్యక్రమం జరగనుంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ఆదిలాబాద్, డిసెంబర్ 26 పెన్ పవర్:** నేరడిగొండ మండల పరిధిలోని బోథ్ రోడ్డు చించోలి హనుమాన్ ఆలయం వద్ద ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. బైక్ పై వెళు_న్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు బలంపూర్ గ్రామం, బజరత్నూర్ మండలం వాసి. ఆటోలో ఉన్న మరికొందరికి తీవ్ర, స్వల్ప గాయాలయ్యాయి. వీరిని కూడా ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన




**బోథ్, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచ్చులాపూర్ గ్రామంలో మావల సిఎఫ్ఎల్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీజీబీ సుంకిడి మేనేజర్ విజయ్ రాజేంద్ర పాటిల్, కౌన్సిలర్లు కమలాకర్, సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని, కేవైసీ చేసుకోవాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి వివరించారు. అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లను బ్యాంకు లేదా ఉద్గమ్ పోర్టల్ ద్వారా తిరిగి పొందవచ్చని తెలిపారు.

## ఆన్‌లైన్ గేమ్ లకు బానిస.. కుమారుడిపై తల్లి ఫిర్యాదు

**నిర్మల్, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఆదిలాబాద్ టూటౌన్ లో ఆన్‌లైన్ గేమ్లకు బానిసగా మారిన తన కుమారుడిపై తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యానగర్ కు చెందిన సామెరా బీ తన కుమారుడు షేక్ సోహెల్ ఆన్లైన్లో ఆటలు ఆడుతూ డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా, తరచూ డబ్బులివ్వాలని తల్లిని, భార్యను శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

## కేంద్ర, జిల్లా మంత్రులకు ఆదిలాబాద్‌లో ఘన సన్మానం

**ఖానాపూర్, డిసెంబర్ 26 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులకు పెన్ గంగా గెస్ట్ హౌస్‌లో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని మంత్రులకు శాలువాలు కప్పి సత్కరించారు. అధికార కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు.

## గొల్లమడ మహిళా సంఘ భవన,
## పాఠశాల గోడకు రూ.20 లక్షలు మంజూరు

**ముథోల్, డిసెంబర్ 26 పెన్ పవర్:** నర్సాపూర్ (జి) మండలం గొల్లమడలో మహిళా సంఘ భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు, ఉన్నత పాఠశాల గోడ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయించినందుకు గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ పనులకు సంబంధించిన అధికారిక జారీ పత్రాలను వారికి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన పచ్చునూరు సర్పంచ్, వార్డు మెంబర్లు

**మానకొండూరు, డిసెంబర్ 26 పెన్ పవర్:** మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామ సర్పంచ్ పార్నంది కిషన్, వార్డు సభ్యులు తాళ్ల వెంకటేశ్, నెలవేణి సుశీల, కోమల్ల నరేష్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్ఎండీలోని ప్రజాభవన్ లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పచ్చునూరు గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, గ్రామ అవసరాల మేరకు చేపట్టే అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయిస్తానని, గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

## అదనపు కట్నం వేధింపులు.. గర్భిణీ ఆత్మహత్య

**హుజూరాబాద్, డిసెంబర్ 26 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో అదనపు కట్నం వేధింపులు తాళలేక ఆరు నెలల గర్భిణీ అయిన అంజలి (21) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మార్చి 10న భూపాలపల్లి జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటేశ్‌తో వివాహమైంది. అప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు ఎదుర్కొంటున్న అంజలి, దసరా పండగకు తల్లిగారింటికి వచ్చింది. భర్త వెంకటేశ్ కుటుంబ సభ్యులతో వచ్చి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా, అంజలి అత్తింటికి వెళ్లడానికి ఇష్టపడక ఆత్మహత్య చేసుకుంది.

## కబడ్డీ ప్రాంగణానికి రూ. 40 లక్షలు: మంత్రి

**కరీంనగర్, డిసెంబర్ 26 పెన్ పవర్:** కరీంనగర్లో కబడ్డీ క్రీడా ప్రాంగణం నిర్మాణానికి రూ. 40 లక్షల నిధులు మంజూరు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా మైదానాలను అభివృద్ధి చేసిందని ఆయన గుర్తుచేశారు. సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రాంగణం నిర్మాణం జరుగుతుందని, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## ఇల్లంతకుంట నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**చొప్పదండి, డిసెంబర్ 26 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలంలో శుక్రవారం నూతన గ్రామపంచాయతీ పాలకవర్గానికి ఘన సన్మానం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ అయ్యన్నగారి హరికృష్ణా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ మామిడి రాజు, ఉపసర్పంచ్ మూగ నాగరాజు శర్మ, వార్డ్ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి రాజు గోశాలకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, ఉపసర్పంచ్ నాగరాజు శర్మ సృష్టి, పర్యావరణ సమతుల్యతలో గోవుల పాత్ర అమోఘమని, పూర్వీకులు అందించిన గోవుల ద్వారా సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ కూనబోయిన బాలరాజు గోవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## కొండగట్టులో ఆటో బోల్తా

**సిరిసిల్ల, డిసెంబర్ 26 పెన్ పవర్:** : మల్యాల మండలం కొండగట్టు ఘాట్ రోడ్డుపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. దైవ దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో ఆటో బ్రేకులు ఫెయిలై బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటోలోని నలుగురికి గాయాలైనట్లు తెలుస్తోంది. అదృష్టవశాత్తు ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భక్తులు అంబులెన్స్కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## భక్తుల భద్రతపై నిరంతరం నిఘా పెట్టాం

**వేములవాడ, డిసెంబర్ 26 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని భీమేశ్వర ఆలయంలో దర్శనాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న 7 మందిపై కేసులు నమోదు చేసినట్లు వేములవాడ ఏఎస్ఐ రుత్విక్ సాయి వెల్లడించారు. మేడారం జాతర సందర్భంగా వేములవాడలో భక్తుల రద్దీ పెరగడంతో దళారులు దర్శనాల పేరుతో దందా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం మీడియాకు తెలిపారు. భక్తులు ప్రైవేట్ వ్యక్తులను నమ్మవద్దని, ఆలయ కౌంటర్లలో మాత్రమే టికెట్లు తీసుకోవాలని సూచించారు. భక్తుల భద్రతపై నిరంతరం నిఘా పెట్టామని పేర్కొన్నారు.

## గ్రామాభివృద్ధి నా అజెండా:
## స్వతంత్ర అభ్యర్థి కిరణ్ కుమార్

**వైరా, డిసెంబర్ 26 పెన్ పవర్:** వైరా నియోజకవర్గం సింగరేణి మండలం గంగారం తండా స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన నూనావత్ కిరణ్ కుమార్, గ్రామ అభివృద్ధి తన అజెండా అని, తనకు ఏ జెండాలు లేవని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చిన తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు.. సంక్షేమ పథకాలు
# 37 వేల మందికి కట్..

**హైదరాబాద్, డిసెంబర్ 26, పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అనర్హులను గుర్తించి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.ముఖ్యంగా పేదలకు ఉద్దేశించిన పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా మారిన విషయం ఉన్నతాధికారుల పరిశీలనలో బయటపడింది. అర్హత లేని వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.ఇదే క్రమంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని రేవంత్ సర్కార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పేదలకు అందించే పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది..ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్న కొంతమంది ఉద్యోగులు నిరుపే దలకు అందాల్సిన పింఛన్లు, ఇండ్లు, చివరకు ఉపాధి హామీ కూలీ డబ్బులను కూడా పొందుతున్నట్టు అధికారిక లెక్కల్లో తేలింది. దీనికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నివేదిక ప్రకారం.. దాదాపు 37 వేల మందికి పైగా ఉద్యోగులు వివిధ పథకాల్లో లబ్ధి పొందుతున్నట్టు బయటపడింది. వీరిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఈ జాబితాలో చిరుద్యోగులే కాదు.. ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాం శంగా మారింది.ప్రభుత్వం పేదలకోసం అందిస్తున్న పథకాల్లో ఏఏ పథకంలో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.. వారిలో ఎంతమంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఎంత మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారనే వివరాలను ఉన్నతాధికారులు ఇప్పటికే సేకరించారు. ఆ డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తక్షణమే నిలిపివేయాలని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు.పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు(47), ఎస్‌జీటీ అండ్ టీజీటీలు (71), పబ్లిక్ హెల్త్ మేనేజర్లు, లెక్చరర్లు, చివరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు(5), జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు కూడా జాబితాలో ఉండడం గమనార్హం. వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉద్యోగులందరి ఆధార్ డేటా తీసుకున్న ప్రభుత్వం.. వాటిని ప్రభుత్వ పథకాలతో సరిపోల్చింది. దీంతో ఈ లెక్కలు బయటపడ్డాయి. ఇంకొన్ని స్కీములలో కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని సెక్రటేరియెట్ వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకంలోనే అత్యధికంగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు. అధికారుల నివేదిక ప్రకారం.. ఈ ఒక్క పథకంలోనే ఏకంగా 15,704 మంది ఉద్యోగుల వివరాలు లబ్ధిదారుల జాబితాతో సరిపోలాయి. వీరిలో అత్యధికంగా 8,273 మంది గౌరవ వేతనం తీసుకుంటున్న చిరుద్యోగులు ఉండగా, 3,202 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, 2,939 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. విచిత్రమేమిటంటే.. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి జీతాలు తీసుకునే స్టేట్ స్కేల్ రెగ్యులర్ ఉద్యోగులు 478 మంది, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు 338 మంది కూడా ఈ పథకం కింద డబ్బులు తీసుకుంటున్నట్టు తేలింది. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, జూనియర్ లెక్చరర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వంటి అనేక రకాల ఉద్యోగులు ఉన్నారు. గ్రామాల్లో పనులు దొరక్క ఇబ్బంది పడే కూలీల కోసం ఉద్దేశించిన ఉపాధి హామీ పథకంలోనూ11,210 మంది ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధి పొందుతున్నట్టు గుర్తించారు. ఇందులో సింహభాగం 7,077 మంది గౌరవ వేతనం తీసుకునే సిబ్బంది ఉన్నారు. అలాగే 2,214 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 1,124 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉపాధి హామీ డబ్బులు పొందుతున్నారు. ఆశ్చర్యకరంగా.. 351 మంది రెగ్యులర్ ఉద్యోగులు కూడా ఉపాధి హామీ కూలీ డబ్బులు తీసుకున్నవారి జాబితాలో ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలోనూ ఉద్యోగులు భారీగానే లబ్ధి పొందారు. మొత్తం 9,135 మంది ఉద్యోగులు ఇండ్లు పొందినట్టు లేదా మంజూరు చేయించుకున్నట్టు డేటాలో తేలింది. వీరిలో 5,177 మంది హానరోరియం సిబ్బంది కాగా, 2,256 మంది కాంట్రాక్ట్, 1,371 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇక 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద 1,444 మంది ఉద్యోగులు లబ్ధి పొందుతుండగా, వారిలోనూ హానరోరియం (954), కాంట్రాక్ట్(328) సిబ్బందే అధికంగా ఉన్నారు. డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కేల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను "తక్షణమే నిలిపివేయాలి" అని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు. అయితే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సర్వీసులు, డైలీ వేజ్, హానరోరియం (గౌరవ వేతనం) తీసుకునే సిబ్బంది విషయంలో ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆదాయ పరిమితి ఆధారంగా ఇస్తున్నందున.. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా అనర్హులుగా పరిగణించాలా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. ఒకవేళ సర్కారు కఠిన నిర్ణయం తీసుకుంటే మాత్రం.. దాదాపు 37 వేల మంది ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలన్నీ నిలిచిపోనున్నాయి

# వరుస కష్టాలతో గులాబీలు

**హైదరాబాద్, డిసెంబర్ 26, పెన్ పవర్:**
అధికారం కోల్పోయినప్పటి నుంచి వరుసపెట్టి ట్రబుల్స్ ఫేస్ చేస్తోంది బీఆర్ఎస్. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, చేసిన పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణల జరుపుతుండటం గులాబీ పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించిన రేవంత్ సర్కార్.. ఆ నివేధిక ఆధారంగా సీబీఐ విచారణకు ఆదేశించింది. దీంతో సీబీఐ దర్యాప్తు ఎలాంటి టర్న్ తీసుకుంటుందోనన్న సస్పెన్స్ కంటిన్యూ అవుతోంది.ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ ఒప్పందాలు, గొర్రెల పంపిణీ స్కీమ్, ఫార్ములా ఈ కార్ రేసింగ్ అంశాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ సర్కార్.. వీటన్నింటిపైనా విచారణ జరిపిస్తోంది. ఇందులో భాగంగా ఈ కార్ రేస్ వ్యవహారంపై కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతిచ్చింది. ఈ కార్ రేస్ కేసులో మరోసారి కేటీఆర్‌ను విచారణకు పిలిచి అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ కేసు ఎటువైపు దారితీస్తుందన్న ఆందోళన బీఆర్ఎస్ వర్గాల్లో నెలకొందిఇక బీఆర్ఎస్ పార్టీలో పలు అంశాలు వివాదాస్పదం అవుతున్నాయి. ముఖ్యంగా కవిత వ్యవహారం కారు పార్టీకి కంట్లో నలుసులా మారిందనే చెప్పొచ్చు. పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పటి నుంచి..వాయిస్ మరింత పెంచారు కవిత. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, నేతలపై అవినీతి ఆరోపణలు, విమర్శలు చేస్తూ..అధికార పార్టీకి అస్త్రాలను అందిస్తుంది. ఇలాంటి ఎన్నో తలనొప్పులు ఉన్న టైమ్‌లో మరోసారి ఫోన్ ట్యాపింగ్ కేసు తెరపైకి రావడం ఆసక్తిరేపుతోందిఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు విచారణను స్పీడప్ చేశారు. ఫోన్



ట్యాపింగ్‌కు అనుమతులిచ్చే రివ్యూ కమిటీలోని ఉన్నతాధికారులు, మాజీ ఇంటెలిజెన్స్ అధికారులను ఇప్పటికే ప్రశ్నించి వారి వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్ రావుకు నోటీసులు ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ సమావేశాల తర్వాత సిట్ నోటీసులు జారీ చేసి ఆ తర్వాత విచారణకు పిలిచే ఛాన్స్ ఉందని అంటున్నారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో సమస్యలతో డైలమాలో ఉన్న గులాబీ పార్టీకి ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసు, నోటీసులు అంటూ జరుగుతున్న ప్రచారంతో మరింత ఆందోళనకు గురవుతోందట. ఇలా వరుస కేసులు, విచారణలతో పాటు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న పరిస్థితుల పట్ల బీఆర్ఎస్ లీడర్లు, క్యాడర్ నైరాశ్యంలో కూరుకుపోతున్నారన్న చర్చ జరుగుతోంది. పైకి ఇవన్నీ కామనే అని కీలక నేతలు చెబుతున్నా.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని పార్టీ కార్యకర్తలు మాత్రం కంగారు పడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది.

# అవినీతిలో అగ్రస్థానం రెవెన్యూ, ఇరిగేషన్ లదే

**హైదరాబాద్, డిసెంబర్ 26, పెన్ పవర్:**
తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటలో ఏసీబీ అధికారులు ఈ ఏడాది దూకుడు పెంచారు. 2025లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 220 కంటే ఎక్కువ కేసులు నమోదు కాగా.. సుమారు 190 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు అరెస్ట్ చేశారు. ముఖ్యంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల్లోనే లంచం కేసులు ఎక్కువగా వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దాదాపు రూ. 58 కోట్ల విలువైన డాక్యుమెంట్లను సీజ్ చేయగా.. వీటి బహిరంగ మార్కెట్ విలువ రూ. 500 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. లంచం అడిగే అధికారుల సమాచారాన్ని 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.తెలంగాణలో అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులను ఇబ్బంది పెడుతూ లంచాలకు అలవాటు పడిన అధికారుల భరతం పట్టడంలో అధికారులు ఈ ఏడాది సరికొత్త రికార్డులను సృష్టించారు. 2025 సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు తెలంగాణ వ్యాప్తంగా ఏసీబీ అధికారులు 220 కంటే ఎక్కువ కేసులు నమోదు చేశారు. ఇది గత ఏడాదితో పోలిస్తే భారీ పెరుగుదల.ఈ కేసులలో భాగంగా దాదాపు 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. పట్టుబడిన కేసులలో అధిక శాతం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినవే. 2024లో మొత్తం 152 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఇప్పటికే 220 దాటిపోయింది. అంటే దాదాపు 100 కేసులు అదనంగా నమోదయ్యాయి.ఈ ఏడాది దాడులలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు అక్రమ సంపాదనలో రికార్డులు సృష్టించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ విభాగాల్లో అత్యధికంగా లంచం కేసులు వెలుగుచూశాయి. భూముల వ్యవహారాలు, ప్రాజెక్టుల బిల్లుల క్లియరెన్స్ కోసం సామాన్యులను వేధించిన అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఒకే అధికారి వద్ద వందల కోట్ల అక్రమాస్తులు బయటపడటం అధికారులనే విస్మయానికి గురిచేసింది. కేవలం లంచం మాత్రమే కాకుండా.. అక్రమంగా కోట్లు కూడబెట్టిన 17 మంది పైగా ఉన్నతాధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదయ్యాయి. వీరి నుండి కేజీల కొద్దీ బంగారం, భారీగా నగదు, స్థిర ఆస్తులను ఏసీబీ సీజ్ చేసింది.అవినీతి రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫిర్యాదులను స్వీకరించడానికి వాట్సాప్,టోల్ ఫ్రీ నంబర్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల బాధితులు భయం లేకుండా ముందుకు వస్తున్నారు. లంచగొండి అధికారులను అరెస్ట్ చేయడమే కాకుండా.. వారిని సర్వీసు నుండి తొలగించేలా.. వారి ఆస్తులను జప్తు చేసేలా చట్టపరమైన చర్యలను వేగవంతం చేశారు.ఏదైనా ప్రభుత్వ పని కోసం అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. లంచం ఇవ్వడం కూడా నేరమేనని.. అందుకే వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. ఏసీబీ చేపట్టిన ఈ మెరుపు దాడులతో ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

# మేకపాటి స్థానంలో కొత్త నేత

**నెల్లూరు, డిసెంబర్ 26, పెన్ పవర్:** జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది.కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది.గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

# పరకామణి, కల్తీ నెయ్యి, పట్టు శాలువాలు, గోవిందరాజు స్వామి టెంపుల్.. ఈ ఏడాదంతా తిరుపతి చుట్టే ఇలా..!



**తిరుమల, డిసెంబర్ 26, పెన్ పవర్:** ఏడుకొండల వాడు, వడ్డీకాసుల వాడు..కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో..నిత్యం ఏదో ఒక ఇష్యూ సంచలనం సృష్టిస్తూనే ఉంది. ఇప్పటికే కల్తీ నెయ్యి, పరకామణి చోరీ ఎపిసోడ్ కొండంత వివాదంగా ఉండగా..ఈ మధ్యే పట్టు శాలువాల స్కామ్ అంటూ దుమారం లేచింది. ఈ ఇష్యూ అలా చల్లారిందో లేదో..ఇప్పుడు ఇంకో వివాదం వెలుగులోకి వచ్చింది. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది.గోవిందరాజస్వామి ఆలయంలో 50 కిలోల బంగారం మాయం చేశారన్న ప్రచారం సెన్సేషనల్ అవుతోంది. విమాన గోపురం బంగారం తాపడం పనులకు గత ప్రభుత్వం 100 కిలోల బంగారం కేటాయించగా..అందులో 50 కేజీల గోల్డ్‌ను మాయం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. 9 లేయర్లతో బంగారం తాపడం వేయాల్సి ఉండగా 2 లేయర్లే వేశారన్న టాక్ వినిపిస్తోంది. బంగారం తాపడం పనులు అసలు కాంట్రాక్టర్ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్వహించారన్న చర్చ జరుగుతోంది. ఆలయ గోపురంపై అప్పట్లో 30పైగా విగ్రహాలు ధ్వంసం చేసి బంగారం తాపడం పనులు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవకతవకలపై చాలా సీక్రెట్‌గా విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది.లేటెస్ట్ వ్యవహారంపై మరోసారి తిరుమల శ్రీవారి సెంట్రిక్‌గా తీవ్ర దుమారం నడుస్తోంది. గోవిందరాజస్వామి ఆలయ గోపుర తాపడం కోసం కేటాయించిన బంగారంలో గోల్‌మాల్ జరిగిందన్న ప్రచారం పొలిటికల్ కాంట్రవర్సీ అవుతోంది. ఇప్పటికే కల్తీ నెయ్యి ఎపిసోడ్ నేషనల్ టాపిక్ అయింది. దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి..హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసింది. ఆ తర్వాత పాత ఇష్యూ పరకామణి చోరీ కేసు కలకలం సృష్టించింది. ఫిర్యాదుదారుడు, సాక్షిగా ఉన్న ఆఫీసర్ అనుమానాస్పద మృతి చెందడంతో కూటమి వర్సెస్ వైసీపీ డైలాగ్ వార్‌కు దారితీసింది.ఇక శ్రీవారి పట్టువస్త్రాల స్కామ్ కూడా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయ తాపడం వ్యవహారంతో మరోసారి తిరుమల చుట్టే చర్చ జరుగుతోంది. ఏడాది కాలంలోనే నాలుగు అంశాలు శ్రీవారి భక్తుల మనసును గాయపరిచాయి. కల్తీ నెయ్యి, పరకామణి కేసులో వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ ఈవోలు అలిగేషన్స్ ఫేస్ చేస్తున్నారు. పట్టు శాలువాల వ్యవహారంలో విజిలెన్స్ దర్యాప్తు ఉత్కంఠ రేపుతోంది. గోవిందరాజ స్వామి ఆలయ గోపురం తాపడం తయారీలో..50 కిలోల బంగారం చోరీ అయినట్లు ప్రచారం జరుగుతుండటం సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వంలో తిరుమలలో జరిగిన అక్రమాలన్నీ ఒక్కొక్కటి బయటికి తీస్తున్నామని కూటమి పెద్దలు చెప్తుంటే..ప్రతీదానికి వైసీపీకి లింకు పెట్టే కుట్ర చేస్తున్నారని ఫ్యాన్ పార్టీ లీడర్లు రివర్స్ అటాక్ చేస్తున్నారు. తమను హిందూ వ్యతిరేకులుగా చూపించి..లబ్ధి పొందే ప్రయత్నమే తప్ప..అసలు వాస్తవాలేంటో తేల్చడంలో ప్రభుత్వం ఫెయిల్ అయిందంటున్నారు వైసీపీ నేతలు. రూమర్స్, గాలి ప్రచారమే తప్ప..ఎక్కడా తప్పు జరిగినట్లు ప్రూవ్ చేయలేదని..ఏడాది కాలంలో కూటమి సర్కార్ గోబెల్స్ ప్రచారంతో నెట్టుకొస్తుందని ఫ్యాన్ పార్టీ లీడర్లు విమర్శిస్తున్నారు.ఇలా కల్తీ నెయ్యి, పరకామణి చోరీ కేసు, పట్టు శాలువాల స్కామ్..ఇప్పుడు గోవిందరాజస్వామి బంగారం ఇష్యూపై..పొలిటికల్ వార్ నడుస్తుంది. మరోవైపు శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది. వరల్డ్ వైడ్‌గా ఎంతో పేరు ప్రతిష్టలు.. అన్నింటికి మించి కోట్లాది మంది భక్తుల విశ్వాసంగా ఉన్న శ్రీవారి సన్నిధిలో వరుస సంఘటనలు కలకలం రేపుతున్నాయి. గోవిందరాజస్వామి ఆలయ గోపురం బంగారం వ్యవహారం..ఎటు టర్న్ తీసుకుంటుందో..ఎవరి మెడకు ఉచ్చు బిగుసుకుంటుందో వేచి చూడాలి.

# రచ్చకెక్కుతున్న టిక్కెట్ రేసు




**విజయవాడ, డిసెంబర్ 26, పెన్ పవర్:** ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైముంది. కానీ ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ రేసు రచ్చకెక్కుతోంది. మరీ ముఖ్యంగా టీడీపీలో టికెట్ ఫైట్ మామూలుగా లేదు. గత ఎన్నికల్లోనే దాదాపు 50 మంది నేతలు టికెట్ త్యాగం చేయాల్సి వచ్చింది. ఇందులో 20 మంది వరకు సీనియర్ లీడర్లు పార్టీ గెలుపు కోసం..పొత్తుల్లో సీటును వదులుకోవాల్సి వచ్చింది.మరికొన్ని చోట్ల యువనేతలకు నామినేటెడ్ పోస్టుల హామీ ఇచ్చి టికెట్ రేస్ నుంచి తప్పించారు. ఇంకొందరు వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరుగుతుందని..అప్పుడు కచ్చితంగా టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. కట్ చేస్తే అసెంబ్లీ సీట్ల పెంపుపైన స్పష్టత వచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీలో 50, తెలంగాణలో 34 అసెంబ్లీ సీట్లు పెరగాల్సి ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెరగాలి. కానీ 2029 ఎన్నికల్లోపే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన పూర్తి కాదని కేంద్రం క్లారిటీ ఇచ్చింది.అయితే 2026లో జనగణన చేపడుతుంటంతో ఇప్పుడు అసెంబ్లీ స్థానాల పెంపు చేయకుండా..సెన్సెస్ పూర్తయిన తర్వాత డీలిమిటేషన్ చేయాలని డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే అసెంబ్లీ, లోక్సభ ఎన్నికలు పాత నియోజకవర్గాలతోనే జరగనున్నాయి. 2029 ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఆశపడ్డ పార్టీలకు, రాజకీయ నేతలకు బిగ్ షాక్ ఇచ్చినట్లు అయింది. 2024లో కూటమిలో భాగస్వామి అయిన టీడీపీ తమ నేతలకు సీట్లు సర్దుబాటు చేసేందుకు నానా అవస్థలు పడింది.గత ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు చేసేందుకు చివరి క్షణం వరకు బుజ్జగింపులు, సామాజిక సమీకరణాలు, పార్టీలో సీనియర్లకు హామీలు చాలా ప్రాసెస్ నడిచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యత్వాలు, నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల పంపకం కూడా టీడీపీ హైకమాండ్‌కు ఇబ్బందికరంగా మారింది.టీడీపీకి పట్టు ఉండి..లీడర్ స్ట్రాంగ్‌గా ఉన్న చోటే జనసేన, బీజేపీ టికెట్ కోసం పట్టుబట్టడంతో..చాలా మంది తెలుగు తమ్ముళ్లు సీటు త్యాగం చేశాయి. అధికారంలోకి వస్తే ఏదో పదవి దక్కుతుందని ఆశపడి..ఇప్పటికి ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోపు అసెంబ్లీ సీట్ల పెంపు అయ్యే పని కాదన్న క్లారిటీ వచ్చింది.టీడీపీ హైకమాండ్‌కు ఇప్పటినుంచే గుబులు మొదలైందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికలప్పుడే.. గెలుస్తున్నాం.. అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా మిమ్మల్ని స్యాటిస్ఫై చేస్తామని కింద మీద పడి హామీ ఒప్పించి టికెట్ త్యాగానికి ఒప్పించారు. ఈ సారి టికెట్ల కేటాయింపు ఎలా.? అసలే ఐదేళ్లు పవర్‌లో ఉంటాం. పైగా అసంతృప్తులు, లీడర్ల వర్గపోరు ఉండనే ఉంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపునకు ఇవన్నీ అడ్డంకిగా మారనున్నాయి. ఏం చేసేదని ఇప్పటినుంచే ఆలోచనలో పడిందట టీడీపీ అధిష్టానం.చాలాచోట్ల కూటమిలో వర్గపోరు నడుస్తోంది. స్టార్టింగ్లో కాస్త రచ్చకెక్కిన లీడర్లు..అధినేతల ఆదేశాలతో.. సర్దుకోకపోయినా.. గొడవ అయితే పడట్లేదు. కలిసి పనిచేయడం కూడా అంతంత మాత్రమే. ఇలాంటి పరిస్థితులున్న వేళ..అసెంబ్లీ ఎన్నికల టికెట్ రేసు..ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో కాక రేపుతోంది. అక్కడక్కడ తెలుగు తమ్ముళ్లే తగువ పడుతుంటే..మరికొన్ని చోట్ల, జనసేన, బీజేపీ నేతలతో టీడీపీ నేతలకు టికెట్ ఫైట్ నడుస్తోంది. ఎన్నికల టైమ్ వచ్చే సరికి టికెట్ రేసు, ఆశావహుల ప్రయత్నాలు జోరందుకోవడం ఖాయం. ఇప్పటినుంచే ప్రత్యామ్నాయం ఆలోచించడం..సాధ్యమైనంత వరకు లీడర్లకు టికెట్‌పై క్లారిటీ ఇవ్వడం వంటివి టీడీపీ అధిష్టానం మదిలో ఉన్న అస్త్రాలుగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంతో పాటు..కొందరిని పార్టీ పొలిట్ బ్యూరోలోకి.. మరికొందరిని జిల్లా పార్టీ అధ్యక్ష పగ్గాలు..ఇంకొందర్ని ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులుగా పంపించాలనేది బాబు ఆలోచనగా చెబుతున్నారు. సీట్ల సర్దుబాటు విషయంలో వచ్చే సవాళ్లను టీడీపీ అధిష్టానం ఇంకా ఎలా ఫేస్ చేయబోతోందో వేచి చూడాలి మరి.

# ఫస్ట్ నుంచి ఇంటింటి సర్వే

**ఒంగోలు, డిసెంబర్ 26, పెన్ పవర్:** ఏపీలోని కూటమి ప్రభుత్వం పేద వర్గాల ప్రజలు, మహిళల ఆర్థిక అభివృద్ధికోసం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటుంది. అయితే, తాజాగా.. ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలను ప్రభుత్వ రికార్డులలో ఖచ్చితంగా నమోదు చేసేందుకు ఈ సర్వే నిర్వహించనున్నారు. ఏకీకృత కుటుంబ సర్వే –%ఖఖీూ% ప్రారంభిస్తున్నట్లు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభమవుతుందని ప్రభుత్వం వెల్లడించిందిపట్టణాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని రికార్డులను సిబ్బంది నవీకరించనున్నారు. అర్హత కలిగిన కుటుంబం, వ్యక్తి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడమే లక్ష్యంగా ఈ సర్వేను ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా నిజమైన అర్హులను ప్రభుత్వం గుర్తించనుంది.ప్రభుత్వ సమాచారం కచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహించనుంది. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి వద్దకు వెళ్లి సిబ్బంది పొందుపర్చనున్నారు. ప్రభుత్వం ఖచ్చితంగా డేటా రూపొందించడం సహా పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది.ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రభుత్వ సిబ్బంది సర్వేను చేపట్టనున్నారు. తద్వారా సమాచారం ఖచ్చితంగా నమోదు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా సాగేందుకు సర్వే ఉపయోగపడుతుందని ప్రభుత్వం తెలిపింది. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను అందించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## బెజవాడలో 51 పంచాయితీల విలీనం

**విజయవాడ, డిసెంబర్ 26, పెన్ పవర్:** అమరావతి రాజధాని నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రాజధాని లో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. మరోవైపు విజయవాడ, గుంటూరు నగరాలతో అమరావతిని కలుపుతూ అభివృద్ధి చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వేరే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. అమరావతికి ఇంకా నగర రూపురేఖలు ఏర్పడకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచిస్తోంది. పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఐటీ కంపెనీలను తీసుకురావాలన్న ఆలోచనతో ఉంది. అందుకే ఇప్పుడు విజయవాడ ను గుర్తించి గ్రేటర్ గా మార్చాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 75 గ్రామపంచాయతీలను విజయవాడ నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన త్వరలో అమలు చేయనున్నట్లు సమాచారం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రేటర్ సివిక్ బాడీగా అప్గ్రేడ్ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తో పాటు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సీఎం చంద్రబాబు నాయుడు ను కలిసి మహా విజయవాడ ప్రతిపాదనలను అందించారు. దీంతో విజయవాడ మహానగరం ఆవిర్భావానికి అడుగులు పడినట్లు అయింది. 2017లో నగరపాలక మండలి 51 పంచాయితీల విలీనం ప్రతిపాదన చేయగా.. ఇప్పుడు ఆ జాబితాలో మరో 24 పంచాయితీలను చేర్చారు. దీంతో విజయవాడ ప్రస్తుత జనాభా 23.5 లక్షల నుంచి రెట్టింపు కానుంది. నగర పరిమాణం ఐదు రెట్లు పెరగనుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదిస్తే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రస్తుతం ఉన్న 61.8 చదరపు కిలోమీటర్ల నుంచి.. 500 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది.ఈ విలీన ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం ఆమోదిస్తే.. విశాఖపట్నందాటి రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గా విజయవాడ అవతరించనుంది. అయితే ఈ విలీన ప్రతిపాదనను చాలామంది వ్యతిరేకిస్తున్నారు. విలీనం కాకుండా వికేంద్రీకరణ కావాలని కోరుతున్నారు. ఈ ప్రతిపాదనపై పౌర సంఘాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ ఆంధ్రప్రదేశ్ లో రెండో అతిపెద్ద నగరంగా ఉంది. గ్రేటర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా కొన్ని వర్గాలు వ్యతిరేకించడం జరుగుతోంది. గతంలో హైదరాబాద్ విషయంలో కూడా ఇలానే జరిగింది. ప్రభుత్వం మాత్రం స్ట్రాంగ్ గా నిర్ణయించుకుంటే మాత్రం విజయవాడ గ్రేటర్ గా మారడం ఖాయం.తాజాగా విజయవాడను గ్రేటర్ సిటీగామార్చాలన్న ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో.. అమరావతిలో కలపాలన్న డిమాండ్ తెరమరుగు అయినట్టే. అయితే ఇప్పుడు రాష్ట్రానికి రాజధానికి దగ్గరగా ఒక నగరం అవసరం. ఐటీ పరిశ్రమలన్నీ విశాఖకు వెళ్ళిపోతున్నాయి. రాయలసీమలో తయారీ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. ఈ క్రమంలో అమరావతి రాజధాని లో ఎటువంటి పెట్టుబడులు లేవన్న విమర్శలు వస్తున్నాయి. అందుకే గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనను ఆమోదించి.. మహానగరంలో పెట్టుబడులు ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# తమ్మినేనికి చెక్...



**శ్రీకాకుళం, డిసెంబర్ 26, పెన్ పవర్:** :వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కట్టు దాటుతోంది. నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు విషయంలో నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రకంపనలు రేపుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో తాజాగా సీనియర్ నేత ధర్మాన కృష్ణ దాస్ చేసిన ప్రకటన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లో పెట్టినట్టు ఉంది. సీనియర్ నేతగా ఉన్న ధర్మాన కృష్ణ దాస్.. ఆ జిల్లా పార్టీ అధ్యక్షుడు కూడా. అయితే వచ్చే ఎన్నికల్లో తమ్మినేని పోటీ విషయంలో ఆయన చేసిన ప్రకటన మాత్రం పొలిటికల్ వర్గాల్లో హీట్ రేపుతోంది. వచ్చే ఎన్నికల్లో తమ్మినేని సీతారామును తప్పించి మరొకరిని పోటీ చేయిస్తామన్న ధర్మాన కృష్ణ దాస్ ప్రకటనపై దువ్వాడ శ్రీనివాస్ విభిన్న ప్రకటనలు చేస్తున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తున్నారు.కొద్దిరోజుల కిందట దువ్వాడ శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసింది హై కమాండ్. వ్యక్తిగత కుటుంబ వివాదాలతో ఆయనపై వేటు వేయాల్సి వచ్చింది. అయితే దీని వెనుక ధర్మాన బ్రదర్స్ కుట్ర ఉంది అన్నది దువ్వాడ చేస్తున్న ఆరోపణ. కింజరాపు కుటుంబంతో కలిపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపణ చేస్తున్నారు. తన ఓటమి వెనుక ధర్మాన కుటుంబ హస్తం ఉందని కూడా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పరిస్థితుల్లో ధర్మాన బ్రదర్స్ పై పెద్ద యుద్ధమే ప్రకటించారు దువ్వాడ. దానికి కాళింగ సామాజిక వర్గం ను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం మొదలుపెట్టారు. ఆ సామాజిక వర్గం ద్వారానే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇవ్వడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు.అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉండేవారు. ఆయనను తప్పించి యువకుడైన చింతాడ రవికుమార్ కు ఆ బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. అప్పటినుంచి తమ్మినేని సీతారాం కూడా మనస్థాపంతో ఉంటూ వస్తున్నారు. ఆయన సైతం కాళింగ సామాజిక వర్గానికి చెందిన నేత. ఇటువంటి పరిస్థితుల్లో టెక్కలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశానికి జిల్లా అధ్యక్షుడి హోదాలో హాజరయ్యారు కృష్ణదాస్. ఈ క్రమంలో వచ్చే పార్లమెంటరీ ఎన్నికల్లో రామ్మోహన్ నాయుడుకు ధీటుగా సరైన అభ్యర్థిని రంగంలోకి దించుతామని చెప్పుకొచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఎంపీగా తమ్మినేని పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనకు పెద్దల సభకు కానీ ఎమ్మెల్సీ పదవి గానీ ఇస్తామని కృష్ణ దాస్ చెప్పడం దువ్వాడ శ్రీనివాస్ ఆయుధంగా మలుచుకున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తరుపైకి తెస్తూ.. కింజరాపు, ధర్మాన బ్రదర్స్ ను కేడి బ్రదర్స్ తో పోల్చారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నేరుగా హెచ్చరించలేదు. కానీ ధర్మాన బ్రదర్స్ కు హెచ్చరించడం ద్వారా హై కమాండ్ కు పరోక్ష సంకేతాలు పంపగలిగారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి పదేండ్లు జైలు శిక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు పది సంవత్సరాల జైలు శిక్ష విధించాలని ఆ దేశ ప్రత్యేక ప్రాసిక్యూటర్ కోర్టును అభ్యర్థించినట్లు స్థానిక మీడియా శుక్రవారం తెలిపింది. మార్షల్ లా విధించేందుకు యత్నించడం, అనంతరం ఆయనను అరెస్ట్ చేయడానికి జరిగిన ప్రయత్నాలను అడ్డుకోవడం వంటి ఆరోపణలపై ఈ శిక్ష విధించాలని కోరారు. యూన్ ఎదుర్కొంటున్న పలు ఆరోపణలపై ప్రత్యేక ప్రాసిక్యూటర్ కోరిన మొదటి జైలు శిక్ష ఇది. జనవరి 3న కొద్ది గంటల పాటు దేశంలో సైనిక పాలన విధించి దేశంలో రాజకీయ సంక్షోభానికి కారణమయ్యారు. ఆయనను అభిశంసిస్తూ ప్రతిపక్షం నేతృత్వంలోని నేషనల్ అసెంబ్లీ ఓటు వేయడంతో అధికారం నుండి బహిష్కరణకు గురయ్యారు. అనంతరం ఆయనను అరెస్ట్ చేసేందుకు యత్నిస్తున్న దర్యాప్తు అధికారులను తన భవనంలోకి రాకుండా బారికేడ్లతో అడ్డుకున్న సంగతి తెలిసిందే.

## హెచ్-1బీ వీసాల జారీలో మార్పులు



**హైదరాబాద్ పెన్ పవర్:** హెచ్-1బీ వీసా కార్యక్రమంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రధానమైన మార్పులు చేసింది. రాండమ్ లాటరీ పద్ధతికి స్వస్తి చెప్పి నూతన ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియలో అధిక నైపుణ్యం కలిగిన, ఎక్కువ వేతనం పొందుతున్న ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తారు. కొత్త నిబంధనలు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 27న అమలులోకి వస్తాయి. ఇవి 2027 ఆర్థిక సంవత్సరపు హెచ్-1బీ వీసా పరిమితి రిజిస్ట్రేషన్ సీజన్‌కు వర్తిస్తాయి. అమెరికా ఉద్యోగుల వేతనాలు, పని పరిస్థితులు, ఉద్యోగ అవకాశాలను పరిరక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ తెలిపింది. ఈ నిర్ణయంతో భారతీయ నిపుణులపై ప్రభావం పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అమెరికాలో హెచ్-1బీ వీసాలు కలిగిన వారిలో భారతీయుల సంఖ్య అధికంగా ఉన్నదన్న విషయం తెలిసిందే. అధిక నైపుణ్యం కలిగిన, ఎక్కువ వేతనాలు పొందుతున్న వారికి ప్రాధాన్యత ఇవ్వడానికి హెచ్-1బీ వీసా ఎంపిక ప్రక్రియకు సంబంధించిన నిబంధనలను సవరించడం జరిగిందని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ వివరించింది. ప్రస్తుతం అమలులో ఉన్న లాటరీ పద్ధతిని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను తీసుకుంటున్నాయని తెలిపింది. ప్రస్తుతం అమలులో ఉన్న రాండమ్ లాటరీ విధానం స్థానంలో ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామని, నైపుణ్యం, వేతనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పింది. హెచ్-1బీ కార్యక్రమం యొక్క అసలైన ఉద్దేశాన్ని ఇది ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఇప్పుడు అమలులో ఉన్న హెచ్-1బీ రిజిస్ట్రేషన్ రాండమ్ ఎంపిక ప్రక్రియను అమెరికా కంపెనీలు, సంస్థలు దుర్వినియోగం చేస్తూ స్వదేశానికి చెందిన ఉద్యోగులతో పోలిస్తే తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుం టున్నాయని యూఎస్ సిటిజన్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రతినిధి మాథ్యూ ట్రజెస్సర్ తెలిపారు. కాగా హెచ్-1బీ వీసాలపై ప్రస్తుతం అమలులో ఉన్న వార్షిక పరిమితి (65,000)లో ఎలాంటి మార్పు ఉండదు. అమెరికా సంస్థల నుంచి అదనపు డిగ్రీలు పొందిన దరఖాస్తుదారులకు మరో 20,000 వీసాలు ఇస్తున్నారు.

## ఇజ్రాయిల్ చర్య చట్టవిరుద్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ సెటిల్మెంట్లను విస్తరించేందుకు ఇజ్రాయిల్ పన్నుతున్న ఎత్తుగడలను 14 దేశాలు తీవ్రంగా ఖండించాయి. పాలస్తీనియన్లకు మద్దతును పునరుద్ఘాటించాయి. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో కొత్తగా 19 సెటిల్మెంట్లను చేర్చేందుకు ఇజ్రాయిల్ ఆమోదం తెలిపింది. ఈ చర్యను బ్రిటన్, కెనడా, డెన్మార్క్ సహా పలు దేశాలు తప్పుపట్టాయి. ఇజ్రాయిల్ చర్య చట్టవిరుద్ధమని, గాజా కాల్పుల విరమణకు, ఆ ప్రాంతంలో దీర్ఘకాలిక శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని మండిపడ్డాయి. ఇజ్రాయిల్ చర్యలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని, గాజా ఒప్పందానికి తూట్లు పొడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ఇజ్రాయిల్ భద్రతా క్యాబినెట్ నిర్ణయాన్ని బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, ఐస్‌లాండ్, ఐర్లాండ్, జపాన్, మాల్టా, నెదర్లాండ్స్, నార్వే, స్పెయిన్, బ్రిటన్ దేశాలు ఖండిస్తున్నాయి' అని ఆయా దేశాలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సెటిల్మెంట్ విధానాల విస్తరణ కోసం అవలంబించే ఏ ప్రణాళికనైనా తాము వ్యతిరేకిస్తామని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. నిర్ణయాన్ని ఉపసంహ రించుకోవాలని, సెటిల్మెంట్ల విస్తరణకు పాల్పడవద్దని ఇజ్రాయిల్‌ను కోరారు. పాలస్తీనియన్ల స్వీయ నిర్ణయాధికార హక్కుకు మద్దతు ఇస్తామని అంటూ రెండు దేశాల పరిష్కారం ఆధారంగా సమగ్రమైన, న్యాయసమ్మతమైన, దీర్ఘకాలిక శాంతి స్థాపనకు కట్టుబడి ఉంటామని తెలిపారు. కాగా 14 దేశాల సంయుక్త ప్రకటనపై ఇజ్రాయిల్ విమర్శలు కురిపించింది. ఇజ్రాయిల్‌లో నివసించేందుకు యూదులకు ఉన్న హక్కును విదేశాలు నియంత్రించలేవని తెలిపింది.

## అమెరికా బెదిరింపుల పర్వాన్ని ఆపాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులాలో ఉద్రిక్తతలను తగ్గించాలని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సభ్య దేశాలు కోరాయి. వెనిజులాలో నెలకొన్న పరిస్థితులపై భద్రతా మండలి మంగళవారం అత్యవసర సమావేశం జరిపింది. ఆ దేశంలో ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టకుండా నివారించేందుకు సంయమనం పాటించాలని, ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని గౌరవించాలని మెజారిటీ భద్రతా మండలి సభ్య దేశాలు కోరాయి. అమెరికా ఆకాంక్ష వెనిజులాతో ఆగదని ఐక్యరాజ్య సమితితో వెనిజులా శాశ్వత ప్రతినిధి శామ్యూల్ మోంకాడా అకోస్టా వ్యాఖ్యానించారు. ఈ ఆకాంక్ష ఖండాంతర స్థాయిదని అన్నారు. ఈ ఖండ భవిష్యత్ తమదేనని అమెరికా ప్రభుత్వం తన జాతీయ భద్రతా వ్యూహంలో పేర్కొందని అన్నారు. వెనిజులా అభ్యర్థన మేరకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్య సమితి నిర్మాణంలో, నిబంధనావళి రూపకల్పనలో అవిభాజ్యమైన దేశంగా వున్న అమెరికా, ఈ రోజు పశ్చిమార్ధ అర్ధగోళంలో అన్ని దేశాల ప్రాథమిక హక్కులపై తనదైన ముద్ర వేయాలని భావిస్తోందని అన్నారు. తద్వారా అంతర్జాతీయ చట్టాలకు, శాంతి, భద్రతలకు ముప్పుగా మారిందని వ్యాఖ్యానించారు. వెనిజులా చమురు ట్యాంకర్లను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడాన్ని, మొత్తంగా వెనిజులాపై నౌకాదళ ఆంక్షలు విధించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా అన్నారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ చట్టాలకు సంబంధించిన అన్ని నిబంధనలను, ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నాయన్నారు. చైనా డిప్యూటీ శాశ్వత ప్రతినిధి సన్ లెయి మాట్లాడుతూ, వెనిజులాపై సాగిస్తున్న బెదిరింపుల పర్వాన్ని తక్షణమే ఆపాలని అమెరికాను డిమాండ్ చేశారు. అమెరికా చర్యలు, వైఖరి వల్లనే ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయన్నారు. ఏకపక్ష చర్యలను, బెదిరింపులను చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అన్ని దేశాలు వారి సార్వభౌమాధికారాన్ని, జాతీయ సమగ్రతను పరిరక్షించుకోవడానికి మద్దతునిస్తుందని స్పష్టం చేశారు.

# టీకాల అవిష్కరణకు ఆద్యుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంత్రాక్స్, రబీస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మజీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్. 19 వ శతాబ్దంలో గాలి సోకడం వల్ల అంటువ్యాధులు వస్తాయని నమ్మేవారు. గాలిలో రోగకారక క్రిములని మోసుకొచ్చే వస్తువుల వల్ల అంటు వ్యాధులు కలుగు తాయని అప్పుడు ఎవరికీ తెలీదు. సొంత కుంటుంబంలో జరిగిన విషాద సంఘటనలు, పాశ్చర్ తన పరిశోధనలను కలరా, మశూచి వ్యాధులకు మూలమైన వ్యాధి కారకాలను కనుగొనే దిశలో కొనసాగేట్లు చేశాయి. నేడు మనం చిన్న పిల్లలకు కలరా, మశూచి, పోలియో రాకుండా ముందుగానే వేయిస్తున్న 'టీకాలు' ఆ మహానుభావుని ఆలోచనే. వ్యాధి వచ్చినప్పటి కంటే రాకుండా తీసుకోనే జాగ్రత్తలే మేలని ముందుగా "వ్యాక్సి నేషన్" ద్వారా వ్యాధులను రాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించాడు. అంతేకాదు వ్యాధి సోకినా దానిని నియంత్రించి, రూపుమాపే మందులను కూడా కనుగొనేందుకు మార్గం చూపించాడు. పాశ్చర్ తన ప్రయోగాలను ఉపయోగించి సూక్ష్మజీవులు వాస్తవానికి ఇతర సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి అవుతాయని, ఊరికే గాలిలోంచి ఊడిపడవని నిరూపించారు. నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పిన, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే మూలాధారం. లూయీ పాశ్చర్ (డిసెంబరు 27, 1822 – సెప్టెంబరు 28, 1895) ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు పాశ్చర్ బాటలు వేశారు. టీకాల ఆవిష్కారానికి ఇతడు ఆద్యుడు. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారుచేశాడు. రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్తో పాటు జీవశాస్త్ర వ్యవస్థాపక త్రయంలో ఒకరు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశ పెట్టిన వ్యక్తిగా సుపరిచితుడు. ఈ పద్ధతిని నేడు "పాశ్చరైజేషన్" అంటారు. కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. పాశ్చర్ కొన్ని అద్భుత ప్రయోగాలు చేసి సూక్ష్మ జీవులు ఒకదాన్నుండి ఒకటి పుడతాయని, గాల్లోంచి ఊడి పడవని నిరూపించాడు. ఆయన ప్రతిపాదించిన రోగకారక క్రిమి సిద్ధాంతం వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావనగా చెప్పుకోవచ్చు. అంతేకాక ఆయన వ్యాధి యొక్క వ్యాప్తిని అరికట్టేందుకు ఆస్పత్రులలో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రతా పరమైన పద్ధతులు ప్రవేశ పెట్టాడు. పాశ్చర్ అత్యంత సునిశితమైన, క్రమబద్ధమైన ప్రయోగాలు చేసి ఎన్నో ప్రమాద కరమైన సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఆ సూక్ష్మజీవులని అరికట్టే వాక్సీన్ లు రూపొందించి మనుషులనే కాక, జంతువులను కూడా ఎన్నో భయంకరమైన వ్యాధుల నుంచి కాపాడారు. పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుండా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలను కొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్ లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూతురు మేరీ లారెంట్ ను పెళ్ళిచేసుకోగా, అయిదుగురు పిల్లలు పుట్టినా, టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకరు, ముగ్గురు మరణించారు. పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి "స్టీరియో కెమిస్ట్రీ" అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్ ) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రాక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు. రేబీస్ అనేది వైరస్ ల వల్ల కలిగే ఓ భయంకరమైన వ్యాధి. అది కుక్కల నుండి మనుషులకి సోకుతుంది. ఈ వైరస్ బాక్టీరియాల కన్నా అతి చిన్నదైన వస్తువు. కనుక పాశ్చర్ వాడిన సూక్ష్మదర్శినిలో ఇది కనిపించ లేదు. ఆ వైరస్ వ్యాధితో కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావితం చేస్తుంది. పాశ్చర్ ఆ వ్యాధి సోకిన జంతువుల వెన్నుపాము నుంచి ద్రవం సంగ్రహించి, వివిధ పద్ధతుల చేత ఆ ద్రవం యొక్క రోగ తీవ్రతని క్షీణపరిచి, ఆ ద్రవాన్ని తిరిగి కుక్కల

మీదకి ఎక్కించి రేబీస్ కి వాక్సీన్ ని రూపొందించారు. కోళ్లకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరచి ఇతర కోళ్ళకు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనిషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమిలో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించాడు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందాడు. రెండు సార్లు గుండె పోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమపదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్ధంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపు కుంటారు.

# జాతి గర్వించదగ్గ జర్నలిస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** ధూళిపూడి ఆంజనేయులు, సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత. పుట్టింది, పెరిగింది తెలుగు రాష్ట్రంలో అయినా, ఆంజనేయులు కేవలం ఇంగ్లీషులోనే రాసి గొప్ప జర్నలిస్టుగా ఖ్యాతి చెందారు. డి.ఎ.అని పాఠకులకు పరిచితులు. 1924 జనవరి 10న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఎలవర్రులో పుట్టి, ముందు నుండే జర్నలిస్టు జీవితాన్ని ఎంపిక చేసుకున్న ఆంజనేయులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా, సమాచార శాఖలో జర్నలిస్టుగా, ఆకాశ వాణిలో వాణి పత్రికా సంపాదకులుగా, హిందూ పత్రిక సంపాదక బృందం బాధ్యులుగా, పేరెన్నికగన్నారు. కోటం రాజు రామారావు నడిపిన "ఇండియన్ రిపబ్లిక్"లో తొలుత జర్నలిజానికి ఆయన శ్రీకారం చుట్టారు. మొదట ఇండియన్ ఎక్స్ ప్రెస్ సంపాదక వర్గంలో 1948లో చేరి 1953లో ది హిందూ పత్రికలో చేరి అనుభవం సంపాదించిన తర్వాత 1959 లో ఆకాశవాణి వారి వాణి పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరీత్యా ఆంజనేయులు ఢిల్లీ, హైదరాబాద్, మద్రాసులో ఉంటూ సమాచార శాఖలో జర్నలిస్టుగా వృత్తిధర్మం నిర్వర్తించారు. ఉద్యోగంలో వున్నా వివిధ పత్రికలకు రాస్తూ ఆంజనేయులు మంచి పేరు తెచ్చు కున్నారు. అంతకుమించి, ఎన్నో రచనలు ప్రచురించారు. ఆయన రాసిన పత్రికలు క్వెస్ట్, ఇండియన్ రివ్యూ,థాట్, ఇండియన్ లిటరేచర్, త్రివేణి, ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్, ఎకనామిక్ టైమ్స్, ఇండియన్ రైటింగ్ టుడే పేర్కొనదగినవి. తెలుగు పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునేవారు. స్వతంత్ర టైమ్స్, డక్కన్ హెరాల్డ్, న్యూస్‌టుడే, ఇండియన్ బుక్‌క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురించాయి. భవాన్స్ జర్నల్ లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష్ణన్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొదలైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు.?తెలుగు సాహిత్యాన్ని, రచయితల్ని తెలుగే తరులకు అందించడం ఆయన విశిష్టత. ఇందులో భాగంగా గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ రాయగా, కలకత్తా రైటర్స్ వర్క్ షాప్ వారు వెలువ రించారు. ఆయన ఏది రాసినా, చెప్పినా స్పష్టంగా, మృదువుగా, మర్యా దగా ఉండేది. సున్నిత హాస్యం, విమర్శ ఆయన రచనల్లో కనిపించేది. వృత్తి రీత్యానూ, వ్యక్తి దృష్ట్యా ఆంజనేయులుకు ఎందరో సన్నిహితులయ్యారు. వారిలో నార్ల వెంకటేశ్వరరావు, సంజీవదేవ్, బి.ఎస్.ఆర్.కృష్ణ, కె.శ్రీనివాస అయ్యంగార్, వామనరావు, పట్టాభిరాం, ఎ.ఆర్.బాజీ, భావరాజు నరసింహా రావు ప్రభృతులెందరో వున్నారు. నార్ల వెంకటేశ్వర రావు తన ఇంగ్లీషు రచనల్ని ముందుగా ఆంజనేయులు పరిశీలించిన తరువాత ప్రచురించేవారు. విశ్వనాథ సత్యనారాయణ, గోపీ చంద్, బైరాగి, పాలగుమ్మి పద్మరాజు, శ్రీశ్రీ, సి.నారాయణ రెడ్డి, దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైన వారిని తెలుగేతరులకు తన రచనల ద్వారా పరిచయం చేసిన గొప్పతనం ఆయనదే. పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునే వారు. స్వతంత్ర టైమ్స్, డక్కన్ హెరాల్డ్, న్యూస్ టుడే, ఇండియన్ బుక్ క్రానికల్

పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురిం చాయి. భవాన్స్ జర్నల్లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష్ణన్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొదలైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు. ద్వివేదుల విశాలాక్షి రచన "గ్రహణం విడిచింది" ఇంగ్లీషులోకి అనువదించారు. ఆంజనేయులు రచనలను... కట్టమంచి రామలింగారెడ్డి, సాహిత్య అకాడమీ, కందుకూరి వీరేశలింగం, కేంద్ర ప్రచురణ సంస్థ ప్రచురించాయి. ఆయన రష్యా, యూరప్ దేశాలు పర్యటన అనుభవాలను 'విండో టు ది వెస్ట్' అని పుస్తకంగా ప్రచురించారు. ఆంజనేయులు రిటైర్ అయిన తరువాత మద్రాసులో స్థిరపడి, హిందూ లో "బిట్వీన్ యు అండ్ మి" అనే శీర్షిక 10 సంవత్సరాలు (1981-91) నిర్వహించారు. మద్రాసు ప్రెస్ క్లబ్ లో 30 సంవత్సరాలు అధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య విమర్శ, సాంఘిక సంస్కరణలపై కూడా రచనలు చేశారు. ఆంజనేయులు సెక్యులర్ జీవితం గడిపారు. కుమార్తె వివాహం రిజిస్టర్ చేయించి, కన్యాదాన పద్ధతి నిరసించారు. సంగీతం, సంస్కృతం, సాహిత్యం అంటే ప్రత్యేకాభిమానం. స్వంత గ్రంథాలయం దేశంలో అతి పెద్దదైన వ్యక్తిగత గ్రంథాలయాలలో ఒకటి. తెలుగువారు గర్వించదగిన ఇంగ్లీషు జర్నలిస్టు తన 75వ ఏట 1998 సంవత్సరం డిసెంబరు 27 తేదీన చెన్నైలో తుదిశ్వాస వదిలారు.


# రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న భీకర యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కీలక వ్యాఖ్యలు చేశారు. సుదీర్ఘ కాలంగా సాగుతున్న ఈ పోరాటంతో ఉక్రెయిన్ తీవ్రంగా అలసిపోయిందని, శాంతి కోసం ప్రపంచమంతా ఎదురుచూస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "అందరిదీ ఒకే కోరిక.. అతను అంతమైపోవాలి" అంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మరణాన్ని ఉద్దేశించి జెలెన్‌స్కీ పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ముగియాలంటే ఆధిపత్య ధోరణి వీడాలని ఆయన స్పష్టం చేశారు. యుద్ధం ముగిసి శాంతి నెలకొనాలంటే రష్యా తన బలగాలను వెనక్కి తీసుకోవాలని జెలెన్‌స్కీ డిమాండ్ చేశారు. రష్యా గనుక వెనక్కి తగ్గినట్లయితే, తూర్పు ఉక్రెయిన్ ప్రాంతం నుంచి తమ సైన్యాన్ని కూడా వెనక్కి తీసుకుంటామని ఆయన ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. రష్యా దురాక్రమణను ఆపితేనే ఉక్రెయిన్ కూడా తన రక్షణ చర్యలను సమీక్షించుకుంటుందని ఆయన పేర్కొన్నారు. దాడులు ఆగిపోయి, సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు తగ్గడం ద్వారానే శాంతి చర్చలకు మార్గం సుగమం అవుతుందని జెలెన్‌స్కీ బలంగా విశ్వసిస్తున్నారు. వివాదాస్పదంగా ఉన్న తూర్పు ఉక్రెయిన్ ప్రాంతం భవిష్యత్తుపై జెలెన్‌స్కీ ఒక అంతర్జాతీయ పరిష్కారాన్ని సూచించారు. ఆ ప్రాంతం పూర్తిగా అంతర్జాతీయ దళాల పర్యవేక్షణలో ఉండాలని, అప్పుడే అక్కడ భద్రత మరియు పారదర్శకత సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ ఒక్క దేశం పక్షపాతంతో కాకుండా, తటస్థంగా ఉండే అంతర్జాతీయ బలగాలు అక్కడ శాంతిని కాపాడాలని కోరారు. తద్వారా స్థానిక ప్రజలు యుద్ధ భయం లేకుండా తమ సాధారణ జీవితాన్ని గడపడానికి అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

ఏదైనా శాంతి ఒప్పందం (పీస్ డీల్) కుదిరితే, దానిపై తుది నిర్ణయం తీసుకునే ముందు దేశ ప్రజల అభిప్రాయాన్ని తప్పకుండా సేకరిస్తామని జెలెన్‌స్కీ హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం అత్యవసరమని ఆయన భావిస్తున్నారు. ప్రజల అంగీకారం లేకుండా ఎలాంటి ఏకపక్ష ఒప్పందాలపై సంతకాలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. యుద్ధం వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చుతూ గౌరవప్రదమైన రీతిలో శాంతిని సాధించడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## కెనడాలోని టొరంటోలో కాల్పులు.. మరో భారతీయ విద్యార్థి హత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** కెనడాలోని టొరంటోలో భారతీయులపై వరుస ఘటనలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. భారతీయ యువతి హిమాన్షి ఖురానా హత్య ఘటన మరవకముందే టొరంటోలో మరో విషాదం నెలకొంది. 20 ఏండ్ల శివాంక్ అవస్థిని దుండగుడు కాల్చి చంపడం కలకలం రేపింది. శివాంక్ స్కార్‌బొరొగ్ యూనివర్సిటీలో లైఫ్ సైన్సెస్ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక హైల్యాండ్ క్రీక్ టెయిల్ వద్ద డిసెంబర్ 23వ తేదీన ఓ దుండగుడు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శివాంక్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కాల్పుల విషయం తెలుసుకుని తాము అక్కడికి వెళ్లేసరికి దుండగుడు పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. శివాంక్ హత్య నేపథ్యంలో యూనివర్సిటీ కాలేజీ క్యాంపస్‌ను కాసేపు మూసివేశారు. ఈ ఘటనతో ఈ ఏడాది కెనడాలో హత్యల సంఖ్య 41కి చేరినట్లు అధికారులు తెలిపారు. శివాంక్ హత్యపై కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. టొరంటో స్కార్‌బోరొగ్ క్యాంపస్ సమీపంలో జరిగిన కాల్పుల్లో భారత విద్యార్థి శివాంక్ మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొంది. ఈ కష్టకాలంలో మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చింది.

# 2025లో అత్యధికంగా అమ్ముడైన కారుగా మారుతీ డిజైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఆటోమొబైల్ మార్కెట్లో ఎస్‌యూవీల హవా కొనసాగుతున్నప్పటికీ, 2025లో అందరినీ ఆశ్చర్యపరుస్తూ మారుతీ సుజుకీ డిజైర్ సెడాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది అత్యధికంగా అమ్ముడైన కారుగా రికార్డు సృష్టించింది. ప్రముఖ ఎస్‌యూవీ మోడళ్లయిన హ్యుందాయ్ క్రెటా, టాటా నెక్సాన్‌లను వెనక్కి నెట్టి డిజైర్ టాప్ ప్లేస్‌కు చేరుకోవడం విశేషం. 2025లో ఇప్పటివరకు 1,95,416 యూనిట్ల డిజైర్ కార్లు అమ్ముడయ్యాయి. గత 41 ఏళ్లలో ఒక సెడాన్ మోడల్ అమ్మకాల్లో అగ్రస్థానంలో నిలవడం ఇది రెండోసారి మాత్రమే. దీని తర్వాత 1,87,968 యూనిట్ల అమ్మకాలతో హ్యుందాయ్ క్రెటా రెండో స్థానంలో, 1,81,186 యూనిట్లతో టాటా నెక్సాన్ మూడో స్థానంలో ఉన్నాయి. ప్రస్తుతం దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో ఎస్‌యూవీల వాటానే 55 శాతంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో టాప్-10 బెస్ట్ సెల్లింగ్ కార్ల జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక సెడాన్ మారుతీ డిజైర్ కావడం గమనార్హం. ఈ జాబితాలో 6 ఎస్‌యూవీలు, 2 హ్యాచ్‌బ్యాక్‌లు, ఒక ఎంపీవీ మోడల్ ఉన్నాయి. ఈ టాప్-10 జాబితాలో మారుతీ సుజుకీకి చెందిన 6 మోడళ్లు ఉండగా, టాటా మోటార్స్ నుంచి రెండు, మహీంద్రా, హ్యుందాయ్ నుంచి చెరొకటి ఉన్నాయి. జాబితాలో తర్వాతి స్థానాల్లో మారుతీ వ్యాగన్ ఆర్ (1,79,663), ఎర్టిగా (1,75,404), స్విఫ్ట్ (1,70,494), మహీంద్రా స్కార్పియో (1,61,103), మారుతీ ఫ్రాంక్స్ (1,59,188), బ్రెజ్జా (1,57,606), టాటా పంచ్ (1,57,522) ఉన్నాయి. ఇటీవల జీఎస్టీ తగ్గింపు, పండుగ సీజన్ ఆఫర్లు, ఇయర్ ఎండ్ డిస్కౌంట్ల కారణంగా కార్ల ధరలు తగ్గడం వంటి అంశాలు అమ్మకాలు పెరగడానికి దోహదపడ్డాయి.

# 'హెర్బల్ టీ' లేబుల్‌పై వ్యాపారులకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా హెర్బల్ టీ పేరుతో రకరకాల మొక్కలు, మూలికలతో చేసిన టీ పొడుల బ్రాండ్లు పెరిగాయి. కొన్ని పెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీలు సైతం రకరకాల మొక్కల మిశ్రమాలతో తయారైన టీ రకాలను విక్రయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి వాటిని హెర్బల్ టీ పేరుతో విక్రయించవద్దని ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎసేఐ) కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు మొక్కలు, మూలికలతో చేసిన టీగా పేర్కొనవద్దని స్పష్టం చేసింది. సాధారణంగా తేయాకు నుంచి సేకరించినవి కాకపోవడంతో వల్ల టీగా పరిగణించవద్దని, అలా చేస్తే చట్ట ప్రకారం తప్పుదోవ పట్టించినట్టు, నకిలీ ప్రచారం నిర్వహించినట్టుగా భావించాల్సి ఉంటుందని వెల్లడించింది. ఇటీవల హెర్బల్ టీ, ఫ్లవర్ టీ, రూయిబోస్ పేర్లతో అమ్మకాలు జరుగుతున్నాయి. ఇవి తేయాకు నుంచి సేకరించినవి కావని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. సాధారణంగా కాంగ్రి టీ, గ్రీన్ టీ, ఇన్‌స్టంట్ టీలను మాత్రమే టీగా వ్యవహరిచవచ్చు. మిగిలిన వాటిని టీగా వ్యవహరించలేమని తెలిపింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు, తయారీ కంపెనీలు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, మార్కెటింగ్, దిగుమతిదారులు, విక్రేతలందరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. దీనికి సంబంధించి ఆదేశాలు అమలయ్యేలా రాష్ట్రాల అధికారులు చర్యలు తీసుకోవాలని వెల్లడించింది.

# జీమెయిల్ అడ్రస్ మార్చుకునే సదుపాయం తీసుకురానున్న గూగుల్




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ త్వరలో సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం యూజర్లు వాడుతున్న మెయిడ్ ఐడీకి సంబంధించి మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలని భావిస్తోంది. ప్రస్తుతం యూజర్లు తమ ఈ-మెయిల్ అడ్రస్‌ను మార్చుకునే అవకాశం లేదు. అవసరం అనుకుంటే కొత్త అకౌంట్‌ను ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు గూగుల్ క్రమంగా ఇప్పటికే ఉన్న అకౌంట్లనే మార్పు చేసుకునే వీలు కల్పించనుంది. ఈ అప్‌డేట్‌తో యూజర్లు ప్రస్తుతం ఉపయోగిస్తున్న జీమెయిల్ అకౌంట్‌తోనే కొత్త మెయిల్ పేరుకు మారవచ్చు. అలా మార్పులు చేసిన తర్వాత, పాత జీమెయిల్ అకౌంట్ అడ్రస్‌కు మారుపేరుగా మాత్రమే ఉంటుంది. కాబట్టి, పాత, కొత్త మెయిల్ అడ్రస్‌లకు పంపిన ఈమెయిల్స్ ఒకే ఇన్‌బాక్స్‌కు వస్తాయి. యూజర్లు ఏ మెయిల్ ఐడీనైనా ఉపయోగించి గూగుల్ సర్వీసెస్ కోసం సైన్-ఇన్ అవ్వొచ్చు. అయితే, మెయిల్ అడ్రస్ మార్పు వల్ల ఎలాంటి డేటా నష్టం ఉండదని, అన్ని ఈమెయిల్, ఫోటోలు, ఫైల్స్, మెసేజెస్, యాప్ డేటా అలాగే ఉంటుంది. పాత జీమెయిల్ అడ్రస్ యూజర్‌కే ఉంటుందని, దాన్ని ఇంకొకరెవరూ వాడుకోలేరని గూగుల్ స్పష్టం చేసింది. అయితే, మెయిల్ అడ్రస్ మార్పునకు సంబంధించి కొన్ని షరతులు కూడా ఉన్నాయి. మెయిల్ అడ్రస్ మార్చిన తర్వాత యూజర్లు దన్ని 12 నెలల పాటు మళ్లీ మార్చుకునే, తొలగించే అవకాశం ఉండదు. ఏ అకౌంట్ అయినా దాని జీమెయిల్ అడ్రస్‌ను మూడుసార్లు మాత్రమే మార్చుకునే వీలుంటుందని గూగుల్ పేర్కొంది.

# దేశంలో లక్షకు మించి పెట్రోల్ పంపులు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయంగా పెట్రోల్, డీజిల్ వినియోగానికి తగినట్లుగా, వాటి విక్రయ కేంద్రాల సంఖ్య అధికమవుతోంది. గత దశాబ్దకాలంలోనే దేశంలోని పెట్రోల్ పంపుల సంఖ్య రెట్టింపైందని చమురు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది నవంబరు చివరికి 1,00,266 పెట్రోల్ పంపులున్నాయని.. 2015లో ఈ సంఖ్య 50,451 మాత్రమేనని వెల్లడించింది. వాహన కొనుగోళ్లు భారీగా పెరిగినందున, గ్రామీణ ప్రాంతాలతో పాటు జాతీయ రహదారుల వెంబడీ పెట్రోల్ పంపుల విస్తరణ అధికమవుతోంది. అమెరికా, చైనా తరవాత మనదేశమే అధికంగా పెట్రోల్ పంపులను కలిగిన దేశాల్లో అమెరికా (1,96,643), చైనా (1,15,228) తర్వాత మనదేశమే ఉంది. దేశీయంగా ప్రభుత్వరంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆధ్వర్యంలోనే 90% పైగా పెట్రోల్ పంపులున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థల్లో రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ అనుబంధ సంస్థ నయారా ఎనర్జీ లిమిటెడ్ 6,921, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - బీపీ సంయుక్తంగా 2,114, షెల్ 346 పెట్రోల్ పంపులను నిర్వహిస్తున్నాయి. 2003-04లో 27 పెట్రోల్ పంపులతో మనదేశంలో ప్రైవేట్ సంస్థల కార్యకలాపాలు ఆరంభమయ్యాయి. 2015లో మొత్తం 50,451 పెట్రోల్ పంపుల్లో ప్రైవేటువి 2,967 (5.9%), కాగా.. ప్రస్తుతం వాటి వాటా 9.3 శాతానికి పెరిగింది. మన దేశంలో అత్యధికంగా 41,664 పెట్రోల్ పంపులను ఐఓసీ, 24,605 కేంద్రాలను బీపీసీఎల్, 24,418 పంపులను హెచ్‌పీసీఎల్ నిర్వహిస్తున్నాయి. మొత్తం పంపుల్లో గ్రామీణ ప్రాంతాల వాటా దశాబ్దం క్రితం 22% కాగా.. ఇప్పుడు 29 శాతానికి పెరిగింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్‌తో పాటు సీఎన్‌జీ, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలను కూడా ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు.

# శాంసంగ్ ఇండియా ఐపీఓ లేనట్లే




**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ తన భారత వ్యాపారాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే ఆలోచన ప్రస్తుతానికైతే లేదని స్పష్టం చేసింది. తన అన్ని ఉత్పత్తుల్లో కృత్రిమ మేధ (ఏఐ)ను అందిపుచ్చుకోవడంతో పాటు, విక్రయాలు పెంచుకునేందుకు వినియోగదారు రుణ విభాగాన్ని మరింత విస్తరించాలని భావిస్తున్నట్లు తెలిపింది. శాంసంగ్ ఆగ్నేయాసియా ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్ మాట్లాడుతూ 'భారత్‌లో తయారీని మరింత విస్తృతం చేయాలనుకుంటున్నాం. ఇక్కడ మొబైల్ ఫోన్ డిస్‌ప్లే తయారీ నిమిత్తం ,ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకానికి దరఖాస్తు చేసుకున్నామ'ని తెలిపారు. భారత విభాగాన్ని పబ్లిక్ ఇష్యూకు తెచ్చే అవకాశాలపై ప్రశ్నించగా..'లేదు. ఇప్పటికైతే అటువంటి ప్రణాళికలేమీ లేవు' అని స్పష్టం చేశారు. కార్పొరేట్ బాండ్లు, సంస్థాగత రుణాల ద్వారా నిధులు సమీకరిస్తామని అన్నారు. వడ్డీలేని రుణాలను గృహోపకరణాలకూ అందించాలని శాంసంగ్ భావిస్తున్నట్లు పార్క్ తెలిపారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లను వడ్డీ రహిత నెలవారీ సులభ వాయిదాల్లో కొనుగోలు చేసుకునే అవకాశాన్ని సంస్థ కల్పిస్తోంది. మొత్తం స్మార్ట్‌ఫోన్ల విక్రయాల్లో 40 శాతానికి పైగా రుణం పైనే కొంటున్నారని పార్క్ తెలిపారు. ఇకపై ఎల్ఈడీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజరేటర్ల వంటి వాటికీ ఈ సదుపాయాన్ని కల్పించాలనుకుంటున్నట్లు వివరించారు.

# ఐఫోన్ ఎస్‌ఈ సహా పలు మోడళ్లకు యాపిల్ గుడ్‌బై

**హైదరాబాద్ పెన్ పవర్:** టెక్ దిగ్గజం యాపిల్ ఈ ఏడాది అనేక రకాల స్మార్ట్‌ఫోన్ మోడళ్లతో పాటు ఐప్యాడ్, మ్యాక్, వాచ్, ఇతర డివైజ్‌లను గుడ్‌బై చెప్తోంది. థర్డ్ పార్టీ రిటైల్ స్టోర్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లైన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి చోట్ల ఆయా ఫోన్లు అందుబాటులో ఉంటాయి. కానీ, స్టాక్ పూర్తయిన తర్వాత అవి కూడా మార్కెట్ల నుంచి పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉంటుంది. యాపిల్ సంస్థ అమ్మకాల ఉంచి తొలగించిన స్మార్ట్‌ఫోన్‌లలో ఐఫోన్ ఎస్‌ఈ, 14, 14 ప్లస్, 15, 15 ప్లస్, 16 ప్రో, 16 ప్రో మ్యాక్స్ ఉన్నాయి. అలాగే, ఐఫోన్ ఎస్‌ఈ మోడల్ ఆగిపోవడం మూలంగా టచ్ ఐడీ, హోమ్ బటన్, స్మాల్ స్క్రీన్, ఎల్‌సీడీ డిస్‌ప్లే ఉన్న ఏ ఫోన్‌ను విక్రయించదు. ఐప్యాడ్‌లకు సంబంధించి ఐప్యాడ్ ప్రో(ఎం4 చిప్), ఐప్యాడ్ ఎయిర్ (ఎం2), ఐప్యాడ్(10 జనరేషన్), యాపిల్ వాచ్ అల్ట్రా 2, యాపిల్ వాచ్ సిరీస్ 10, యాపిల్ వాచ్ ఎస్‌ఈ (సెకెండ్ జనరేషన్) సహా మ్యాక్‌బుక్‌లో పలు డివైజ్‌లను కూడా అమ్మకాల నుంచి తొలగిం చింది. ఇతర పరికరాల్లో ఎయిర్‌పాడ్స్ ప్రో(సెకెండ్ జనరేషన్), విజన్ ప్రో(ఎం2 వెర్షన్) వంటి వాటి విక్రయాలను నిలిపేసింది.



# మాల ధారణం... నియమాల తోరణం

**హైదరాబాద్ పెన్ పవర్:** మంచు కురిసే శీతాకాలం ప్రారంభమయిందంటే స్వామియే శరణం అయ్యప్పా అని భక్తాగ్రేసరుల భజనలు పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతిధ్వనిస్తాయి. గతంలో పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఈ దీక్షలు, నేడు మారుమూల గ్రామాలకు సైతం విస్తరించి, భక్తజనం నానాటికీ పెరుగుతు న్నది. కార్తీక మాసం ప్రారంభం నుండి వివిధ సమయాలలో ఆచరించే అయ్యప్ప స్వామి దీక్షలు భక్తి శ్రద్ధలకు, పవిత్రతకు, నియమాలకు ప్రతీకలు. ప్రతి యుగంలోనూ ధర్మసంస్థాపనార్ధం శ్రీమహా విష్ణువు అవతారాలెత్తుతూ సనాతన ధర్మాన్ని సంరక్షిస్తాడు. కాని దత్తాత్రేయుడు భక్తజనోద్ధరణ కొరకు శాశ్వత అవతార పురుషుడుగా భూమి యందు అవతారాలు ఎత్తుతూ 'చతుర్యుగ అవ తార మూర్తి'గా ఖ్యాతినొందాడు. త్రిమూర్తుల అంశాలుగా జన్మించిన దత్తాత్రేయుని అవతారాల్లో ఒకటి అయ్యప్పస్వామి, మోహిని రూపంలో ఉన్న హరికి, శివునికీ కలిగిన పుత్రుడైనందున 'హరిహర సుతుడని' ధర్మశాస్త్రా, భూతనాధుడు, అయ్యప్ప అని కీర్తించ బడుతున్నాడు. మహావిష్ణువుచే మణి హారమును మెడలో వేయబడి నందున 'మణికంఠుడని' సార్ధక నామధేయుడైనాడు. పాండ్య దేశ రాజైన రాజశేఖరుడు, మహారాణి పేరిందేవి, ప్రేమతో అయ్య, అప్ప' అని పిలిచినందున 'అయ్యప్ప'గా పిలువబడు తున్నాడు. రాజశేఖర మహారాజు, అగస్త్య మహాముని' ఆదేశానుసారం 'ఎరుమేలి వద్ద ధర్మశాస్తా దేవాలయంను నిర్మించెను. శబరి తపస్సు చేసిన స్థలంలో విశ్వకర్మ అయ్యప్ప దేవాల యమును, ఎడమ వైపు మాలికాపురత్తమ్మ ఆలయాన్ని, అయ్యప్ప ఆలయానికి తూర్పున 18 మెట్లు, వాటికిరువైపుల కరుప్ప, కడుత్త దేవాలయాలు నిర్మించెను. పవిత్రమైన మకర సంక్రాంతి రోజు శనివారం కృష్ణ పంచమి, ఉత్తరా నక్షత్రాన పరుశు రాముడు అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్టించెను. 18సార్లు శబరిమల పదునెట్టాంబడిని అధిరోహించి, దైవ సాక్షాత్కారం కలిగిన గురుస్వామి మంత్రోచ్ఛారణలతో మాలధారణ చేస్తాడు. దీక్షా నియమాలు త్రికరణ శుద్ధిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తాడు. ఏకాగ్రతతో అత్మ సాక్షాత్కారార్ధమై పాపములు తొలుగుటకు, లౌకిక విషయాలపై వ్యామోహం తగ్గుటకు, కోపతాపాలు ఉపశమించేందుకు ఉదయం, సాయంత్రం 108 సార్లు శరణు ఘోష చేస్తూ, 41 రోజులకు తక్కువ కాకుండా దేవుడిని పూజిస్తూ సాధన చేయడం సాంప్రదాయం. నల్ల దుస్తులు ధరించుట, నుదుటిపై విభూతి చందన, కుంకుమలు ధరించుట, తులసి, రుద్రాక్ష మాల ధారణం, బ్రహ్మచర్యం, సాత్వికాహారం, భజన, అన్నదానం, పవిత్ర స్నానాలు, వైరాగ్య సంకే తాలైన గడ్డం, గోళ్లు పెంచుట దీక్షలో ప్రధానాంశాలు. కొబ్బరికాయ మూడు కన్నులలో ఒక కన్నుకు రంధ్రం చేసి, నీటిని తొలిగించి పరిశుద్ధ మైన నెయ్యితో నింపి, ఇరుముడిలో ఒక ముడిలో కడుతూ, రెండవ ముడిలో యాత్రకు కావలిసిన ఆహార పదార్థాలు కడతారు. ఇరుముడిని తలపైకి ఎత్తుకున్నాక వెనక్కు తిరిగి చూడక బయలుదేరు తారు. ప్రయాణంలో ఎరుమేలి, కాళికట్టి, అశుదా నది, కలిదంకుంద్రం, కరిమల, పంపానది, నీలి మలై, శరంగుత్తియాల్, శబరిపీఠం, సన్నిదానం చేరుకుంటారు. 41రోజులకు తక్కువ గాకుండా గురుస్వామి ద్వారా 108 పూసలు గల తులసి లేదా రుద్రాక్ష మాలధారణ, ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం విభూతి, చందనం, కుంకుమ ధరించి 108 సార్లు అయ్యప్ప శరణు ఘోష పలకడం, కర్పూర హారతి, ఫలాదిక సమర్పణం దుస్తులు ధరించడం, రోజుకొక్క సారైన దేవాలయ సందర్శనం చేస్తారు. ఇవే కాకుండా పాదరక్షలు తొడగక పోవడం, ధూమపానం మత్తు పదార్థాలు, తాంబూలం, మాంసాహార నిషేధం, ఒక్కసారి భోజనం, అల్పాహారం, క్షవరం, గోళ్ళు తీయడం నిషేధం. మంచంపైగాక చాపపై మాత్రమే నిద్రించడం, పగలు నిద్రించక పోవడం, దీక్షాకాలంలో బ్రహ్మచర్యం పాటించడం, వినోద కార్యక్రమాలు చూడక పోవడం, స్నానం చేసే వరకు మంచినీరు త్రాగక పోవడం, కుల మత ధనిక పేద భేదం లేక అయ్యప్పలకు నమస్కారం చేయడం, ఆధ్యాత్మిక పుస్తక పఠనం, సత్సంగం, విధిగా భజనలో పాల్గొనడం, కనీసం మూడు సార్లయినా ఇతరుల యింటికి భిక్షకు వెళ్ళడం, అన్న దానం చేయడం అయ్యప్ప దీక్షా సమయంలో విధిగా పాటించాల్సిన నియమాలు. మొదటిసారి దీక్షను తీసుకున్న కన్నెస్వాములు మకర సంక్రాంతి సమయంలో కనిపించే మకర జ్యోతిని సందర్శించు కుంటారు. చాలా వరకు స్వయంపాకాన్నే భుజిస్తూ ఒకపూట భోజనం, ఒకపూట అల్పాహారం మితంగా భుజిస్తూ, దీక్షను స్వీకరించేవారు దైవభక్తి, ఆత్మ సంయమనంతో పాటు, ఆరోగ్యవంతులుగా ఉండ గలరనేది నిర్వివాదాంశం.

# 10 నెలల్లో నాలుగు రెట్లు పెరిగిన రష్యా మద్యం దిగుమతులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది రష్యా నుంచి భారత్‌కు పెద్ద ఎత్తున మద్యం దిగుమతులు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి 10 నెలల్లో భారత్‌కు రష్యా స్పిరిట్స్ ఎగుమతులు దాదాపు నాలుగు రెట్లు పెరిగాయని రష్యా వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన ఫెడరల్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ డేటా పేర్కొంది. దీనివల్ల రష్యా ఎగుమతిదారులకు భారత్ ఆకర్షణీయమైన మార్కెట్‌గా మారిందని రష్యా మీడియా అభిప్రాయపడింది. రష్యాకు చెందిన ప్రముఖ ఆర్థిక, వాణిజ్య దినపత్రిక 'వెడొమోస్టి'.. రష్యా వోడ్కా, ఇతర ఆల్కహాలిక్ డ్రింక్స్ ఎగుమతిదారులకు భారత్ ఆకర్షణీయమైన మార్కెట్‌గా అభివృద్ధి చెందుతోంది. 2025, మొదటి పది నెలల కాలంలో రష్యా ఎగుమతిదారులు వోడ్కా, జిన్, విస్కీ, లిక్కర్‌లతో సహా సుమారు 520 టన్నుల స్పిరిట్‌ను భారత్‌కు రవాణా చేశారు. వీటి విలువ రూ. 8 కోట్లకు పైనే ఉంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే పరిమాణంలో మూడు రెట్లు, నగదు పరంగా నాలుగు రెట్లు ఎక్కువని వెల్లడించింది. మొత్తం ఎగుమతుల్లో వోడ్కా అగ్రస్థానంలో ఉంది. 10 నెలల్లో దీని ఎగుమతులు విలువ సుమారు రూ. 6.82 కోట్లుగా ఉన్నాయని వేడోమోస్టి పేర్కొంది.

# గంటల కొద్దీ జిమ్‌లో కష్టపడక్కర్లేదు!
# రోజూ ఇలా నడిస్తే చాలు!



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అందరికీ సవాలుగా మారింది. ముఖ్యంగా బరువు తగ్గాలని, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించాలని చాలామంది జిమ్‌లకు వెళ్లి గంటల కొద్దీ కష్టపడుతుంటారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అందరికీ సవాలుగా మారింది. ముఖ్యంగా బరువు తగ్గాలని, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించాలని చాలామంది జిమ్‌లకు వెళ్లి గంటల కొద్దీ కష్టపడుతుంటారు. అయితే, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'పిరమిడ్ వాకింగ్' అనే సరికొత్త ట్రెండ్ బాగా ప్రాచుర్యం పొందుతోంది. సాధారణ నడక కంటే ఎంతో ప్రభావవంతంగా పనిచేసే ఈ పద్ధతి ద్వారా తక్కువ సమయంలోనే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. పిరమిడ్ వాకింగ్ అనేది ఒక రకమైన ఇంటర్వెల్ ట్రైనింగ్ వంటిది. ఇందులో నడక వేగాన్ని పిరమిడ్ ఆకారంలో క్రమక్రమంగా పెంచుతూ, మళ్ళీ తగ్గించడం జరుగుతుంది. ఉదాహరణకు, మొదట మూడు నిమిషాలు చాలా నెమ్మదిగా నడవాలి. ఆ తర్వాత మరో మూడు నిమిషాలు మధ్యస్థ వేగంతో, ఆ తదుపరి మూడు నిమిషాలు అత్యంత వేగంగా (బ్రిస్క్ వాకింగ్) నడవాలి. ఇలా వేగాన్ని పెంచిన తర్వాత, మళ్ళీ అదే క్రమంలో వేగాన్ని తగ్గిస్తూ రావాలి. అంటే వేగంగా ఉన్న నడకను మధ్యస్థానికి, ఆపై నెమ్మదిగా నడవడానికి మార్చాలి. ఇలా చేయడం వల్ల గుండె వేగం ఒకేలా కాకుండా మారుతూ ఉండటం వల్ల శరీరంలో జీవక్రియలు మెరుగుపడతాయి. ఈ పద్ధతి వల్ల కలిగే ప్రధాన లాభం ఏమిటంటే.. ఇది రక్త ప్రసరణను అద్భుతంగా మెరుగుపరుస్తుంది. శరీరంలోని ప్రతి భాగానికి ఆక్సిజన్ సరఫరా పెరగడం వల్ల కండరాలు బలోపేతం అవుతాయి. ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్ అంటే పొట్ట దగ్గర ఉన్న మొండి కొవ్వును కరిగించడానికి ఈ నడక ఎంతో సహాయపడుతుంది. సాధారణ నడకలో మనం ఒకే వేగాన్ని పాటిస్తాం, దీనివల్ల శరీరం దానికి అలవాటు పడిపోతుంది. కానీ పిరమిడ్ వాకింగ్‌లో వేగం మారుతూ ఉండటం వల్ల శరీరం ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల బరువు తగ్గడం సులభతరమవుతుంది. డయాబెటిస్, రక్తపోటు వంటి సమస్యలతో బాధపడేవారికి కూడా ఈ పిరమిడ్ వాకింగ్ ఒక వరమనే చెప్పాలి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, శరీరంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి, రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. దీనికోసం ప్రత్యేకమైన పరికరాలు లేదా జిమ్ సభ్యత్వాలు అవసరం లేదు. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం మీ ఇంటి ఆవరణలో లేదా పార్కులో కేవలం 15 నుండి 20 నిమిషాల పాటు ఈ పద్ధతిని పాటిస్తే సరిపోతుంది. ఆరోగ్యంగా ఉండాలనుకునే వారికి ఇది ఒక సింపుల్ అండ్ బెస్ట్ ఛాయిస్.

## చలికాలంలో ఐస్ క్రీమ్ తింటే ఏమవుతుంది?

ఐస్ క్రీమ్ అంటే ఎవరికీ ఇష్టం ఉండదు. టైమ్‌తో సంబంధం లేకుండా చాలా మంది ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టంగా తింటారు. చాలా మంది చలికాలంలో ఐస్ క్రీమ్ తింటుంటారు. అసలు చలికాలంలో ఐస్ క్రీం తింటే నిజంగా జలుబు చేస్తుందా? బయట చలి చంపేస్తున్నా.. ఐస్ క్రీం పార్లర్ల దగ్గర జనం తగ్గరు. కొందరికి ఐస్ క్రీం తినడానికి సీజన్‌తో సంబంధం ఉండదు. అయితే చలికాలంలో ఐస్ క్రీం తింటే జలుబు, దగ్గు వస్తుంది అని ఇంట్లో పెద్దలు హెచ్చరిస్తుంటారు. ఇంతకీ ఈ మాటలో నిజమెంత..? వింటర్‌లో చల్లని ఆహారాలు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమా..? నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఐస్ క్రీం తినడం వల్ల నేరుగా జలుబు రాదు. జలుబు, ఫ్లూ వంటివి వైరస్‌లు లేదా బ్యాక్టీరియా వల్ల వస్తాయి కానీ, చల్లని ఉష్ణోగ్రత వల్ల కాదు. చల్లని ఆహారం కడుపులోకి వెళ్లిన వెంటనే, మన శరీరంలోని అంతర్గత వ్యవస్థ దానిని వేడి చేయడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోదు. ఐస్ క్రీం ఒత్తిడిని తగ్గించి, మానసిక స్థితిని ఉల్లాసంగా ఉంచే ఆహారం. అందుకే చాలామంది చలిలో కూడా దీనిని ఇష్టపడతారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తింటే పెద్దగా ఇబ్బంది లేకపోయినా కొన్ని సమస్యలు ఉన్నవారు మాత్రం దూరంగా ఉండటం మంచిది. గొంతు సమస్యలు: ఇప్పటికే గొంతు నొప్పి లేదా ఇన్‌ఫెక్షన్ ఉన్నవారికి చల్లని ఐస్ క్రీం ఆ అసౌకర్యాన్ని మరింత పెంచుతుంది. అస్తమా, దగ్గు ఉన్నవారు: శ్వాసకోశ సమస్యలు లేదా తరచుగా దగ్గు వచ్చే వారికి చల్లని, చక్కెర కలిగిన ఆహారాలు కఫం ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. తేమ లేకపోవడం: చలికాలంలో గాలిలో తేమ తక్కువగా ఉంటుంది. ఐస్ క్రీం తినడం వల్ల గొంతు లోపలి భాగం మరింత పొడిబారి, వైరల్ ఇన్‌ఫెక్షన్లకు దారితీయవచ్చు. ఐస్ క్రీంను గబగబా తినకుండా, చిన్న స్పూన్లతో నిదానంగా తినండి. దీనివల్ల నోటి ఉష్ణోగ్రత అకస్మాత్తుగా తగ్గదు. ఐస్ క్రీం తిన్న తర్వాత గ్లాసు గోరువెచ్చని నీరు లేదా పాలు తాగడం వల్ల గొంతు సాధారణ స్థితికి వస్తుంది. మీకు కొంచెం జలుబుగా అనిపించినా ఆ సమయంలో ఐస్ క్రీంకు దూరంగా ఉండటమే ఉత్తమం. మొత్తానికి చలికాలంలో ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తినడం సురక్షితమే. అయితే అది మితంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లు.. పరిమితి దాటితే ఏదైనా ప్రమాదమే.



## పళ్లు తోమితే చాలు అనుకుంటున్నారా!



పళ్ళు తోముకోవడం దంత ఆరోగ్యానికి అత్యవసరం. అమెరికన్ డెంటల్ అసోసియేషన్ సిఫార్సుల ప్రకారం, రోజుకు రెండుసార్లు, రెండు నిమిషాల పాటు బ్రష్ చేయడం వల్ల ఫ్లేక్ తొలగి, దంతక్షయం నివారించబడుతుంది. శుభ్రమైన, బలమైన, మెరిసే దంతాలు మీ వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయి. సరైన సమయంలో, సరైన పద్ధతిలో బ్రష్ చేయడం ద్వారా దంత వ్యాధులను నివారించి, పూర్తి దంత సంరక్షణ పొందవచ్చు. పళ్ళు తోముకోవడం మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ఎందుకంటే, ఇది అనేక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. వాటిని శుభ్రంగా, బలంగా, మెరుస్తూ ఉంచుతుంది.. మెరిసే దంతాలు మన వ్యక్తిత్వానికి అందాన్ని ఇస్తాయి. అమెరికన్ డెంటల్ అసోసియేషన్ ప్రకారం, మనం రోజుకు రెండుసార్లు ఉదయం, పడుకునే ముందు రెండు నిమిషాలు పళ్ళు తోముకోవాలి. బ్రష్ చేయడం వల్ల దంతాలపై పేరుకుపోయిన ఫ్లేక్ తొలగిపోతుంది. ఫ్లేక్ దంతాల ఎనామిల్‌పై దాడి చేస్తుంది. ఇది చాలా కాలం పాటు జరిగితే, పంటి ఎనామిల్ దెబ్బతింటుంది. దీంతో కావిటీస్ ఏర్పడతాయి. అందుకే దంతాలు శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరూ రోజుకు రెండుసార్లు ఉదయం ఒకసారి, రాత్రి పడుకునే ముందు ఒకసారి బ్రష్ చేయాలి. ఎందుకంటే ఇది రాత్రిపూట నోటిలో, దంతాలపై పేరుకుపోయిన ఫలకం, బ్యాక్టీరియాను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. నోటి నుండి ఆహార కణాలను తొలగిస్తుంది. ఆరోగ్యకరమైన దంతాలు, చిగుళ్ళను నిర్వహిస్తుంది. ముందుగా మీ బ్రష్‌ను నీటితో తడపండి. ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్‌ను ఉపయోగించండి. మీ దంతాలను 45 డిగ్రీల కోణంలో 2 నిమిషాల పాటు బ్రష్ చేయండి. మీ దంతాల ముందు, వెనుక, పైభాగాన్ని శుభ్రం చేయండి. మీ నాలుకను కూడా శుభ్రం చేసుకోండి. టూత్‌పేస్ట్‌ని ఉమ్మివేయండి. కానీ, రోజుకు రెండుసార్లు కంటే ఎక్కువ బ్రష్ చేయవద్దు. అంతేకాకుండా బ్రష్ కూడా హార్డ్‌గా ఉండకూడదు.

## 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలుతుందా?



వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు. వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు జుట్టు రాలుతుంది? అనే విషయాల గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? మాక్స్ హాస్పిటల్‌లోని డెర్మటాలజీ విభాగంకి చెందిన డాక్టర్ సౌమ్య సచ్‌దేవా దీని గురించి మాట్లాడుతూ.. 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉన్నాయి. కొంతమంది మహిళలు ఈ వయసులో మెనోపాజ్‌కు గురవుతారు. ఇది కూడా ఒక కారణం. అంతేకాకుండా అనేక హార్మోన్ల లోపాలు కూడా దీనికి కారణం కావచ్చు. మహిళలకు ఐరన్, విటమిన్ డి, బయోటిన్ లోపం ఉన్నా జుట్టు రాలడం సంభవించవచ్చు. మహిళల్లో జుట్టు రాలడానికి మానసిక ఒత్తిడి కూడా ఒక ప్రధాన కారణమని డాక్టర్ సౌమ్య అంటున్నారు. ఇటీవలి సంవత్సరాలలో మానసిక ఒత్తిడి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి జుట్టును కూడా ప్రభావితం చేస్తాయి. జుట్టు పెరుగుదలను అడ్డుకుంటాయి. జుట్టు రాలడానికి కారణమవుతాయి. కొన్ని సందర్భాల్లో, ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా జుట్టు రాలడానికి కారణమవుతాయి. ఈ వ్యాధులకు చికిత్స లేదు. కొంతమంది మహిళల్లో థైరాయిడ్ లేదా డయాబెటిస్ వల్ల కూడా జుట్టు రాలడం సంభవించవచ్చు. ఇలాంటి సందర్భాలలో థైరాయిడ్, డయాబెటిస్‌ను నియంత్రించడం వల్ల కూడా జుట్టు రాలడాన్ని నియంత్రించవచ్చు. మహిళకు ఆటో ఇమ్యూన్ వ్యాధి లేదా జన్యుపరమైన కారణాల వల్ల జుట్టు రాలడం జరిగితే దానిని పూర్తిగా నియంత్రించడం కష్టం. ఇతర సందర్భాల్లో కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ప్రోటీన్, ఐరన్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.జుట్టు పెరుగుదలకు పుట్టగొడుగులు వంటి విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాన్ని తినాలి.నీళ్లు పుష్కలంగా తాగాలి. మానసిక ఒత్తిడిని నివారించాలి. దానిని నివారించడానికి ప్రతిరోజూ యోగా సాధన చేయాలి.మీ తలకు క్రమం తప్పకుండా మసాజ్ చేసుకోవాలి.

## నిద్రలేవగానే మానసిక
# గందరగోళం
## ఇలా ఎందుకు జరుగుతుంది?



పొద్దు పొద్దున్న బ్యాడ్ మూడ్‌తో నిద్రలేస్తున్నారా? ఏదో తెలియని నిరాశ, నిస్పృహ, మానసిక ఆందోళన, గందరగోళం వెంటాడుతున్నాయా?.. ఇలాంటి సమస్యకు కారణం మీరే కావచ్చునేమో ఒకసారి ఆలోచించండి. ఎందుకంటే.. ముందురోజు రాత్రి నిద్రకు ముందు మీరు తీసుకునే ఆహారం, పానీయాలు, అలాగే అతి ఆలోచనలు మరుసటిరోజు మిమ్మల్ని బ్యాడ్ మూడ్‌తో మేల్కొనేలా చేస్తాయంటున్నారు నిపుణులు. ఇటీవల అనేకమంది ఎదుర్కొంటున్న రొటీన్ ప్రాబ్లమ్ ఇది. నిద్ర మేల్కొన్నప్పటికీ ముఖంలో కోపం, ఆవేదన, స్ట్రెస్ వంటి ఏదో ఒక లక్షణం కనిపిస్తుంది. ఇలా అప్పుడప్పుడైతే పర్లేదు కానీ.. తరచూ అదే జరుగుతుంటే మాత్రం మీ ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాకుండా రోజువారి పనికి, వృత్తి జీవితానికి ఆటంకం కలుగుతుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు సరైన భోజనం తీసుకోకపోవడం మరుసటి రోజు ఉదయం మీరు బ్యాడ్‌గా నిద్రమేల్కొనేలా చేస్తుంది. కొందరికి రాత్రి భోజనం తర్వాత స్వీట్లు, చిప్స్, ఇతర చిరుతిళ్లు తినే అలవాటు ఉంటుంది. ఇలా తినడాన్ని ఇంట్లో వాళ్లు వ్యతిరేకిస్తారనే కారణంతో కొందరు ఎలాగైనా తినాలని సాకులు వెతుకుతుంటారు. తాము తిని చాలా రోజులైందని, కాబట్టి ఇప్పుడు తింటే ఏం కాదని చెప్తుంటారు. కొందరు అలా తినడంవల్ల తమ బాధలు పోతాయని, రిలాక్స్ అవుతామని అంటుంటారు. కానీ ఇది నిజం కాదు. రాత్రిళ్లు భోజనం తర్వాత అదనంగా ఆహారం, స్వీట్లు, చిప్స్, పిస్తా, పిజ్జా వంటివి తీసుకో కూడదని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే అధిక మోతాదులో కార్బోహైడ్రేట్లు కలిగిన ఇతర ఆహారాలు. పడుకునే ముందు తినడంవల్ల నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. కానీ మరుసటిరోజు మీ మూడ్ పాడు చేస్తాయి. కోపంతో మేల్కొనేలా చేస్తాయి. న్యూట్రిషనల్ థెరపిస్ట్ జాకీ లించ్ ప్రకారం.. ఇలాంటి ఆహారాలు మీ రక్తంలో షుగర్ లెవల్స్‌ను హెచ్చుతగ్గులకు గురిచేస్తాయి. ఫైనల్‌గా నిద్రపోయే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే నిద్ర పోయేకంటే ముందు కనీసం 3 నుంచి 4 గంటల ముందు తింటే అంత ప్రభావం ఉండకపోవచ్చు. మీరు బ్యాడ్ మూడ్‌లో మేల్కొన్నప్పుడు, ఆ కోపాన్ని మీ కడుపుపై చూపొద్దు. అంటే బ్రేక్ ఫాస్ట్ తీసుకోకుండా ఉండకండి. మీరు ఏ విధమైన ఆహారం తీసుకున్నా సరే.. బ్రేక్ ఫాస్ట్ అనేది చాలా ముఖ్యం. మూడ్ బాగోలేదని దానిని స్కిప్ చేస్తుంటే గనుక మీరు నిరాశ, ఆందోళనలను ఆహ్వానించినట్టే లెక్క. లైట్ అండ్ హెల్తీ బ్రేక్‌ఫాస్ట్ తక్షణమే మీ రోజువారి మానసిక స్థితిని ఆనందమయం చేస్తుంది. మీకు కోపంగా అనిపించినప్పుడు ఎందుకలా అనిపిస్తుందనేది నిర్ధారించుకోండి. కొంచెం అల్పాహారం తినండి, ఆ తర్వాత ఎలా అనిపిస్తుందో చూడండి. తినకుండా ఉండటం అనేది మరుసటిరోజు మీ మూడ్ పాడవడానికి కారణం అవుతుంది. ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ చేసేందుకు ట్రై చేసినవారు ఆరోజంతా చాలా మంచి అనుభూతి చెందుతారు. బోనస్ చిట్కా ఏటంటే.. మీరు తీసుకునే బ్రేక్ ఫాస్ట్‌లో తగిన ప్రోటీన్‌ను కలిగి ఉండటం. ఎందుకంటే ఇది బరువు తగ్గడానికి, ఎనర్జీ కోసం సహాయపడుతుంది. మీరెప్పుడైనా నిద్రలేని రాత్రులు గడిపారా? ఎలాగైనా నిద్రపోవాలని ప్రయత్నంలో భాగంగా కళ్లు మూసుకుంటారు. కానీ కునుకు రాదు. రకరకాల ఆలోచనలు వెంటాడుతుంటాయి. అయితే ఎందుకు అలా జరుగుతుందో మాత్రం చాలామంది పట్టించుకోరు. మీరు మరుసటి రోజు బ్యాడ్ మూడ్‌తో నిద్ర మేల్కొనడానికి ఇది కూడా ఒక కారణమే అంటున్నారు నిపుణులు. పడుకునే ముందు రొటీన్‌కు భిన్నమైన జీవనశైలి, ఎక్కువసేపు స్క్రీన్ చూడటం, ఫోన్‌లో నిమగ్నమైపోవడం, జంక్ లేదా ఆయిలీ ఫుడ్స్ తినడం వంటి కారణాలతో ఇటువంటి సమస్య తలెత్తుతుంది. కాబట్టి వాటిని నివారించాలి. నిద్రపోయే సమయాన్ని ఆందోళన కరంగా ఉండకుండా చూసుకోవాలి. ప్రశాంతమైన వాతావరణం క్రియేట్ చేసుకోవాలి అంటున్నారు నిపుణులు.

## శీతాకాలంలో లభించే చవకైన పండు



పండ్లలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. వీటిని తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.. ముఖ్యంగా.. శీతాకాలంలో లభించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని.. వీటిని డైలీ తినాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. అలాంటి పండ్లలో జామకాయ ఒకటి.. శీతాకాలంలో జామ పండు తినడం మంచిది.. పండ్లలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. వీటిని తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.. ముఖ్యంగా.. శీతాకాలంలో లభించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.. అలాంటి పండ్లలో జామకాయ ఒకటి.. శీతాకాలంలో జామ పండు తినడం మంచిది.. ఎందుకంటే ఇందులో ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఈ పండులో విటమిన్ సి, ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటాయి. జామ పండులో అరటిపండు కంటే ఎక్కువ పొటాషియం, 5 గ్రాముల ఫైబర్, 3 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. ఈ పండు సాధారణంగా ప్రతిచోటా లభిస్తుంది..

అన్ని సీజన్లలో జామపండ్లు లభిస్తున్నప్పటికీ.. శీతాకాలంలో ఎక్కువగా లభిస్తాయి.. అంతేకాకుండా చౌకగా కూడా ఉంటాయి.. సాధారణంగా ఒక జామకాయ రూ.5 లేదా 10 కి లభిస్తుంది.. ఇంకా కేజీ రూ.50 వరకు లభిస్తాయి.. అయితే.. నాణ్యతను బట్టి కూడా ధర ఉంటుంది. శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లో జామపండ్లు లభిస్తాయి. జామ పండు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. జామ ఆకులు ఇన్సులిన్ నిరోధకతను మెరుగుపరుస్తాయి. జామ ఆకుల టీ తాగడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులలో భోజనం తర్వాత చక్కెర స్థాయిలు 10 శాతం తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.ఇంకా జామపండ్లు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. యాంటీఆక్సిడెంట్లు గుండెను ఫ్రీ రాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి.జామపండ్లు కొలెస్ట్రాల్, రక్తపోటును కూడా తగ్గిస్తాయి. వీటిలోని ఫైబర్ కంటెంట్.. బరువును తగ్గేలా చేస్తుంది.జామపండ్లు ముఖ్యంగా ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తాయి. ఈ పండులోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇంకా కడుపును ఆరోగ్యవంతంగా ఉంచుతుంది. జామపండును ఎలాగైనా తినొచ్చు.. అల్పాహారంగా లేదా భోజనం తర్వాత జామపండును తినవచ్చు.. ఇంకా స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు.. ఇంకా జ్యూస్ చేసుకుని కూడా తాగొచ్చు..

# కోహ్లీ ప్రపంచ రికార్డు.. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని రికార్డు బ్రేక్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** కోహ్లీని కింగ్ అని అందుకే అన్నారేమో. వరల్డ్ క్రికెట్లో రికార్డులు తిరగరాస్తూ దూసుకుపోతున్నాడు. సచిన్ తర్వాత అంతటి ఆట తీరుతో.. కన్సిస్టెన్సీని మెయింటైన్ చేస్తున్న కోహ్లీ.. లిస్ట్–%ూ% క్రికెట్ లో కూడా ఇరగదీస్తున్నాడు. వన్డే కెరీర్ అయిపోయినట్లే.. వచ్చే వరల్డ్ కప్ కు అర్హత సాధించేంత ఫామ్ లేదనే విమర్శలు వస్తున్న వేళ.. విజయ్ హజారే ట్రోఫీలో గుజరాత్ పై శుక్రవారం (డిసెంబర్ 26) 77 రన్స్ చేసి.. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని రికార్డును బ్రేక్ చేశాడు. 50 ఓవర్ల క్రికెట్ లో.. చాలా రోజులుగా ఎవరికీ సాధ్యం కాని రికార్డును కోహ్లీ సాధించాడు. లిస్ట్ –A క్రికెట్లో ఆస్ట్రేలియా లెజెండరీ ఫినిషర్ గా పేరున్న మైకేల్ బెవాన్ రికార్డును బ్రేక్ చేశాడు కోహ్లీ.

సెంచరీల విషయంలో సచిన్ తో పోల్చుతుంటారు కోహ్లీని. ఎందుకంటే టెండూల్కర్ తర్వాత అలాంటి రికార్డ్సు.. అన్ని సెంచరీలు చేసింది కింగ్ ఒక్కడే కాబట్టి. అయితే లేటెస్ట్ గా కోహ్లీ సాధించిన ఫీట్.. రన్ స్కోరింగ్ లో తనకు తానే సాటి అని చెప్పేలా మైకేల్ బెవాన్ పేరున ఉన్న రికార్డును అధిగమించాడు. లిస్ట్ – A క్రికెట్ లో యావరేజ్ రన్స్ లో టాప్ లో ఉన్న బెవాన్ ను 2వ స్థానానికి పంపి.. టాప్ లో కూర్చున్నాడు కింగ్. బెంగళూరులో జరుగుతున్న మ్యాచ్ లో గుజరాత్ పై 61 బంతుల్లో 77 రన్స్ చేసి.. లిస్ట్ – A క్రికెట్ లో 57.87 యావరేజ్ స్కోర్ ఉన్న టాప్ ప్లేయర్ గా ఉద్భవించాడు. ఇప్పటి వరకు హైయెస్ట్ యావరేజ్ మైకేల్ బెవాన్ పేరున 57.86 దగ్గర ఉంది.

**లిస్ట్ ఎ క్రికెట్‌లో అత్యధిక సగటు సాధించిన బ్యాట్స్‌మెన్:**

1. విరాట్ కోహ్లీ (ఇండియా): 57.87
2. మైఖేల్ బెవాన్ (ఆస్ట్రేలియా): 57.86
3. సామ్ హైన్ (ఇంగ్లాండ్): 57.76
4. ఛటేశ్వర్ పుజారా (ఇండియా): 57.01
5. రుతురాజ్ గైక్వాడ్ (ఇండియా): 56.68
6. బాబర్ ఆజం (పాకిస్థాన్): 53.82
7. ఏబీ డివిలియర్స్ (దక్షిణాఫ్రికా): 53.46

వన్డే ఫార్మాట్‌లో కెరీర్ ప్రశ్నార్థకంగా ఉన్న తరుణంలో.. కోహ్లీ ఈ పరుగుల జాబితాలో టాప్ ప్లే లోకి చేరుకోవడం విశేషం. 50 ఓవర్ల ఫార్మాట్‌లో గత 6 ఆటల్లో యావరేజ్ గా150 పరుగులు సాధించాడు. కోహ్లీ ఫామ్ ను అభిమానులు గాడ్ మోడ్ గా పిలుస్తున్నారు. ఇండియా, ఢిల్లీ తరపున ఇటీవల జరిగిన మ్యాచ్‌లలో కోహ్లీ దాదాపుగా అవుట్ చేయలేని స్థితిలో ఆడుతుండటం విశేషం.

**గత ఆరు మ్యాచ్ లలో కోహ్లీ పర్ఫామెన్స్:**

ఈ ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో, కోహ్లీ 146.00 సగటుతో 584 పరుగులు చేశాడు. కోహ్లీ చేసిన స్కోర్లు ఏ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌కైనా కలలా అనిపిస్తుంనటంలో అతిశయోక్తి లేదనుకోవాలి.

77 (61) vs గుజరాత్
131 (101) vs ఆంధ్ర
65లి vs దక్షిణాఫ్రికా
102 vs దక్షిణాఫ్రికా
135 vs దక్షిణాఫ్రికా
74 vs% ఆస్ట్రేలియా

2025 అంతటా కోహ్లీ అద్భుత ఫామ్ తో ఆకట్టుకున్నాడు. కెరీర్ ఎండింగ్ దశకు చేరుకుంది.. ఇక మునుపటి దూకుడు చూడలేం అని చాలామంది భావించారు. కానీ కింగ్ మరింత వేగం పెంచి.. ఈ సంవత్సరం లిస్ట్ ఎ క్రికెట్‌లో110 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌ను కొనసాగించాడు.

2025లో జరిగిన అన్ని లిస్ట్ A మ్యాచ్‌లలో, కోహ్లీ సగటు 80ల వద్దనే ఉంది, ఈ సంఖ్య అతను బెవాన్ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా చరిత్రలో లిస్ట్ %ూ% లో అత్యంత వేగంగా 16,000 పరుగులను చేరుకున్న ఆటగాడిగా నిలిచాడు. సచిన్ టెండూల్కర్ మునుపటి రికార్డును 61 ఇన్నింగ్స్‌లతో అధిగమించాడు.

## భీకర ఫామ్‌లో ఉన్న రోహిత్‌నే గోల్డెన్ డకౌట్ చేశాడు..!

# అసలు ఎవరీ దేవేంద్ర సింగ్ బోరా..?





**హైదరాబాద్ పెన్ పవర్:** విజయ్ హజారే ట్రోఫీ ఎలైట్ గ్రూప్–సీలో భాగంగా శుక్రవారం (డిసెంబర్ 26) జైపూర్ వేదికగా ముంబై, ఉత్తరాఖండ్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచులో టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. సిక్కింపై సెంచరీతో చెలరేగిన హిట్ మ్యాన్ ఉత్తరఖాండ్?పై డకౌటై తీవ్రంగా నిరాశపర్చారు. మ్యాచ్ తొలి ఓవర్‌లోనే ఎదుర్కొన్న తొలి బంతికే క్యాచ్ ఔట్ రూపంలో వెనుదిరిగాడు. ఉత్తరఖాండ్ బౌలర్ దేవేంద్ర సింగ్ బోరా బౌలింగ్‌లో జగ్‌మోహన్ నాగర్‌కోటికి క్యాచ్ ఇచ్చి రోహిత్(0) గోల్డెన్ డకౌట్ అయ్యాడు. దీంతో అతడి ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురి కాగా.. భీకర ఫామ్?లో ఉన్న రోహిత్?ను గోల్డెన్ డకౌట్ చేసిన దేవేంద్ర సింగ్ బోరా క్రికెట్ వర్గాల్లో టాక్ ఆఫ్ ది టౌన్?గా మారాడు. రోహిత్ ఫ్యాన్స్?తో పాటు క్రికెట్ ప్రేమికులు అసలు ఎవరీ దేవేంద్ర సింగ్ బోరా అంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు.

**ఎవరీ బోరా..?**

25 ఏళ్ల దేవేంద్ర సింగ్ బోరా ఉత్తరఖాండ్‌కు చెందిన రైట్ ఆర్మ్ మీడియం పేస్ బౌలర్. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్? చేయడంతో పాటు కొత్త బంతితో స్వింగ్ రాబట్టగలడు. ముంబైతో జరిగిన మ్యాచ్ బోరాకు తన కెరీర్‌లో మూడో లిస్ట్ ఎ మ్యాచ్. మూడో మ్యాచులోనే ఏకంగా ప్రపంచ దిగ్గజ బ్యాటర్లలో ఒకడిగా పేరుపొందిన రోహిత్ శర్మను గోల్డెన్ డకౌట్ చేసి టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. తన తొలి ఓవర్‌లోనే రోహిత్ శర్మను ఔట్ చేయడం ద్వారా దేవేంద్ర సింగ్ బోరా ఆత్మవిశ్వాసం మరింత రెట్టింపుకానుంది. ఇప్పటి వరకు మూడు లిస్ట్–ఏ మ్యాచ్‌లు ఆడిన ఈ యంగ్ సంచలనం 19.5 యావరేజ్, 20.2 స్ట్రైక్‌రేట్‌తో వికెట్లు సాధించాడు. హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో (4/44) అద్భుతమైన గణాంకాలతో విజయ్ హజారే ట్రోఫీని ఘనంగా ప్రారంభించాడు. సెకండ్ మ్యాచులో ఏకంగా రోహిత్ శర్మనే ఔట్ చేసి ఔరా అనిపించాడు. ఇక.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 15 మ్యాచ్‌లు ఆడి 41.13 యావరేజ్‌తో 30 వికెట్లు పడగొట్టాడు. అలాగే.. ఉత్తరఖాండ్ ప్రీమియర్ లీగ్‌లో 6 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు సాధించాడు. రోహిత్?ను డకౌట్ చేయడంతో ఈ దేశవాళీ పేసర్ పేరు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది.

## అయ్యర్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. బ్యాటింగ్ ప్రాక్టీస్ షురూ చేసిన సర్పంచ్ సాబ్..!



**హైదరాబాద్ పెన్ పవర్:** పొత్తి కడుపు గాయం నుంచి కోలుకున్న టీమిండియా వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. బుధవారం ముంబైలో దాదాపు గంటసేపు ఎలాంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ చేశాడు. దాంతో క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు తొలి అడుగు వేశాడు. అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో శ్రేయస్‌కు తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. దీని నుంచి కోలుకునే క్రమంలో అతను సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరంగా ఉన్నాడు.

ప్రస్తుతం గాయంపై పూర్తి స్థాయి అంచనా కోసం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)కి వెళ్లనున్నాడు. ఇప్పటికైతే ఎప్పుడు బరిలోకి దిగుతాడనే దానిపై స్పష్టమైన తేదీని చెప్పడం కష్టంగానే ఉన్నా.. విజయ్ హజారే ట్రోఫీలో ఆడాలని భావిస్తున్నాడు. అయితే సీవోఈ ఇచ్చే నివేదికలపై ఇది ఆధారపడి ఉంటుంది. 'ఆసీస్‌లో శ్రేయస్‌కు గాయం కావడం దురదృష్టకరం. అతను పూర్తి స్థాయిలో కోలుకున్నట్లు కనిపిస్తున్నాడు. ఎలాంటి నొప్పి లేకపోవడంతో ముంబైలో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

ఇది మంచి సంకేతం. టీమిండియా తర్వాతి సిరీస్‌లో న్యూజిలాండ్‌తో తలపడుతుంది. దానికి అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడు. అంతకంటే ముందే విజయ్ హజారేలోనూ ఆడాలని భావిస్తున్నాడు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించాడు. సీవోఈలో శ్రేయస్ నాలుగు నుంచి ఆరు రోజులు ఉండనున్నాడు. అక్కడే అన్ని పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికైతే సాధారణ జిమ్, ఫిట్‌నెస్ సెషన్లను ప్రారంభించాడు.

# రెడ్ ఫ్రాక్ లో అందాల సోయగాలు..



అనసూయ భరద్వాజ్ చీరల సేకరణ



క్రిస్మస్ సెలబ్రేషన్స్ లో భాగంగా హీరోయిన్స్ ఒకరి తర్వాత ఒకరు తమ ఇంట్లో లేదా తాము ఉండే ప్రదేశాలలో జరుపుకున్న వేడుకలకు సంబంధించిన ఫోటోలను ఇన్స్టాగ్రామ్ వేదికగా ఒక్కొక్కరు పంచుకుంటున్నారు.. ముఖ్యంగా చాలామంది హీరోయిన్స్ ఇలా రెడ్ కలర్ దుస్తులు ధరించి తమ అందాలతో మెస్మరైజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు మరొక హీరోయిన్ కూడా తన ఇంట క్రిస్మస్ సెలబ్రేషన్స్ ను జరుపుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే రెడ్ కలర్ ఫ్రాక్ ధరించిన ఈమె.. తన అందాలతో బ్లాస్ట్ చేసింది. ముఖ్యంగా అమ్మడి అందాలు చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. పండుగ వేళ అందాల సోయగాలతో ఉక్కిరి బిక్కిరి చేస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.ఆమె ఎవరో కాదు కన్ను గీటుతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్. తాజాగా తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి క్రిస్మస్ వేడుకలను జరుపుకున్న ఈమె అందుకు సంబంధించిన ఫోటోలను షేర్ చేస్తూ హ్యాపీ క్రిస్మస్ అంటూ క్యాప్షన్ జోడించింది. అందులో రెడ్ కలర్ ఫ్రాక్ తో అందాలతో ఆకట్టుకుంది. అలా మొత్తానికైతే ప్రియా ప్రకాష్ వారియర్ తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.1999 అక్టోబర్ 28న కేరళలోని త్రిస్సూర్ లో పుంకున్నంలో కేంద్ర ఎక్సైజ్ శాఖ ఉద్యోగి ప్రకాష్ వారియర్ అలాగే గృహిణి ప్రియ దంపతులకు జన్మించింది. సందీపని విద్యానికేతన్ లో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఈమె.. 2018లో విమల కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ కోర్సులో చేరింది. ఓరు ఆధార్ లవ్ అనే సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఇందులో కన్ను గీటుతో భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇక ఈమె నటి మాత్రమే కాదు సింగర్ కూడా..మాణిక్య మలరాయ పూవి అనే చిత్రంలో పాట పాడి సింగర్ గా కూడా సత్తా చాటింది. ఇక 2019లో నరేష్ అయ్యర్ తో కలిసి ఫైనల్స్ చిత్రం కోసం ఒక పాట కూడా పాడింది. అలాగే అర్బాజ్ ఖాన్ తో కలిసి హిందీ చిత్రమైన శ్రీదేవి బంగ్లాలో కూడా నటించింది. ఇక 2021 లో చెక్ అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఇందులో నితిన్, రకుల్ ప్రీత్ సింగ్ లతో కలిసి తేనె పట్టుకునే అమ్మాయి పాత్రలో నటించింది. 2025లో కన్నడ చిత్రం విష్ణుప్రియలో కూడా నటించింది. ఇదే ఆమెకు తొలి కన్నడ చిత్రం కూడా కావడం గమనార్హం.లవ్ హ్యాకర్స్ అనే చిత్రంలో ప్రస్తుతం నటిస్తోంది. అలాగే మరికొన్ని ప్రాజెక్టులు ఈమె చేతిలో ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఒకవైపు సినిమాలలో నటిస్తూనే మరొకవైపు ఇలా పండుగను పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి సెలబ్రేషన్స్ జరుపుకోవడం నిజంగా విశేషం అని చెప్పాలి.



మాళవిక మీనన్ అద్భుతమైన రెడ్ వెల్వెట్‌లో మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965